సంగీత మేరు శిఖరాలు
రూ॥ 120/-
పేజీలు: 138

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ



రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ,ఇతర కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకోవడాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఇది నిరసన తెలిపే ప్రజాస్వామ్య హక్కుపై జరిగిన దాడి. కేంద్ర ప్రభుత్వం నుండి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తున్న మన యువతకు కాంగ్రెస్ కుటుంబం, దేశం మొత్తం అండగా నిలుస్తుంది.
– సిఎం ఎ.రేవంత్ రెడ్డి


సంపుటి 29, సంచిక: 33 | బుధవారం | 22-07-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00




## ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్
# మెరుపు ధర్నా



**ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఈడ్చుకెళ్లిన పోలీసులు**

**బలప్రయోగం చేయడంతో ముక్కు నుంచి రక్తం**

- పోలీసుల అదుపులోకి ఎస్‌పి అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ప్రియాంక గాంధీ సహా పలువురు కాంగ్రెస్ ఎంపిలు
- కాసేపు ధర్నాలో పాల్గొన్న రాజ్యసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ చీఫ్ మల్లిఖార్జున ఖర్గే
- మూడు గంటల పాటు సాగిన ధర్నాలో బైఠాయించిన కర్నాటక, కేరళ ముఖ్యమంత్రులు

**మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలని, విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్**

**న్యూఢిల్లీ :** నీట్ ప్రశ్న పత్రం లీకేజీ వ్యవహారంపై ఢిల్లీలో ఆందోళన చేసిన విద్యార్థులపై లాఠీఛార్జికు నిరసనగా ప్రధాని మోదీ నివాసం ఎదుట మెరుపు ధర్నా చేసిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ సహా, అనేక మంది కాంగ్రెస్ ఎంపిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు మూడు గంటల పాటు ధర్నా తరువాత పోలీసులు రాహుల్‌గాంధీని పోలీసులు బలవంతంగా అక్కడ నుంచి తరలించేందుకు ప్రయత్నించారు. ఆయనను నేలపై పడుకొని ప్రతిఘటించారు. పెద్ద ఎత్తున వచ్చిన పోలీసులు ఆయనను లాక్కెళ్ళేందుకు ప్రయత్నించగా, నేలపై పడుకొని తీవ్రంగా తరువాయి 8లో

## శంభు సరిహద్దు వద్ద
# రైతుల అడ్డగింత





- ఢిల్లీ 'కిసాన్ మహా పంచాయత్'కు తరలివెళ్తుండగా పోలీసుల చర్య
- వందలాది మంది బారికేడ్లు దాటే యత్నం - పరిస్థితి ఉద్రిక్తం
- పోలీసుల అదుపులో నలుగురు రైతులు

**శంభు /అంబాలా:** దేశ రాజధాని ఢిల్లీలో 'కిసాన్ మహాపంచాయత్' ఆందోళనలో పాల్గొనేందుకు భారీ సంఖ్యలో హర్యానా రాష్ట్రం సమీపంలోకి రైతులు తరలిరావడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రతిపాదిత భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా కిసాన్ మహా పంచాయత్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న వందలాది మంది పంజాబ్ రైతులను మంగళవారం శంభు సరిహద్దు వద్దకు చేరుకోగానే హర్యానా పోలీసులు వారిని అడ్డుకున్నారు. పొరుగు రాష్ట్రంలోకి ప్రవేశించే మార్గంలో బారికేడ్లు, సిమెంట్ దిమ్మెలను ఏర్పాటు చేయడం ద్వారా పోలీసులు ఈ చర్యకు పాల్పడ్డారు. దీంతో అక్కడ కొద్ది సేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. జిల్లాలో అంబాలా అధికారులు కూడా ఈ నిషేధాజ్ఞలు విధించారు. 'దేశ్ బచావో మోర్చా' ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలో ఒకరోజు పాటు 'కిసాన్ మహా పంచాయత్' ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తమ సంఘాల జెండాలను చేతపట్టుకుని పంజాబ్ నలుమూలల నుంచి వందలాది రైతులు నిరసనలో పాల్గొనేందుకు బస్సుల్లో జాతీయ రాజధాని వైపునకు వెళ్లేందుకు శంభు సరిహద్దుకు చేరుకున్నారు. కానీ పోలీసులు వారిని హర్యానాలోకి ప్రవేశించేందుకు అనుమతించలేదు. పంజాబ్, హర్యానా సరిహద్దు వద్ద భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు. హర్యానా ప్రవేశ ద్వారమైన ఘగ్గర్ నదిపై ఒకదానికి ఒకటి గొలుసులతో గట్టిగా కట్టివేసిన బారికేడ్లను ఏర్పాటుచేసి వాటర్ కెనాన్లను సిద్ధంగా ఉంచారు.అంబాలా పోలీస్ సూపరింటెండెంట్ అజిత్‌సింగ్ షెకావత్, ఇతర పోలీస్ అధికారులు పరిస్థితిని పర్యవేక్షించేందుకు ఆ ప్రదేశంలోనే మకాం వేశారు.పెద్ద సంఖ్యలో రైతులు హర్యానాలోకి ప్రవేశించేందుకు రోడ్డును దాటేందుకు ప్రయత్నిస్తారని తరువాయి 8లో

## రాహుల్ అరెస్టు అప్రజాస్వామికం

- లీకేజీ వ్యవహారాన్ని నాన్చుతున్న కేంద్రం : కూనంనేని విమర్శ
- యువతతో పెట్టుకున్న బిజెపి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయ్

ప్రజాపక్షం/హైదరాబాద్



నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూ ఢిల్లీలో నిరసన చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని బలవంతంగా అరెస్టు చేయడాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్రంగా ఖండించారు. విద్యార్థులు, యువతపై బలప్రయోగం చేయడం, అక్రమ కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.'చలో పార్లమెంట్' కార్యక్రమంలో పాల్గొన్న వేలాది మంది విద్యార్థులు, యువతపై బాష్పవాయువు ప్రయోగించడం, లాఠీ ఛార్జ్ చేయడం, ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చకు తరువాయి 12లో


# బెదరని యువత

- దీక్షా శిబిరం పునరుద్ధరణ
- భారీగా జంతర్‌మంతర్‌కు తరలివస్తున్న జనం
- సంఘీభావం ప్రకటించిన అరవింద్ కేజ్రీవాల్, శరద్ పవార్





**న్యూఢిల్లీ :** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) సోమవారం చేపట్టిన 'చలో సన్సాద్' ర్యాలీని అడ్డుకుని విద్యార్థులు, పార్టీ మద్దతుదారులపై పోలీసులు లాఠీచార్జ్ చేసినా, బాష్ప వాయువు గోళాలు ప్రయోగించానా అదరలేదు, బెదరలేదు. ఒక వైపు భారీ వర్షం కురుస్తున్నా, మరోవైపు పటిష్ట భద్రత ఉన్నప్పటికీ రాత్రంతా నిరసనకారులు జంతర్ మంతర్ వద్ద శిబిరం ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం ఉదయం, వలంటీర్లు నిరసన స్థలాన్ని శుభ్రం చేయగా, పోలీసుల చర్యలో గాయపడిన మద్దతుదారులకు సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే క్షమాపణ చెప్పారు. సోమవారం పోలీసులు టెంట్లు, ఇతర తాత్కాలిక ఏర్పాట్లను తొలగించిన తర్వాత నిలబడి ఉన్న ఏకైక నిర్మాణం అయిన వేదికను వలంటీర్లు శుభ్రం చేస్తుండగా, నిరసన ప్రదేశం చుట్టూ భారీ భద్రత కొనసాగింది. వేదిక పై కప్పిన టెంట్ కూడా చిరిగిపోయిన స్థితిలో ఉంది. అయితే వందలాది మంది విద్యార్థులు, మద్దతుదారులు మళ్లీ జంతర్ మంతర్ వద్దకు తిరిగి వచ్చారు. పోలీసుల బలప్రయోగం తమ ఆందోళనను కొనసాగించాలనే సంకల్పాన్ని మరింత బలపరిచిందని వారు అన్నారు. నీట్‌యుజి పరీక్షలో జరిగిన తరువాయి 8లో




07 సోనమ్ వాంగ్‌చుక్‌ను..ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించేందుకు 'ఢిల్లీ హైకోర్టు ఒకే'


## పోలీసు చర్యలపై పార్లమెంట్‌లో అమిత్ షా ప్రకటన చేయాలి

**వామపక్ష పార్లమెంటేరియన్ల బృందం డిమాండ్ • జంతర్‌మంతర్ సందర్శన**

**న్యూఢిల్లీ :** సిజెపి నేతృత్వంలో సోమవారం చేపట్టిన 'పార్లమెంట్ మార్చ్' సందర్భంగా విద్యార్థులపై పోలీసు చర్యలకు సంబంధించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటన చేయాలని వామపక్ష పార్లమెంటేరియన్ల బృందం డిమాండ్ చేసింది. విద్యా రంగంలో జరుగుతున్న అవకతవకలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు, వామపక్ష పార్లమెంటేరియన్ల బృందం మంగళవారం జంతర్ మంతర్‌ను సందర్శించింది. ఈ బృందంలో సిపిఐ రాజ్యసభ ఎంపి పి.సందోష్ కుమార్, సిపిఐ(ఎం) రాజ్యసభ ఎంపిలు జాన్ బ్రిట్టాస్, ఎఎ రహీమ్, వి.శివదాసన్, ఆ పార్టీ లోక్‌సభ ఎంపిలు అమ్రా రామ్, ఎస్. వెంకటేశన్ తదితరులు ఉన్నారు. నిరసనకారులను ఉద్దేశించి సందోష్ కుమార్ మాట్లాడుతూ ఢిల్లీ పోలీసులు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తారు కాబట్టి, పోలీసుల చర్యపై పార్లమెంటులో అమిత్ షా వివరణ ఇవ్వాలని ప్రతిపక్షం కోరుకుంటోందన్నారు. 'అమిత్ షా పార్లమెంటుకు వచ్చి ఏం జరిగిందో వివరించాలి, ఎందుకంటే విద్యార్థులపై ఇంతటి అఘాయిత్యాలను భారతదేశం ఎన్నడూ చూడలేదు. 300 మందికి పైగా విద్యార్థులు గాయపడ్డారు. దీనికి బాధ్యులు ఎవరు? ఢిల్లీ పోలీసులు అమిత్ షా ఆధీనంలో ఉన్నారు, ఆయన దేశానికి సమాధానం చెప్పాలి. ప్రతిపక్షమంతా ఇదే కోరుకుంటోంది' అని ఆయన తరువాయి 8లో



## ఆగస్టు 10న ముసాయిదా ఓటరు జాబితా

- సిఇఒ సి.సుదర్శన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్‌ఐఆర్–2026) కార్యక్రమానికి సంబంధించి ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా ఎన్నికల అధికారులకు, జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు మెమో జారీ చేశారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఓలు) ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ఆగస్టు 3 వరకు నిర్వహించనున్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ కూడా అదే తేదీ నాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది. ముసాయిదా ఓటరు జాబితాను ఆగస్టు 10న ప్రచురించనుండగా, ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు అభ్యంతరాలు, తరువాయి 12లో

## భూసేకరణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే
# బదిలీవేటు తథ్యం



- కలెక్టర్లు, అధికారులపై సిఎం రేవంత్‌రెడ్డి గరం
- హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌లో పనుల జాప్యంపై అసంతృప్తి
- సెప్టెంబర్ 3లోగా కనీసం 10,000 ఎకరాల భూసేకరణకు ఆదేశం
- కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి, మక్తల్–నారాయణ పేట్–కొడంగల్ ఎత్తిపోతల పథకంపై సమీక్ష సమావేశం

ప్రజాపక్షం/వికారాబాద్

హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌లో జరుగుతున్న పనులలో జాప్యంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి , రాష్ట్ర పంచాయతీరాజ్, ఆర్‌అండ్ బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విపి.గౌతమ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రెటరీ శ్రీదేవి, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోంగ్తు , సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్‌తో కలిసి ఆయన పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నెలవారీ పనుల గురించి తనకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని కోరారు. పనుల్లో అలసత్వంవహించే తరువాయి 12లో

# ద్రోహులను క్షమించను

08

- కోల్‌కత్తాలో జరిగిన భారీ ప్రదర్శనలో టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ
- ముఖ్యమంత్రి సువేందు అధికారి నిజస్వరూపం బయట పెడతానని హెచ్చరిక
- కాక్రోచ్ జనతాపార్టీ నిరసన ప్రదర్శనల్లో పాల్గొంటా
- నాకు ఎలాంటి అహంభావం లేదు
- బెంగాల్‌లో బిజెపిని ఓడించేందుకు అందరూ ఇండియా కూటమి కింద ఏకం కావాలని వినతి



ప్రశ్నా పత్రాల లీకేజీ జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తూ పార్లమెంటుకు కూతవేటుదూరంలోని జంతర్‌మంతర్‌లో 44రోజులుగా ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మాట్లాడటానికి మనసురాని నరేంద్ర మోదీ ప్రభుత్వం, సోమవారం వారి 'పార్లమెంట్ మార్చ్' సందర్భంగా ప్రదర్శకులపై పోలీసుదాడులు జరిపించిన తీరు ప్రజాస్వామ్య ఉద్యమాలపట్ల ప్రభుత్వానికున్న విహ్యభావాన్ని బాహాటపరిచింది. విద్యార్థులపై నీచమైన, ఘోరమైన లాఠీఛార్జి, బాష్పవాయువు గోళాలు ప్రయోగించటంపై చర్చకు ప్రభుత్వం నిరాకరించిన కారణంగా ప్రతిపక్షాల నిరసనలతో పార్లమెంటు ఉభయ సభల సమావేశాలు మంగళవారం–రెండోరోజుకూడా మరుసటి రోజుకు వాయిదా పడ్డాయి. జంతర్‌మంతర్‌లో పోలీసులు సోమవారం తొలగించిన నిరాహారదీక్ష శిబిరాన్ని నిరసనకారులు మంగళవారం ఉదయం తిరిగి ఆక్రమించుకుని దీక్ష కొనసాగిస్తుండగా, కాంగ్రెస్‌పార్టీ విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావాన్ని నాటకీయమైన మలుపుతో తారాస్థాయికి తీసుకెళ్లింది. విద్యార్థులపై పాశవికమైన బలప్రయోగం, పరీక్షల సంక్షోభంపై ప్రభుత్వంలో పూర్తిగా కొరవడిన జవాబుదారీతనంపై సభలో చర్చ చేపట్టాలని స్పీకర్ ఓం బిర్లాను కలిసి ప్రతిపక్షనాయకుడు రాహుల్ గాంధీ, ఇతర ఎంపిలు కోరగా, ప్రభుత్వ అనుమతి కావాలంటూ ఆయన నిస్సహాయత వ్యక్తం చేశారు. సభ వాయిదా తదుపరి కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ వాద్రా, కె.సి.వేణుగోపాల్, జైరాం రమేష్, ఇతర ఎంపిలు, కర్నాటక, కేరళ ముఖ్యమంత్రులు డి.కె.శివకుమార్, సతీశన్, వందలాదిమంది కార్యకర్తలతో ప్రధాని నరేంద్ర మోదీ నివాస గృహం వద్దకు వెళ్లి, ప్రజాస్వామ్యానికి సంకెళ్లకు ప్రతీకగా చేతులు బంధించుకుని ఆకస్మికంగా రోడ్డుపై ధర్నాకు ఉపక్రమించి తమ ఆందోళన పట్ల దేశం దృష్టిని ఆకర్షించారు. విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కోరుతున్న విద్యార్థుల డిమాండ్‌ను, సోమవారంనాటి పోలీసు దారుణ కృత్యాలకు జవాబుదారీగా ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్ షా రాజీనామా డిమాండ్‌కు విస్తరించారు. నీట్ ప్రశ్నా

# అట్టుడుకుతున్న ఢిల్లీ మోదీకి కాంగ్రెస్ షాక్

పత్రాల లీకేజి సంబంధిత ఘటనలు, విద్యార్థులపై పోలీసు అకృత్యాలను పార్లమెంటులో చర్చించాలన్నది వారి ప్రధాన డిమాండ్. దాదాపు 3గంటల పాటు జరిగిన ఈ ఆందోళన సందర్భంలో ప్రభుత్వం తరఫున పిఎంఒ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వచ్చి రాహుల్‌తో జరిపిన చర్చలు ఫలించలేదు. పార్లమెంటులో చర్చకు ఆయన అంగీకరించారుగాని విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌ను తిరస్కరించారు. అనంతరం పోలీసులు కాంగ్రెస్ నాయకులను అక్కడినుంచి బలవంతంగా తరలించారు.

కేంద్ర ఆరోగ్యమంత్రి, బిజెపి మాజీ అధ్యక్షుడు జె.పి.నడ్డాను సోమవారం కలుసుకున్న కాక్‌రోచ్ జనతాపార్టీ ప్రతినిధులు మూడు డిమాండ్లు ఆయనకు అందజేశారు. ఒకటి, 21రోజుల నిరాహారదీక్షనుంచి బలవంతంగా సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించిన ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ చుక్‌కు స్వేచ్ఛ. (ఆయన ఇష్టానుసారం ప్రైవేటు ఆసుపత్రికి తరలించేందుకు కోర్టు మంగళవారం అనుమతించింది). రెండు, నీట్ పేపర్ లీకేజీ జవాబుదారీతనం వహిస్తూ విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా. మూడు, పేపర్ లీకేజి దరిమిలా నిరాశోపహతులై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లింపు. "నిరసనకారుల అభ్యర్థన"పైనే తాను వారితో సంభాషించానని, కోర్కెల పత్రం తీసుకున్నానని నడ్డా చెప్పటంలోనే ప్రభుత్వ అహంకారం వెల్లడవుతున్నది. నెలరోజులపైబడి నిరసన ఆందోళన ఉధృతంగా జరుగుతున్నా వారివద్దకు వెళ్లి లేదా వారి ప్రతినిధులను పిలిపించుకుని మాట్లాడాలన్న సున్నితత్వం కొరవడిన ప్రభుత్వం, వీధుల్లో రణరంగం జరుగుతుండగా విద్యార్థి ప్రతినిధులకు నడ్డాను కలుసుకునే అవకాశం ఎందుకు కల్పించినట్లు?

అమిత్ షా పోలీసుల తీరే ప్రత్యేకం. నిరాహారదీక్ష శిబిరం వద్ద ఎన్నో అవాంతరాలు కలిగిస్తూ వచ్చిన, అక్కడకు వచ్చి సంఘీభావం తెలియజేసే వారిగుర్తించి కూపీలు లాగుతున్న ఢిల్లీ పోలీసులు, ఇప్పుడు విద్యార్థుల ఆందోళన వెనుక ఎవరున్నారని ఆరాతీస్తున్నారట. విద్యార్థులు 60మందికి పైగా గాయపడితే 118 మంది పోలీసు అధికారులు గాయపడ్డారని లెక్కలు వెల్లడించి తమ అమానుష దాడిని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. 'చలో పార్లమెంట్' కు పర్మిషన్ లేదనేది వారు చెప్పే కారణం. పర్మిషన్ ఇచ్చి ఉంటే ప్రశాంతంగానే నిరసన ప్రదర్శన జరిగేది కాదా? పర్మిషన్ నిరాకరించమని ఆదేశించిందెవరు?

వివరగా, మోదీ ప్రభుత్వానికి ప్రజల నిరసనలు గిట్టవు. పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా షహీన్‌బాగ్‌లో జరిగిన సుదీర్ఘ ఆందోళనలో పాల్గొన్న మహిళలను హింసించారు. వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళనకు దిగిన రైతులను ఢిల్లీలోకి రానివ్వకుండా హర్యానా, యుపి సరిహద్దులోనే నిలువరించి సంవత్సరంపాటు అడ్డుకుంది ప్రభుత్వం. చివరకు మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి ఆ చట్టాలను ఉపసంహరించుకున్నారు. మళ్లీ ఇప్పుడు – అమెరికాతో కుదరనున్న వాణిజ్య ఒప్పందాన్ని తిరస్కరించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ ప్రదర్శనకు బయలుదేరిన పంజాబ్, హర్యానా రైతులను ఈ రోజు (మంగళవారం) హర్యానా పోలీసులు శంభు కేంద్రం వద్ద అటకాయించారు.

ఈ బిజెపి/ఆర్ఎస్ఎస్ ప్రభుత్వానికి నిరంకుశత్వంలో తప్ప ప్రజల ప్రజాస్వామిక హక్కుల్లో విశ్వాసం లేదని వెల్లడవుతున్నది. సిజెఐ విద్యార్థి ఆందోళనపట్ల మొండివైఖరి కూడా ఈ ప్రజావ్యతిరేక మానసిక స్థితిలో భాగమే. పార్లమెంటులో కూడా ప్రజాసమస్యలు చర్చించే అవకాశం ప్రతిపక్షాలకు ఇవ్వటం లేదు. దేశ ప్రజాస్వామిక సాంప్రదాయాలు ఈ నిరంకుశ లక్షణాన్ని ఎంతో కాలం అనుమతించవు.

## అప్పుడు ధన్‌ఖడ్, నేడు నీట్ నిరసనలు అణచివేత

**గతంలో రైతుల దుస్థితిపై ఆందోళన వ్యక్తం చేసిన, మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ చేత బలవంతంగా రాజీనామా చేయించారు. ఇప్పుడు పేపర్ లీకేజీలపై నిరసనలు చేస్తున్న యువతను, విద్యార్థులను అణచివేస్తున్నారు. భారత ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ ఛైర్మన్‌గా ధన్‌ఖడ్‌కు ఐదేళ్ల పదవీ కాలం ఉంది. అయినప్పటికీ ఆయనను కేవలం మూడేళ్లు పూర్తయిన దశలోనే బలవంతంగా రాజీనామా చేయించారు. కనీసం రాజ్యసభ సభ్యుల నుంచి ధన్‌ఖడ్‌కు మర్యాదపూర్వకమైన, అధికారిక వీడ్కోలు కూడా లభించలేదు.**

– కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్



NATIONAL FLAG DAY

## భరతజాతి గుండె సవ్వడి.. మన జాతీయ జెండా

భారత జాతీయ జెండా రెపరెపలే 146 కోట్ల భారతీయుల గుండె లబ్ డబ్‌లు. దేశ ఔన్నత్యం, ఐక్యత, దేశ భక్తి, త్యాగం, జాతి గౌరవం, ఆకాంక్షలు, న్యాయం, సార్వభౌమాధికారం, శాంతి, సౌభాగ్యం, స్వేచ్ఛా స్వాతంత్ర్య పోరాటాలకు ఏకైక చిరునామాగా త్రివర్ణ పతాకం నిలుస్తున్నది. మచిలీపట్నానికి చెందిన తెలుగు బిడ్డ పింగళి వెంకయ్య రూపొందించిన ప్రస్తుత త్రివర్ణ జాతీయ పతాకాన్ని 22 జులై 1947న మన భారత రాజ్యాంగ సభ ఆమోదించడం, 15 ఆగస్టు 1947న భారత ప్రభుత్వం అధికారికంగా ఎగుర వేస్తూ అంగీకరించడం మన స్వతంత్ర భారత ఘన చరిత్రలో ఒక ముఖ్య ఘట్టంగా నిలిచిపోయింది. ప్రతి ఏట జులై 22న దేశవ్యాప్తంగా భారతీయులు జాతీయ పతాక ఆమోద దినోత్సవం లేదా జాతీయ పతాక దినోత్సవం (నేషనల్ ఫ్లాగ్ డే ఆర్ నేషనల్ ఫ్లాగ్ అడాప్షన్ డే) రూపంలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది.

**త్రివర్ణ పతాకంలో దాగిన నిగూఢ అనంత అర్థాలు:**

చేనేత వస్త్రంతో మాత్రమే రూపొందించబడుతున్న మన జాతీయ జెండా 2:3 నిష్పత్తితో దీర్ఘ చతురస్రాకారంలో మూడు రంగులతో, మధ్యలో నావీ బ్లూ రంగు అశోక చక్రం అమర్చబడి అందంగా ఉంటుంది. జాతీయ పతాకంలోని పై భాగంలో కాషాయ రంగు, మధ్యలో తెలుపు వర్ణం, క్రింది భాగాన ఆకుపచ్చ రంగు సమాన భాగాలుగా అమర్చబడి ఉంటాయి. మధ్యలో ఉన్న తెలుపు వర్ణం కేంద్రంగా నావీబ్లూ రంగు కలిగిన అశోక ధర్మ చక్రం అమర్చబడి ఉంటుంది. పై భాగాన ఉన్న కాషాయ రంగు దేశ శక్తి సామర్థ్యాలకు, త్యాగ స్ఫూర్తి, ధైర్యాలకు ప్రతీకగా నిలుస్తున్నది. మధ్యలో ఉన్న శ్వేత వర్ణం శాంతి, స్వచ్ఛత, సత్యాలను సూచిస్తున్నది. క్రింది భాగాన ఉన్న హరిత వర్ణం సమృద్ధి, హరిత సంపద, శుభప్రదం, సమగ్రాభివృద్ధిలను ప్రకటిస్తున్నది. మధ్య తెలుపు వర్ణం కేంద్రంగా సత్య ధర్మాలకు ప్రతీకగా అశోక ధర్మ చక్రం అమర్చబడి ఉన్నది. అశోక చక్రం ప్రగతి రథాలకు చిరునామాగా, చక్రంలోని 24 చువ్వలు స్వేచ్ఛ భారత స్ఫూర్తి, 24 గంటలు నిరంతర ప్రగతి పరుగులను ప్రకటిస్తున్నది. చక్రంలోని సారనాథ్ సింహం ధైర్య, గంభీర, న్యాయ, సుస్థిరతను సూచిస్తున్నది.

**భారత జాతీయ పతాక చరిత్ర :** 1907లో కాషాయం, పసుపు, ఆకుపచ్చ వర్ణాలతో కూడిన జెండాను బెర్లిన్ కమిటీ రూపొందించడం జరిగింది. అనంతరం అన్నీబిసెంట్, బాల గంగాధర తిలక్‌లతో కూడిన దేశ భక్తులు ఐదు ఎరుపు చారలు, నాలుగు ఆకుపచ్చ చారలు, ఏడు నక్షత్రాలు, ఎడమ పై భాగాన యూనియన్ జాక్ సంతకంతో కూడిన పతాకాన్ని ఎగురవేయడం జరిగింది.1931లో వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకం మధ్యలో చరకా చేర్చబడింది. దేశ స్వాతంత్ర్యానికి కొద్దిరోజుల ముందు నేటి మన జాతీయ పతాకానికి తుది రూపం ఇస్తూ త్రివర్ణ పతాకం మధ్య భాగంలో చరకాకు బదులు గా అశోక ధర్మ చక్రం చేర్చబడింది. ఈ జాతీయ జెండాను 22 జులై 1947న భారత రాజ్యాంగ సభ అధికారికంగా ఆమోదించడం ఒక అపూర్వ ఘట్టంగా దేశ స్వాతంత్ర్య చరిత్రలో నిలిచిపోయింది. మన జాతీయ జెండాను ఉదయం ఎగుర వేసి సాయంత్రం సూర్యాస్తమయానికి ముందు వరకు ఉంచుకోవచ్చని, మతపరమైన సందర్భాల్లో వాడకూడదని, నేలకు గాని నీటికి గాని తగలకుండా చూసుకోవాలని, జాతీయ జెండా కన్న ఎత్తులో మరో జెండా ఉండకూడదనే నియమనిబంధనలు కూడా చేర్చబడినవి. జెండా ఎగురవేసిన వెంటనే జాతీయ గీతాన్ని ఆలపించడం ఒక అలవాటుగా మారింది.

**(22 జులై జాతీయ జెండా అమోదించిన దినోత్సవం శుభ సందర్భంగా)**

# ప్రశ్నించే గొంతులపై ఉక్కుపాదం... ప్రజాస్వామ్యానికి ప్రమాదం



ఎండి. ఉస్మాన్ ఖాన్
9912580645

ప్రజాస్వామ్య ఆరోగ్యాన్ని కొలవాలంటే ఎన్నికల సంఖ్యను కాదు, అధికారాన్ని ప్రశ్నించగల స్వేచ్ఛను చూడాలి. ఏ సమాజంలోనైనా యువత వీధుల్లోకి దిగడం ఒక సాధారణ రాజకీయ సంఘటన కాదు. అది సమాజం లోపల పేరుకుపోయిన అసంతృప్తి బయటపడే క్షణం. ముఖ్యంగా విద్య, ఉపాధి, అవకాశాల వంటి జీవితాన్ని నిర్ణయించే అంశాలపై వేలాదిమంది యువకులు ఒకే స్వరంతో మాట్లాడడం వెనుక తాత్కాలిక ఆవేశం ఉండదు. దీర్ఘకాలంగా పేరుకుపోయిన నిరాశ, అనిశ్చితి, నమ్మకద్రోహం, అవమానం కలిసిన అనుభవం ఉంటుంది. ఉద్యమాలు ఎప్పుడూ ఒక సంఘటనతో పుట్టవు; అనేక నిర్లక్ష్యాల సమాహారంగా పుడతాయి.

ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో కనిపిస్తున్న ఆందోళనను కూడా ఈ నేపథ్యంతోనే అర్థం చేసుకోవాలి. ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల నిర్వహణలో లోపాలు, నియామకాల ఆలస్యం, ఉపాధి అవకాశాల సంకుచితం ఇవి విడివిడిగా కనిపించే సమస్యలు కావచ్చు. కానీ యువత దృష్టిలో ఇవన్నీ ఒక దానితో ఒకటి సంబంధమున్న ప్రశ్న లు. వ్యవస్థ నిజంగా మా శ్రమను గౌరవిస్తోందా? సంవత్సరాల పాటు పుస్తకాల మధ్య గడిపిన సమయం, కుటుంబాలు చేసిన త్యాగం, భవిష్యత్తుపై పెట్టుకున్న ఆశలు చివరకు అనిశ్చితి ముందర నిలబడితే, ఆ బాధ వ్యక్తిగతంగా మిగలదు. అది సామూహిక అసంతృప్తిగా మారుతుంది.

ఇలాంటి సందర్భాల్లో నిరసన కేవలం హక్కు మాత్రమే కాదు; ప్రజాస్వామ్యం తనను తాను సరిదిద్దుకునే ప్రక్రియ కూడా. ఎందుకంటే ప్రజలు వీధుల్లోకి రావడం అంటే, వ్యవస్థలో ఎక్కడో సంభాషణ ఆగిపోయిందని అర్థం. ప్రభుత్వ కార్యాలయాల్లో వినిపించని స్వరం చివరకు రోడ్ల మీద వినిపిస్తుంది. చర్చకు అవకాశం తగ్గిన చోటే ఉద్యమాలు పుడతాయి. అందుకే ప్రజాస్వామ్యంలో ప్రతి ఉద్యమాన్ని ముందుగా శాంతిభద్రతల సమస్యగా కాక, ఒక సామాజిక సంకేతంగా చూడడం అవసరం.

ఈ నేపథ్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ మరోసారి జాతీయ చర్చలోకి రావడం యాదృచ్ఛికం కాదు. అది కేవలం రాజధానిలోని ఒక ప్రదేశం కాదు; భారత ప్రజాస్వామ్య జ్ఞాపకాలతో నిండిన ఒక రాజకీయ స్థలం. రైతులు, విద్యార్థులు, ఉద్యోగార్థులు, మహిళలు, సామాజిక ఉద్యమకారులు ఎవరికి అధికార ద్వారాలు మూసుకుపోయాయని అనిపించినా, చివరకు చేరే చిరునామా అదే. అందుకే జంతర్ మంతర్‌ను ఒక భౌగోళిక ప్రదేశంగా మాత్రమే చూడలేం. వినిపించని స్వరాలు ఒకదానికొకటి తోడై ప్రజాస్వామ్యా న్ని మేల్కొలిపే ప్రతీకగా దాన్ని చూడాలి.

ప్రతి ఉద్యమం సరైనదే కావచ్చు అనడం ఎంత అతిశయోక్తో, ప్రతి ఉద్యమాన్ని కుట్రగా చిత్రీకరించడం కూడా అంతే ప్రమాదకరం. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు విమర్శలను దుష్ప్రచారంతో కాదు, వాస్తవాలతో ఎదుర్కోవాలి. ప్రశ్నలపై దేశద్రోహం, విదేశీ హస్తం, రాజకీయ ప్రేరేపణ వంటి ముద్రలు వేసే ప్రయత్నం చేసినప్పుడల్లా అసలు సమస్య చర్చ నుంచి తప్పుకుంటుంది. ప్రశ్నించిన వ్యక్తి మీదే విచారణ మొదలవుతుంది. కానీ ప్రశ్న మాత్రం సమాధానం కోసం అలాగే మిగిలి ఉంటుంది. ఇదే నేటి భారత ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న అత్యంత కీలకమైన సవాలు. ప్రభుత్వాల బలం ఎన్నికల్లో సాధించిన మెజారిటీలో మాత్రమే ఉండదు; ప్రజలు అడిగే అసౌకర్యమైన ప్రశ్నలను వినగలిగే ధైర్యంలో కూడా ఉంటుంది. విమర్శలను భరించలేని అధికారం ఎంత బలవంతంగా కనిపించినా, అది అంతర్గతంగా అసురక్షిత భావానికే సంకేతం. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో అధికారానికి నిజమైన రక్షణ పోలీసు బారికేడ్లు కాదు; ప్రజల విశ్వాసం.

ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ అత్యున్నత శాసన వేదిక అయితే, వీధి అత్యున్నత ప్రజా వేదిక. ఈ రెండూ పరస్పర ప్రత్యర్థులు కావు; ఒకదానికొకటి పూరకాలు. పార్లమెంట్ ప్రజల ఆకాంక్షలను చట్టాలుగా మలచే స్థలం. వీధి, ఆ ఆకాంక్షలు విస్మరించబడినప్పుడు అధికారాన్ని అప్రమత్తం చేసే స్థలం. అందుకే చరిత్రను తిరగేస్తే, గొప్ప సామాజిక మార్పులు ముందుగా వీధుల్లోనే పుట్టి, తరువాత శాసనసభల వరకు చేరినట్టు కనిపిస్తుంది. స్వేచ్ఛ, సమానత్వం, కార్మిక హక్కులు, పౌరహక్కులు, విద్యా సంస్కరణలు ప్రజాస్వామ్యం సాధించిన ప్రతి విజయానికి ప్రజా ఉద్యమాల ముద్ర కనిపిస్తుంది.

భారతదేశ చరిత్ర కూడా దీనికి మినహాయింపు కాదు. స్వాతంత్ర్య పోరాటం వీధుల్లోనే మొదలై పార్లమెంటరీ ప్రజాస్వామ్యంగా రూపాంతరం చెందింది. అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ)కి వ్యతిరేకంగా ప్రజలు రోడ్లపైకి రావడం భారత రాజకీయాలను కొత్త మలుపు తిప్పింది. రైతు ఉద్యమాలు, అవినీతి వ్యతిరేక ఆందోళనలు, మహిళా ఉద్యమాలు, విద్యార్థి పోరాటాలు ఇవన్నీ ప్రజాస్వామ్యాన్ని మరింత జవాబుదారీగా మార్చిన అధ్యాయాలే. అందుకే వీధిలో వినిపించే ప్రతి నినాదాన్ని అధికార వ్యతిరేకతగా మాత్రమే చూడడం చరిత్రను అర్థం చేసుకోలేని సంకుచిత రాజకీయ దృష్టికి సంకేతం.

ఈ నేపథ్యంలో ఒక ప్రశ్న తప్పనిసరిగా ఎదురవుతుంది. ప్రజలు ఎందుకు నిరసన వ్యక్తం చేస్తారు? ప్రతి ఉద్యమం వెనుక రాజకీయ పార్టీలు ఉంటాయా? చరిత్ర చెబుతున్న సమాధానం వేరేలా ఉంటుంది. ప్రజలు మొదట ప్రభుత్వాలను మార్చాలని ఉద్యమించరు. ముందుగా ఒక సమస్య పరిష్కారం కోరుతారు. ఆ సమస్యను నిర్లక్ష్యం చేసినప్పుడు అసంతృప్తి పెరుగుతుంది. ఆ అసంతృప్తిని కూడా పట్టించుకోనప్పుడు అది ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నగా మారుతుంది. చివరికి అదే రాజకీయ ప్రతిఘటనగా రూపాంతరం చెందుతుంది. ఒక సమస్య నుంచి ప్రారంభమైన ఉద్యమం, పాలనా తీరుపై ప్రజాభిప్రాయంగా మారే ప్రక్రియ అన్ని ప్రజాస్వామ్య దేశాల్లో కనిపించిన చారిత్రక వాస్త వం.

ప్రభుత్వాలు ఈ సంకేతాలను ఎంత త్వరగా అర్థం చేసుకుంటే అంత మంచిది. ఎందుకంటే ఉద్యమాలను బలప్రయోగంతో కొంతసేపు చెదరగొట్టవచ్చు. రోడ్లను ఖాళీ చేయించవచ్చు. కానీ అసంతృప్తిని సృష్టించిన కారణాలను లాఠీలతో చెదరగొట్టలేరు. ప్రజల మనసుల్లో పేరుకుపోయిన అవిశ్వాసాన్ని దుష్ప్రచారంతో తుడిచేయలేరు. ఒక సమాజం యువత విశ్వాసాన్ని కోల్పోవడం ఏ ప్రభుత్వానికైనా కనిపించని పెద్ద సంక్షోభం. అలాంటి సంక్షోభాలకు పరిష్కారం శక్తి ప్రదర్శన కాదు; జవాబుదారీతనం, పారదర్శకత, సంభాషణ మాత్రమే.

జంతర్ మంతర్ ఖగోళ గమనాలను పరిశీలించేందుకు నిర్మించిన స్థలమైనా, కాలక్రమంలో భారత ప్రజాస్వామ్య స్పందనను నమోదు చేసే రాజకీయ ప్రదేశంగా మారింది. అక్కడ వినిపించే నినాదాలు కేవలం ఆనాటి కోపాన్ని మాత్రమే కాక, సమాజంలో పేరుకుపోతున్న అసంతృప్తికి రాజకీయ రూపాన్ని ఇస్తాయి. అందుకే జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వైపు కదిలే అడుగులు ప్రజాస్వామ్యంలో ఒక ప్రతీకాత్మక ప్రయాణం. దేశ అత్యున్నత ప్రజాస్వామ్య సభకు ప్రజల ఆవేదన చేరాలనే ఆకాంక్షకు అది ప్రతిరూపం. ఆ స్వరం వీధుల్లో ఎక్కువసేపు నిలవడం, శాసనవ్యవస్థలో సంభాషణ బలహీనపడిందనే సంకేతం.

భారత ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికలతో నడిచే వ్యవస్థ కాదు. ఎన్నికలు ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తాయి; కానీ ప్రజాస్వామ్యాన్ని సజీవంగా ఉంచేది నిరంతర ప్రజా భాగస్వామ్యం. ఓటు వేసిన రోజుతో పౌరుడి బాధ్యత, ఎన్నికల్లో విజయం సాధించిన రోజుతో ప్రభుత్వ జవాబుదారీతనం ముగిసిపోవు. నిర్ణయాలు కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్నాయనే అభిప్రాయం బలపడుతున్న వేళ, ప్రజాస్వామ్య సంస్థల పాత్ర, స్వతంత్ర మాధ్యమాల బాధ్యత, పౌర సమాజ చైతన్యం మరింత కీలకంగా మారతాయి. బలమైన ప్రజాస్వామ్యం అంటే కేవలం బలమైన ప్రభుత్వం కాదు; బలమైన సంస్థలు, స్వేచ్ఛగా పనిచేసే వ్యవస్థలు, భయపడకుండా ప్రశ్నించే పౌర సమాజం.

ఇక్కడ ప్రతిపక్షాల పాత్రను కూడా విస్మరించలేం. ప్రజల సమస్యలను శాసనసభల్లో బలంగా వినిపించడం, వీధుల్లో వ్యక్తమవుతున్న ఆవేదనను రాజ్యాంగబద్ధమైన రాజకీయ చర్చగా మలచడం, ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెట్టడం ఇవే ప్రతిపక్ష ప్రజాస్వామ్య రాజకీయాల అసలు ప్రమాణాలు. ఈ పాత్ర బలహీనపడినప్పుడు ప్రజా ఉద్యమాలే ప్రత్యామ్నాయ రాజకీయ భాషగా మారడం సహజం.

అయితే ఉద్యమాలకూ కొన్ని బాధ్యతలు ఉంటాయి. శాంతియుత నిరసన, రాజ్యాంగబద్ధమైన పోరాటం, ప్రజా ప్రయోజనాల పట్ల నిబద్ధత ద్వారానే ఉద్యమాలకు విశ్వసనీయత, నైతిక బలం లభిస్తాయి.

ఈ రోజు దేశం ఎదుర్కొంటున్న అసలు ప్రశ్న ఏమిటంటే, ప్రజల అసంతృప్తిని రాజకీయ శత్రుత్వంగా చూడడమా..లేక ప్రజాస్వామ్య హెచ్చరికగా అర్థం చేసుకోవడమా.. అధికారాన్ని సవాలు చేసే ప్రతి స్వరం ప్రభుత్వానికి వ్యతిరేకం కాకపోవచ్చు; కొన్నిసార్లు అదే స్వరం ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరిచే అవకాశాన్ని ఇస్తుంది. ప్రజాస్వామ్యం తనను తాను సరిదిద్దుకునే శక్తిని కోల్పోకుండా ఉండాలంటే మూలం ప్రజలే, వారి ప్రశ్నలే. ఏ ప్రభుత్వమూ కేవలం అధికారంతో శాశ్వతంగా ఉండలేదు, బలప్రయోగంతో ప్రజల మనసులను గెలుచుకోలేదు. అధికారం చట్టాలను అమలు చేయగలదు కానీ విశ్వాసాన్ని ఆదేశించలేదు; భయాన్ని సృష్టించగలదు కానీ సమ్మతిని కొనలేదు.

ఈ రోజు దేశంలోని విద్యార్థులు, యువత అడుగుతున్న ప్రశ్నలు వ్యవస్థ నిష్పాక్షికతను, శ్రమకు దక్కే న్యాయాన్ని, ప్రశ్నించే హక్కు భద్రతను పరీక్షిస్తున్నాయి. ఈ ప్రశ్నలకు సమాధానాలు దేశ ప్రజాస్వామ్య సంస్కృతిని నిర్ణయిస్తాయి. నిరసన అనేది వ్యవస్థ వైఫల్యానికి సంకేతం మాత్రమే కాదు, వ్యవస్థ ఇంకా సజీవంగా ఉందనడానికి కూడా నిదర్శనం. ప్రజలు ప్రశ్నించడం మానేసినప్పుడు, భయాన్ని విధిగా భావించినప్పుడే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది.

భారత రాజ్యాంగం 'మేము భారత ప్రజలం...' అని ప్రారంభమవుతుంది. ఈ దేశంలో సార్వభౌమాధికారం ప్రజలదే. పార్లమెంట్ ఆ సార్వభౌమాధికారానికి ప్రతినిధి మాత్రమే, ప్రభుత్వం ప్రజల తరఫున పాలించే వ్యవస్థ మాత్రమే.

ప్రజాస్వామ్యం కేవలం ఓట్లతో గెలిచేది కాదు, విశ్వాసాన్ని నిలబెట్టుకునేది. ఆ విశ్వాసం నిలవాలంటే అధికారానికి వినే సంస్కారం, ప్రతిపక్షానికి బాధ్యతాయుతమైన దృష్టి, పౌర సమాజానికి ప్రశ్నించే ధైర్యం ఉండాలి. నేడు దేశ వీధుల్లో వినిపిస్తున్న స్వరాలు భారత ప్రజాస్వామ్యం తన గురించి తాను వేసుకుంటున్న ప్రశ్నలు. వాటికి సమాధానం వెతకడం అందరి బాధ్యత. ఎందుకంటే నిరంతరం ప్రశ్నించే పౌర చైతన్యమే ప్రజాస్వామ్యానికి శాశ్వత ప్రాణవాయువు.





# విశ్వాసం – వ్యాపారం – రాజకీయం

శాస్త్ర సాంకేతికాభివృద్ధి శరవేగంగా జరుగుతుండగా, హేతువాద దృష్టి బలపడాల్సింది పోయి అనాదిగా సమాజంలో పాదుకుని ఉన్న ఆస్తికత్వం ప్రబలం కావటం మనదేశంలోని వైరుధ్యం. మనిషిలోని విశ్వాసాన్ని, బలహీనతను ఉపయోగించుకుని కొందరు భక్తిపై వ్యాపారం చేస్తుండగా, మరికొందరు రాజకీయాలకు ఉపయోగించుకుంటున్నారు. దానికితోడు సోషల్ మీడియా ప్రభావం కూడా భక్తులు ఆలయాలకు పెద్ద సంఖ్యలో వెళ్లేందుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడుతుంది. దేవాలయాల ప్రాశస్త్యం, మొక్కితే కోర్కెలు నెరవేరుతున్నాయన్న సోషల్ మీడియా ప్రచారాల నేపథ్యంలో తమ కష్టాలు కూడా తీరుతాయోమోనన్న ఆశ మానవునిలో పెరుగుతున్నది. ఇప్పుడు ఆ విశ్వాసాన్ని వ్యాపారంగా మలిచే ప్రక్రియ జోరందుకుంది. దేవుని దగ్గరకు భక్తులు వెళ్లే బదులు దేవాలయాలకు భక్తులను ఆకర్షించే పనిలో ఆయా దేవాలయాల కమిటీలు ఉన్నాయి.

ఒక్క మాటలో చెప్పాలంటే విశ్వాసంపై వ్యాపారం చేస్తున్నారు. దేవాలయాల్లో భక్తుల దర్శనానికి ఒక రేటు, సత్వర దర్శనానికి మరో రేటు నిర్ణయించి భక్తుల మధ్య కూడా ఆర్థిక అంతరాలను చూపెడుతున్నారు. అన్నింటికి మించి దేవాలయాల్లో కానుకలు హుండీల్లో వేయండి అని అడుగడుగున దేవాల య ప్రాంగణాల్లో జరుగుతున్న ప్రచారం వ్యాపార ప్రక్రియను తలపిస్తుంది. తాము కోరిన కోర్కెలు నెరవేరాయనుకున్నప్పుడు తాము అనుకున్న మేరకు దేవునికి సమర్పించడం ఆనవాయితీ. కానీ ఇప్పు డు దేవాలయాల్లో జరుగుతున్న ప్రచారం వ్యాపార తంతును తలపిస్తూ కానుకలు వేయకపోతే అపరాధమేమోనన్న భావన స్ఫురించేలా జరుగుతున్నది. ఇక శఠగోపం విషయంలోనూ పళ్లెంలో వేసే నోటు ను బట్టే ఉంటుందంటే ఆశ్చర్యం కలుగక మానదు.

ఇక తెలుగు రాష్ట్రాల్లో ఉన్న దేవాలయాల్లో ప్రతి దానికి ఓ పైరవీ దానికో రేటు – రూములు కావాలన్న, సత్వర దర్శనం పొందాలన్న, వాహనాలు పార్కింగ్ చేసుకోవాలన్న పైరవీ, దానికో రుసుము చెల్లించాల్సిందే. ఈ పైరవీలు అడ్డదారుల్లో జరుగుతుండటం గమనార్హం. అయోధ్య రామాలయంలో నిధులే పక్కదారి పట్టాయి. కానీ తెలుగు రాష్ట్రాల్లోని ప్రసిద్ధ దేవాలయాల్లో పైరవీల మాటున రోజుకు ఎన్ని వేల రూపాయలు చేతులు మారుతున్నాయో ఆలోచించవచ్చు.

విశ్వాసం వ్యాపారంగా మారిన నేపథ్యంలో దాని నుంచి ఇప్పుడు రాజకీయం మొదలైంది. ప్రజల విశ్వాసాన్ని రాజకీయంగా మలుచుకుని అందలాలు ఎక్కేందుకు కొన్ని పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. దేవునిమీద నమ్మకం ఉన్న వారి ఆహార్యాన్ని, తీసుకునే ఆహారాన్ని ఎత్తి చూపుతున్నాయి. విశ్వాసం కలిగిన ప్రతి ఒక్కరికి ఒక మతాన్ని అంటగడుతూ ఆ మతంలో ఉన్న వారంతా ఒక పక్కనే నిలవాలన్న కోరిక ఇప్పుడు శృతిమించి డిమాండ్‌గా మారుతుంది. ఒక మతం వారు ఒక పార్టీకే ఓటు వేయాలని, వారు మాత్రమే దేశభక్తులన్న భావన స్ఫూరించేలా ప్రచారం జరుగుతుంది. చివరకు భక్తాగ్రేసురులైన మా పక్క నిలవకపోతే దేశద్రోహులేనన్న ప్రచారం ముంగిట చాలా మంది ఆలోచనలో పడే పరిస్థితిని తీసుకు వచ్చారు. ఒకప్పుడు ప్రకృతి పట్ల విశ్వాసంతో మొదలైన పూజ, ఆ పూజ నుంచి పుట్టుకొచ్చిన విగ్రహారాధన, విగ్రహారాధనతో మొదలైన దేవాలయాల నిర్మాణం, అభివృద్ధి ఆ తర్వాత వ్యాపారంగా మారింది. ఇప్పుడు వ్యాపారం నుంచి రాజకీయం మొదలైంది. దేవుడు ఉన్నాడా లేదా అన్నది వ్యక్తిగత విశ్వాసం. కొలిచే వారు కొలుస్తూనే ఉంటారు. ఏదో ఒక రూపాన్ని ఆరాధించే వారు ఆరాధించవచ్చు. ఇక్కడ తర్కానికి అవకాశం లేదు. కానీ విశ్వాసంతో వచ్చే భక్తులపై వ్యాపారం చేయడం, వ్యాపారం నుంచి రాజకీయంగా లబ్ధి పొందేందుకు ప్రయత్నించడమే ప్రశ్నించదగిన అంశం.

విభిన్న సంస్కృతులు, పద్ధతులు కలిగిన దేశంలో ప్రజల ఆచార వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం, విశ్వాసాన్ని దెబ్బతీసే రీతిలో వ్యవహరించడం కూడా శిక్షార్హ మే. పాలకులు ప్రజల విశ్వాసాల మీద వ్యాపారాలు చేసే శక్తులను, వ్యక్తులను అరికట్టాల్సి ఉంది. దేశంలో లౌకికవాదం అన్న పదాన్నే అంతర్ధానం చేయాలన్న ఆలోచనల నడుమ విశ్వాసాన్ని రాజకీయంగా మలుచుకునే చర్యలకు అడ్డుపడటం రాజ్యాంగబద్దంగా అంత తేలిక కాకపోవచ్చు.

**ఏనుగు వెంకటేశ్వరరావు, ఖమ్మం**




# నీట్ పేపర్ లీకేజీపై ప్రశ్నిస్తే విద్యార్థుల రక్తం కళ్ళ చూస్తారా?

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆగ్రహం**

**ప్రజాపక్షం/కరీంనగర్ :** నీట్ పేపర్ లీకేజీని ప్రశ్నిస్తూ వందలాది మంది విద్యార్థులు తమకు న్యాయం చేయాలని.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులను విచక్షణ రహితంగా చితకబాది.. భాష్ప వాయువు ప్రయోగించి వారి రక్తం కళ్ల చూసిన మోదీ నీకిది తగునా? అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చాడ మాట్లాడారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులను రక్తాలు కారే విధంగా కొట్టడం దుర్మార్గమని, ఉద్యమాలను అణచాలని చూస్తే మరింత పెరుగుతాయి తప్ప తగ్గవన్నారు. ప్రజలకు రక్షణగా ఉండాల్సిన మోదీ ప్రభుత్వం ప్రజలపై దాడులు చేయడాన్ని సిపిఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నైతిక విలువల గురించి శ్రీ రాముని గురించి, రామరాజ్యం గురించి గొప్పలు చెప్పే నరేంద్ర మోదీ వాటిని ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు. తెలంగాణ అంటేనే దక్కన్ పీఠమని, ఎత్తులో ఉందని, వంపులో గోదావరి ఉందని, కృష్ణా నది నీళ్ళకంటే గోదావరి నీళ్లే ఎక్కువగా ఉపయోగించుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని కరువు కోరల్లో నుండి కాపాడి వెంటనే ప్రజలకు తాగునీరు, సాగు నీరు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ఒకరి పై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కాలయాపన చేస్తున్నారని మండి పడ్డారు. తక్షణమే కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిల సహకారం తో మహారాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి తుమ్మిడి హట్టి వద్ద ప్రాజెక్ట్ నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. కరీంనగర్ దిగువ మానేరు జలాశయం నీరు కనిష్ఠ స్థాయికి పడిపోయిందని, వెంటనే ఎల్లంపల్లి మిడ్ మానేరు నుండి ఎల్ఎండికి నీరు వచ్చేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, న్యాలపట్ల రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు,బీర్ల పద్మ, కొట్టె అంజలి,నగర నాయకులు బాకం ఆంజనేయులు, కసిబోజుల సంతోష్ చారి పాల్గొన్నారు.

# ఆర్‌టిసి హమాలీలకు కూలీ రేటు తగ్గించడం అన్యాయం

**బస్తాకు రూ.20లకు పెంచాలి : కూనంనేని డిమాండ్**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్‌టిసి బస్‌స్టేషన్లలో గతంలో ఒక బస్తాకు రూ.10లుగా ఉన్న హమాలీ కూలీ రేటును రూ.7.40కు తగ్గించడం అన్యాయమని, దీనిని తక్షణమే సవరించి రూ.20 లకు పెంచాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బస్‌స్టేషన్లలో పనిచేస్తున్న లైసెన్స్ హమాలీ కార్మికుల సమస్యలను రానున్న అసెంబ్లీ సమావేశాలలో లేవనెత్తడం ద్వారా ప్రభుత్వ దృష్టి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ ఆర్‌టిసి హమాలీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రథమ మహాసభలు మంగళవారం హైదరాబాద్ ఎంజిబిఎస్ బస్‌స్టేషన్ ఆవరణలో ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షులు ఎం.నరసింహ అధ్యక్షతన వహించారు. మహాసభను ఉద్దేశించి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఆర్‌టిసి సరుకు రవాణాలో కీలకపాత్ర పోషిస్తున్న హమాలీ కార్మికులకు తగిన గుర్తింపు, సంక్షేమం కల్పించాలన్నారు. హమాలీ కార్మికులకు ఆర్‌టిసి ఆసుపత్రుల్లో వైద్య సదుపాయం, ఉచిత బస్ పాస్, ప్రమాద బీమా, ఇతర కార్మిక సంక్షేమ చట్టాల ప్రయోజనాలు అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సిపిఐ సీనియర్ నాయకులు అజీజ్‌పాషా మాట్లాడుతూ హమాలీ కార్మికుల సమస్యలు ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాకుండా ఉన్నాయని అన్నారు. బస్ భవన్ ముట్టడి, అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అరవై ఏళ్ల దాటిన హమాలీ కార్మికులకు రూ.10 లక్షల బీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ మాట్లాడుతూ, ఇతర రంగాల హమాలీలకు లభిస్తున్న సంక్షేమ సౌకర్యాలు కూడా ఆర్‌టిసి హమాలీలకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రెండేళ్లకోసారి కూలీ రేట్లు పెంచే విధానాన్ని అమలు చేయాలని కోరారు. ర్యాలీలో హమాలీ కార్మికులు కూలీ రేట్ల పెంపు, ఏటా రెండు జతల యూనిఫామ్‌లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు పాస్, ఆర్టీసీ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు ఎంజిబిఎస్‌లోని కార్గో పార్సిల్ సర్వీస్ కార్యాలయం నుంచి ఇమ్లీబన్ పార్క్ వరకు హమాలీ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యల పరిష్కారించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, హమాలీ యూనియన్ నాయకులు జి.దాసు, ఎం.డి.కాశీం, కె.కొండయ్య తదితరులు పాల్గొన్నారు. మహాసభ అనంతరం యూనియన్ నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు.







# పాత్రికేయులు ప్రజల పక్షాన పనిచేయాలి

**జర్నలిస్టు మునీర్ ఆశయాలను కొనసాగించాలి**
**మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి**

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పాత్రికేయులు ప్రజల పక్షాన పనిచేయాలని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం గోదావరి ఖని ప్రెస్ క్లబ్‌లో అక్షర ఫౌండేషన్, ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన పాత్రికేయుడు మునీర్ జీవితంపై రాసిన ప్రొలిటేరియట్ జర్నలిస్టు మునీర్ పుస్తక ఆవిష్కరణ, పరిచయ సభలో శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. మొదట మునీర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మునీర్ మంచి జర్నలిస్టుగా ప్రజాభిమానం చూరగొన్నాడని, అతని జీవితంపై పుస్తకం రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రధాన పత్రికలు, ఎలక్ట్రానిక్ చానెళ్లు ప్రజల మనోభావాలను ప్రతిబింబించే బాధ్యతను విస్మరించడంతో సోషల్ మీడియా తెరపైకి వచ్చి పెరుగుతుందని అన్నారు. ప్రధాన మీడియాకు చట్టపరమైన రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని, అందువల్ల అవి తప్పుచేస్తే చట్టపరమైన నియంత్రణ ఉంటుందని అన్నారు. కానీ సోషల్ మీడియాకి అవి ఏవీ ఉండవని, తప్పు చేసినా చట్టపరమైన చర్యలుండవని, అందుకే వాటిలో ప్రతి ఒక్కటి బాధ్యతారాహిత్యంగా ప్రజల్లో వ్యాపిస్తుందని, దీనిని ప్రధాన మీడియా జర్నలిస్టులు అడ్డుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లుగా మార్చడంతో జర్నలిస్టుల హక్కులు కూడా పోయాయని వివరించారు. అక్షర ఫౌండేషన్ అధ్యక్షులు మాదాసు రాంమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సభలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, మునీర్‌తో తనకు గల అనుబంధాన్ని వివరించారు. మేయర్ మహంకాళి స్వామి, జర్నలిస్టు నాయకులు నగునూరి శేఖర్, సంపత్, వంశీ, కోల లక్ష్మణ్, వివిధ, ప్రజాసంఘాలు, యూనియన్ల నాయకులు, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు మాట్లాడారు. ప్రెస్ క్లబ్ వ్యవస్థాపకులు అల్లంకి లచ్చయ్య, జక్కం మారుతీ, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

# ‘సర్’ పనులు వేగవంతం చేయాలి

**ఈ వారంలోగా 90 శాతానికి పైగా ఎన్యూమరేషన్ పూర్తి కావాలి**
**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ప్రత్యేక సత్వర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్2026) కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) సి. సుధర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. అదనపు సిఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, డిప్యూటీ సిఈఓ జి.ఎస్. చారి, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎస్ఐఆర్–2026 పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా సిఈఓ పలు కీలక సూచనలు చేశారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి అందుబాటులో ఉన్న సమయాన్ని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్ఓలు), సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్ఓలు), బిఎల్ఓ సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓలు) క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి ఎస్ఐఆర్ కార్యకలాపాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలతో నిర్వహించే సమావేశాల్లో పూర్తి పారదర్శకత పాటిస్తూ సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పట్టణ ప్రాంతాలు, తక్కువ పురోగతి నమోదైన అసెంబ్లీ నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. అలాగే వివిఐపి, విఐపి ఓటర్ల పేర్లు తప్పనిసరిగా ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆన్‌లైన్‌లో ఇప్పటికే ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించిన ఓటర్లను మళ్లీ భౌతిక ఫారాలు ఇవ్వాలని, బిఎల్ఓలు ఒత్తిడి చేయరాదని స్పష్టం చేశారు. అలాగే ఫారం సమర్పణకు ఆధార్ కార్డును తప్పనిసరి చేయవద్దని సూచించారు. ఓటర్లు సులభంగా ఫారాలు సమర్పించేందుకు అవసరమైన సహకారం అందించడంతో పాటు వారి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గైర్హాజరు, చిరునామా మారిన, మరణించిన (ఏఎస్‌డి) ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా ధృవీకరించి ఖచ్చితమైన రికార్డులు నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత బలోపేతం చేసి పర్యవేక్షణ అధికారులతో సమన్వయం పెంచాలని, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా మ్యాపింగ్ కాని ఓటర్ల శాతం, 50 శాతం కంటే తక్కువ పురోగతి ఉన్న పోలింగ్ కేంద్రాలు, సేకరించని ఎన్యూమరేషన్ ఫారాలపై కూడా సిఈఓ సమీక్ష నిర్వహించారు. ఈ వారాంతానికి ప్రతి జిల్లాలో ఎన్యూమరేషన్ ప్రక్రియ కనీసం 90 శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, నో మ్యాపింగ్‌గా ఉన్న ప్రతి ఓటర్‌ని క్షుణ్ణంగా ధృవీకరించి, అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్–2026 కార్యక్రమాన్ని సజావుగా, సకాలంలో పూర్తి చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సిఈఓ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నోడల్ అధికారులు, సాంకేతిక బృంద సభ్యులు పాల్గొన్నారు.

# విప్‌లకు మంత్రుల హోదా

**గవర్నర్ ఆదేశాలతో సిఎస్ ఉత్తర్వులు జారీ**



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఇటీవల విప్‌లుగా నియమితులైన వారికి రాష్ట్ర మంత్రి హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2026 మార్చి 18న ప్రభుత్వ విప్‌లుగా నియమితులైన వేముల వీరేశంతో పాటు చింతకుంట విజయరమణారావు, యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలకు ఈ హోదా వర్తింపజేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన (పొలిటికల్) శాఖ జీఓ ఆర్.టీ. నెం.1064ను విడుదల చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్ర మంత్రి హోదా లభించింది. సంబంధిత ప్రజాప్రతినిధులు ప్రభుత్వ విప్‌లుగా కొనసాగినంత కాలం మాత్రమే ఈ హోదా వర్తిస్తుందని పేర్కొంది. రాష్ట్ర మంత్రులకు కల్పించే ప్రొటోకాల్, అధికారిక గౌరవ మర్యాదలు, సౌకర్యాలు ప్రభుత్వ విప్‌లకు కూడా వర్తించేలా అన్ని ప్రభుత్వ శాఖలు, జిల్లా కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు, ఇతర అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే రాష్ట్ర టేబుల్ ఆఫ్ ప్రిసిడెన్స్‌లో ఎలాంటి శాశ్వత మార్పు ఉండదని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులను గవర్నర్ పేరుతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జారీ చేశారు. వేముల వీరేశంకు రాష్ట్ర మంత్రి హోదా లభించడం పట్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సేవలో మరింత సమర్థంగా పనిచేసే అవకాశం లభించిందని పేర్కొంటూ పలువురు శుభాకాంక్షలు తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గంలో ఈ సందర్భంగా ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.



# విద్యార్థుల బకాయిల విడుదలకు 23న ‘చలో కలెక్టరేట్’

**ఎఐఎస్ఎఫ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న రాష్ట్ర వ్యాప్తంగా చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.మంగళవారం ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఛలో కలెక్టరేట్ కార్యక్రమం వాల్ పోస్టర్‌ను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి, లక్ష్మణ్ లు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలు ఫీజుల పేరుతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేయడం వల్ల ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని విద్యార్థుల సర్టిఫికెట్లను విడుదల చేయించడంతో పాటు బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు సామిడి వంశీవర్ధన్ రెడ్డి, మహమ్మద్ అన్వర్, అనిల్, హరీష్, కృష్ణ, రఘు, అరుణ్, జోసెఫ్, భాను తదితరులు పాల్గొన్నారు.



# శాసనసభను సందర్శించిన మిజోరాం స్పీకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మిజోరాం రాష్ట్ర శాసనసభ స్పీకర్ పూ లాల్ బిక్జామా, ఆయన సతీమణి వాన్ లాల్ రుటి తెలంగాణ రాష్ట్ర శాసనసభను సందర్శించారు. వారికి తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ స్వాగతం పలికారు. అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్ లో ఇరు రాష్ట్రాల స్పీకర్లు సమావేశమయ్యారు. అసెంబ్లీల సమావేశాల నిర్వాహణ, పనితీరు, పద్ధతులపై వారు చర్చించారు. తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మిజోరాం స్పీకర్‌కు తెలంగాణ సభాపతి ప్రసాద్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర శాసనసభ తరుపున మిజోరాం స్పీకర్‌ను స్పీకర్ ప్రసాద్ కుమార్ శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో శాసనమండలి సెక్రటరీ డాక్టర్ వి.నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి, లెజిస్లేటివ్ అధికారులు పాల్గొన్నారు.

# దేవాదుల వద్ద నీటిని ఎత్తడానికి ఏం అడ్డమొచ్చింది?

**బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు**




**ప్రజాపక్షం/హైదరాబాద్:** నీటిని ఎత్తే విషయంలో దేవాదుల ప్రాజెక్ట్ వద్ద ఏం అడ్డమొచ్చిందని బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు మండిపడ్డారు. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 50 రోజులు ఎందుకు నీటిని లిఫ్ట్ చేయలేదని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తాగు, సాగు నీటి ఇబ్బందులకు, విద్యుత్ కోతలకు, పంటల సాగు తగ్గినా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ దేవాదుల కింద రూ.700 నుంచి రూ 800ల కోట్ల విలువైన పంట ఎండిపోయిందని, ఈసారి కూడా ఎల్‌నినో వస్తుందని చెబుతున్నప్పటికీ ప్రభుత్వం మొద్దునిద్ర పోతున్నాదా ? అని ప్రశ్నించారు. రామప్ప కింద తూములు మూసేశారని, ప్రస్తుతం నాట్లు వేసిన రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దేవాదుల సమ్మక్క బ్యారేజీ నుంచి 105 టీఎంసీల నీళ్లు ఏపీ వైపు వెళ్లిపోయాయని, రాష్ట్ర ప్రభుత్వం ఎత్తింది కేవలం 1.9 టీఎంసీలు మాత్రమేనని వివరించారు. రోజుకు పావు టీఎంసీ ఎత్తే అవకాశం ఉన్నప్పటికీ రెండు టీఎంసీలు కూడా ఎత్తలేదన్నారు. ప్రాజెక్టులు,లిఫ్టులు ఉన్నప్పటికీ నీళ్లు మాత్రం ఎత్తడం లేదన్నారు. 22 రిజర్వాయర్ల కెపాసిటీ 12 టీఎంసీలు అని, 50 రోజుల్లో అన్నీ నిండిపోయేవని, కానీ వాటిని ఎందుకు నింపలేదని ప్రశ్నించారు. 30 నెలలుగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌పైన పడి ఏడవడం తప్ప సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చేసింది ఏముందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధితో దేవాదుల వద్ద ఉన్న పది మోటార్లను నడపాలని, 22 రిజర్వాయర్లను నింపాలని, 3 లక్షల 17 వేల ఎకరాలకు తాగు, సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందిచకపోతే వరంగల్, నల్లగొండ, కరీంనగర్ రైతులతో కలిసి ప్రజాపోరుకు సిద్ధమవుతామని హరీశ్‌రావు హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, రాజయ్య, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, ఆరూరి రమేష్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# కవిత ఆరోపణలపై హరీశ్ సమాధానం చెప్పాలి

**మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు కాంట్రాక్టర్లు బిఆర్ఎస్‌కు రూ.1,400 కోట్లు చెల్లించారని మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై మాజీ మంత్రి హరీశ్ రావు స్పందించాలని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. సచివాలయంలో మంగళవారం మీడియాతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ హరీష్‌రావు రైతులను తప్పుదోవ పట్టించడం మానేసి ఆరోపణలపై ముందు స్పష్టత ఇవ్వాలని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి అసలు డిపిఆర్‌లో ప్రతిపాదించిన షీట్ ఫైల్ ఫౌండేషన్‌ను సెకెంట్ ఫైల్ ఫౌండేషన్‌గా ఎందుకు మార్చారో, ఆ నిర్ణయానికి ఎవరు బాధ్యులో హరీశ్‌రావు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు.

**దేవాదుల 9 పింపింగ్ యూనిట్లు 24 గంటలు పనిచేస్తాయి**

దేవాదుల ఎత్తిపోతల పథకం కింద మంగళవారం రాత్రి నుంచి 9 పంపింగ్ యూనిట్లు 24 గంటల పాటు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. గోదావరి నుంచి గరిష్ట స్థాయిలో నీటిని ఎత్తిపోసి 9 జిల్లాల్లోని 22 రిజర్వాయర్లను నింపడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీటి భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని, రాజకీయాల కోసం కాదని స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టును 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసి 5.6 లక్షల ఎకరాలకు సాగునీరు, ఉత్తర తెలంగాణకు తాగునీటి భద్రత కల్పిస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# 32 నెలల్లో కాంగ్రెస్ చేసిందేమిటి? : కెటిఆర్



**ప్రజాపక్షం/లక్షెట్టిపేట :** సుందిళ్ల బ్యారేజీలో రెండు పిల్లర్లు కుంగిన మాట నిజమేనని, అయితే అధికారంలోకి వచ్చి 32 నెలలు దాటుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ప్రశ్నించారు. మంగళవారం లక్సెట్టిపేట మండలంలోని అంకత్ పల్లి వాసవి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రైతు సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మేస్త్రీలు, సిమెంటు లేదా స్టీలు కొరత ఉందా అని విమర్శించారు. రైతులు పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో వర్షం నుండి ధాన్యాన్ని కాపాడుకునే క్రమంలో జిల్లాలో నలుగురు రైతులు అకాల మరణం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ బాధితులకు ఎలాంటి సాయం చేయలేదని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ పార్టీ తరఫున హామీ ఇచ్చిన విధంగా మృతి చెందిన నలుగురు రైతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 లక్షల రూపాయల చొప్పున మొత్తం 20 లక్షల రూపాయల చెక్కులను ఆయన అందజేశారు. అనంతరం అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని, అక్రమాలకు వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జీవన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, నడిపెల్లి దివాకర్ రావు, దుర్గం చిన్నయ్య, కోవ లక్ష్మి, నారదాసు లక్ష్మణ్, ఖానాపూర్ ఇంచార్జి జాన్సన్ నాయక్, లక్సెట్టిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ సల్మాన్ కాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.


**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: సర్కిల్-17, జల్‌పల్లి.**

Date: 21.07.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| టెండర్ నోటీసు NIT No. 08/EEC-17/JLPY/ GHMC-2026-27, Dated: 21.07.2026 | 3 పనుల కోసం జిహెచ్ఎంసి, శంషాబాద్ జోన్, జల్‌పల్లి సర్కిల్-17 పరిధిలోని షాహీన్ నగర్-63, పహాడి షరీఫ్-64 మరియు జల్‌పల్లి-65 ప్రాంతాలలో బోనాల పండుగ కోసం విద్యుత్ దీపాల (డే లైట్స్) ఏర్పాటు... అలాగే, జిహెచ్ఎంసి, శంషాబాద్ జోన్, జల్‌పల్లి సర్కిల్-17 పరిధిలోని జల్‌పల్లి-65 ప్రాంతంలో బోనాల పండుగ కోసం మంచి కంకర మరియు తడి మిశ్రమం పరిచే పనుల కోసం. | రూ. 15.00 లక్షలు | 25.07.2026 మ.03:00 గం.ల వరకు | శ్రీ కె.శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జల్‌పల్లి సర్కిల్-17, జిహెచ్ఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.Tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, జల్‌పల్లి, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 6451-PP/CL/ADVT/2026-27, Date: 21-07-2026

**వ్యవసాయ మార్కెట్ కమిటీ, కార్యాలయము, హైదరాబాద్.**

నెం. వ్య మా.క./హై/Tenders/2026-27 — టెండర్ నోటీసు — తేది: 21/07/2026

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్, మలక్ పేట్ మార్కెట్ కార్యాలయమునకు సంబంధించిన ప్రింటింగ్ అఫ్ తక్ పట్టి పుస్తకములు, ఎగుమతి పుస్తకములు; ప్రింటింగ్ రిజిస్టర్స్, స్టేషనరి సరఫరా, క్యాంటిన్ నిర్వహణ చేయుటకు మరియు ఎర్రగడ్డ, మెహిదీపట్నం రైతు బజార్ల యందు ఒక్క సంవత్సరం కాల వ్యవధికి గాను ఈ దిగువ తెలిపిన పనుల నిర్వహణకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.

| క్రమ సంఖ్య | టెండరు పేరు | టెండరు షెడ్యూలు ధర రూ. | ధరావత్తు (EMD) రూ. | టెండరు షెడ్యూలు సరఫరా చేయు తేది మరియు సమయము | టెండరు షెడ్యూలు దాఖలు చేయు చివరి తేది మరియు సమయము | టెండరు తెరువబడు తేది మరియు సమయం |
|---|---|---|---|---|---|---|
| 1. | కార్యాలయమునకు అవసరమగు ప్రింటింగ్ అఫ్ తక్ పట్టి పుస్తకములు, ఎగుమతి పుస్తకములు సరఫరా చేయుటకు | Rs.3,000/- | Rs.50,000/- | 24.07.2026 మరియు 27.07.2026 ఉదయం 11.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు | 29.07.2026 రోజున మధ్యాహ్నం 12.00 గంటల వరకు | 29.07.2026 రోజున మధ్యాహ్నం 1.00 గంటలకు |
| 2. | ప్రింటింగ్: కార్యాలయమునకు అవసరమగు రిజిస్టర్స్ ప్రింటింగ్ చేసి సరఫరా చేయుటకు | Rs.3,000/- | Rs.50,000/- | | | |
| 3. | స్టేషనరి: కార్యలయముకు అవసరమగు స్టేషనరి సరఫరా చేయుటకు | Rs.3,000/- | Rs.50,000/- | | | |
| 4. | మలక్‌పేట్ మార్కెట్ యార్డు యందు క్యాంటిన్ నిర్వహణ కొరకు | Rs.3,000/- | Rs.20,000/- | | | |
| 5. | వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్ మలక్‌పేట్ కార్యలయంకు సంభందించిన scrap (పాత సామాన్లు) కొనుగోలు చేయుటకు | Rs.1,000/- | Rs.5,000/- | | | |
| 6. | ఎర్రగడ్డ రైతు బజార్: టాయిలెట్ బ్లాక్-I | Rs.3,000/- | Rs.20,000/- | | | |
| 7. | టాయిలెట్ బ్లాక్-II | Rs.3,000/- | Rs.20,000/- | | | |
| 8. | చెత్త చెదారము ఊడ్చుట, ప్రోగుచేయుట, ఎత్తివేయుట మరియు చెత్తను బయటకు తరలించుటకు గాను | Rs.3,000/- | Rs.50,000/- | | | |
| 9. | మెహదిపట్నం రైతు బజార్ : చెత్త చెదారము ఊడ్చుట, ప్రోగుచేయుట, ఎత్తివేయుట మరియుచెత్తను బయటకు తరలించుటకుగాను | Rs.3,000/- | Rs.50,000/- | | | |

నిబంధనలు:-
1. టెండర్ షెడ్యూలు కొరకు GST రిజిస్ట్రేషన్ ఉన్న కాంట్రాక్టర్లు లిఖితపూర్వ దరఖాస్తుతో పాటు, టెండర్ ఫారం ధర మరియు టెండర్ వారిగా ధరావత్తు (EMD) బాపతు రూపాయలను డి.డి.ల రూపేనా Selection Grade Secretary, Agril. Market Committee, Hyderabad గారి పేరున తీసిన వారికి మరియు ఈ క్రింద తెలిపిన అర్హత పత్రములు సమర్పించిన వారికీ మాత్రమే టెండర్ షెడ్యూల్ ఫారం ఇవ్వబడును. DDల పై టెండర్ వేయువారి పేరున మాత్రమే ఉండవలెను, చెక్కులను తిరస్కరించబడును.
2. చెత్త చెదారము ఊడ్చుట, ప్రోగుచేయుట, ఎత్తివేయుటకు గాను సొంత / లీజుకు తీసుకొనబడిన డంపింగ్ యార్డు ఉండవలెయును. దాని ధ్రువికరించిన పత్రములు ధరఖాస్తుతో పాటు జతపర్చవలెను.
3. బుల్ గార్బేజ్ లిఫ్టింగ్, 200 సి.సి.టి.కి. తక్కువ కాని చెత్త తరలింపుకు రెండు వాహనములు ఉండవలెయును వాటి ఆర్.సి కాపీలు ధరఖాస్తుతో పాటు జత పర్చవలెను.
4. 10 మందికి తక్కువ కాకుండా లేబర్ కలిగియుండవలెను వారి యొక్క వివరాముల, ఆధార్ కార్డు Xerox copy లను దరఖాస్తుతో పాటు జతపర్చవలెను.
5. కాలుష్య నియంత్రణ బోర్డు వారి యొక్క ధ్రువికరించిన పత్రములు ధరఖాస్తుతో పాటు జతపర్చవలెను.
6. టాయిలెట్ బ్లాక్ నిర్వహణ కొరకు రిజిస్టర్ / సొసైటీ ఫరమ్స్ వారు మాత్రమే టెండరు కొరకు దరఖాస్తు చేసుకోగలరు.
7. వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్ మలక్‌పేట్ కార్యలయంకు సంభందించిన scrap (పాత సామాను) కొనుగోలు చేయుటకు ఆసక్తి గల సంస్థలు / వ్యక్తుల నుండి దరఖాస్తులు కోరడమైనది.
8. పై తెలిపిన పనులను ఏదేని ప్రభుత్వ సంస్థలో కనీసం (2) సంవత్సరములు పని చేసిన అనుభవం వుండాలి (అట్టి ధృవీకరణ పత్రములు ధరఖాస్తుతో పాటు జతపర్చవలెను).

అసంపూర్తిగా ఉన్న టెండర్ గాని, అభ్యంతరములు ఉన్న టెండర్లు గాని చెక్కులు సమర్పించిన టెండర్ గాని, టెండర్ దారు పేరున DD లేని వాటిని తిరస్కరించబడును మరియు ఎలాంటి కారణము చూపకుండా టెండర్ రద్దు చేయు అధికారము ఈ దిగువ సంతకముదారునకు కలదు. ఇట్టి విషయము నందు ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడవు. ఇతర వివరములకు కార్యాలయము పనిచేయు దినములలో ఉదయము 11.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్, మలక్ పేట్ కార్యాలయము నందు సంప్రదించవచ్చును.

సం/- ఉన్నత శ్రేణి కార్యదర్శి(FAC), వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్.

DIPR R.O. No. : 6438-PP/CL/ADVT/2026-27, Date: 21-07-2026

## బాలికల వసతిగృహంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** బాలికల వసతి గృహంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకే బోరు డ్రిల్లింగ్ చేయడం జరిగిందని మున్సిపల్ చైర్మెన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప వివరించారు. మంగళవారం మున్సిపల్ పరిధి లోని 2వ వార్డు కౌన్సిలర్ బచ్చలి నరేష్ ఆధ్వర్యంలో బాలికల వసతి బోరు డ్రిల్లింగ్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మెన్ బసవేశ్వర్ అప్ప మాట్లాడుతూ బాలికల వసతి గృహంలో విద్యార్థినీలు తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యను తీర్చేందుకు కొత్తగా మున్సిపల్ నిధుల నుండి బోరు డ్రిల్లింగ్ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, ప్రిన్సిపాల్ సులోచన, కౌన్సిలర్లు బచ్చలి నరేష్, చాకలి పెంటయ్య, మురళీమోహన్ (అప్పి), కొప్పునూరి ప్రవీణ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, నేతలు ముబారక్ అలీఖాన్, తంగడిపల్లి శంకర్, క్యూసెట్ శ్రీనివాస్, రమేష్ గౌడ్, వినోద్‌కుమార్ గౌడ్, చేవెళ్ళ శ్రీనివాస్, రామచందర్‌లు పాల్గొన్నారు.

## జానకిరామ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుర్చీలు. డ్రైఫ్రూట్స్ పంపిణీ




**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మండలం, కొండకల్ గ్రామంలోని అంగన్‌వాడీ చిన్నారులకు మంగళవారం నందమూరి ట్రస్ట్ చైర్‌పర్సన్ నందమూరి దీపిక జానకిరామ్ కుర్చీలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దీపిక జానకిరామ్ మాట్లాడుతూ దివంగత నందమూరి జానకిరామ్ సేవ భావాలను స్థిర స్థాయిగా అందించాలనే సేవభావంతో నందమూరి జానకిరామ్ ట్రస్టు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కొండాకల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడి టీచర్స్, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

## మురుగు కాల్వలు శుభ్రం

ప్రజాపక్షం/షాద్‌నగర్: పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని 18వ వార్డు కౌన్సిలర్ జమాల్పూర్ సంతోషి చందులాల్ వివరించారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో కౌన్సిలర్ ఆధ్వర్యంలో మురుగు కాలువలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాగ్యనగర్ కాలనీలో ఉన్న మురుగు కాలువల అభివృద్ధి పనులను త్వరలోనే పెద్ద ఎత్తున ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తంగిడిపల్లి శంకర్, కత్తి చంద్రశేఖరప్ప, కాలనీ వాసులు వెంకటేష్ టీచర్, రాములు, ఎస్.వెంకటయ్య, సంగెం రాజు, వార్డు ఇన్‌చార్జి నరసింహులు, శివ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల సౌకర్యార్థం చిన్నస్టేజీల వద్ద బస్సులు ఆపుతున్నాం

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రయాణీకుల సౌకర్యం కోసమే చిన్న చిన్న స్టేజీల వద్ద ఆర్టీసి బస్సులను అపుతుంటే అందుకు సంబంధించిన అధికారులు పెనాల్టీలు వేయడం ఎంతవరకు సమంజసమని డ్రైవర్లు ప్రశ్నిస్తున్నారు. మంగళవారం షాద్‌నగర్ ఆర్టీసి బస్ డిపోలో ప్రైవేట్ డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ పెనాల్టీ విధానం రద్దు చేయడంతోపాటు అన్ని డిపోలకు ఒకే నిబంధన వర్తింప చేసేందుకు కృషి చేయాలని, అప్పటి వరకు బస్సులు నడిపించే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు, అర్టీఓ అధికారులు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## రైతులందరికీ అందుబాటులో యూరియా

**ప్రజాపక్షం/యాచారం :** మండలంలోని రైతులందరికి యూరియా అందుబాటులో ఉంటుందని వ్యవసాయాధికారి అర్.రవినాథ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వ్యవసాయం సాగు చేస్తున్న రైతులందరికీ యూరియా అందుతుందని తెలిపారు. రైతులు యూరియా విషయంలో ఎలాంటి అందోళన చెందద్దని తెలిపారు.

## లయన్స్‌క్లబ్ ఆఫ్ మనుకోట భేరా కార్యవర్గం బాధ్యతల స్వీకరణ




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** లయన్స్‌క్లబ్ ఆఫ్ మనుకోట భేరా నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం పట్టణంలోని శ్రీసాయి రాజా ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అధ్యక్షుడిగా లయన్ డాక్టర్ ధరావత్ రెడ్యానాయక్, కార్యదర్శిగా లయన్ వేణు జాటోత్, కోశాధికారిగా లయన్ భవాని భూక్యలు బాధ్యతలు స్వీకరించారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ఇమ్మీడియట్ పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ లయన్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి, పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ లయన్ ఎస్.రాధాకృష్ణ, ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ కె.శశికాంత్, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ పిఆర్‌కె నాగరాజు హాజరయ్యారు.

# సమష్టిగా ఎల్ నినోను ఎదుర్కొందాం

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్





**ప్రజాపక్షం/రంగారెడ్డి/మేడ్చల్ :** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో మిషన్ మోడ్‌లో పని చేయాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధ్యక్షతన ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సమీక్షా సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఎంఎల్‌సిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి శాఖ ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి, కంటింజెన్సీ ప్లాన్‌లను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడం, అవసరమైన విత్తనాల సరఫరా, తాగునీటి ఏర్పాట్లు, పశువులకు మేత, ఉపాధి హామీ పనులు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్యసేవలు వంటి అంశాల్లో ఎలాంటి లోటు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పెసర, కంది, జొన్న, మొక్కజొన్న, రాగులు, నువ్వులు వంటి పంటలను ప్రోత్సహించాలని, రైతులకు అవసరమైన ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా జల వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే అనావృష్టి పరిస్థితుల నుంచి ప్రజలను రక్షించడం జిల్లా యంత్రాంగం బాధ్యత అని, అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ప్రాంతాల్లో వరి సాగు అధికంగా ఉండటంతో, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులకు తగిన సూచనలు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సి. నారాయణరెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయాలని చెప్పారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తమ తమ శాఖల యాక్షన్ ప్లాన్‌లు, కంటింజెన్సీ ప్రణాళికలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డిఆర్‌డిఎఆధ్వర్యంలో తెలంగాణ జలసిరి పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్లు సవ్యసాచి, వికాస్‌రాజ్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలే యాదయ్య, వీర్లపల్లి శంకర్, మనోహర్‌రెడ్డి, తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ మనుచౌదరి, ఎమ్మెల్సీ దయానంద్, అదనపు కలెక్టర్లు డాక్టర్ కిరణ్మయి, కె.చంద్రారెడ్డి, డిఆర్ఒ శారద, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో పాటు మున్సిపల్ చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా తదితర సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణ చర్యలపై 'నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్' (ఎన్‌సివిబిడిసి ) తెలంగాణ రాష్ట్ర విభాగం మంగళవారం సమీక్ష నిర్వహించింది. హైదరాబాద్‌లోని తార్నాకలోని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) అదనపు కమిషనర్ (హెల్త్) కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సమన్వయ సమావేశం జరిగింది. ఎంఎంసి హెల్త్ అదనపు కమిషనర్ సి.ఎన్ రఘుప్రసాద్ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ తెలంగాణ అదనపు డైరెక్టర్ (ఎం.ఎఫ్) డాక్టర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు. వ్యాధుల తీవ్రత, సర్వైలెన్స్ కార్యకలాపాలు, లార్వా సూచీలు, హాట్ స్పాట్ ప్రాంతాలు, కేసుల విచారణ, 'యాక్షన్ యాక్షన్ రిపోర్ట్స్'లపై సుదీర్ఘంగా చర్చించారు. ఐహెచ్ఐపి రిపోర్టింగ్‌ను బలోపేతం చేయడం, నమోదైన ప్రతి కేసుపై వేగంగా స్పందించడం, ఆరోగ్య శాఖ స్థానిక సంస్థల మధ్య సమర్థవంతమైన సమన్వయం ఉండాలని డాక్టర్ పద్మజ సూచించారు. పాజిటివ్ కేసు నమోదైన 24 గంటల్లోగా క్షేత్రస్థాయి విచారణ ప్రారంభించాలని, 48 గంటల్లో ఫీవర్ సర్వే, లార్వా నిర్మూలన చర్యలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో 'డ్రై డే' పాటించాలని, ఇళ్లు, పాఠశాలలు, నిర్మాణ ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాల్లో నిలిచిన నీటిని తొలగించి, దోమల సంతతి పెరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

### ఖేలో ఇండియా గేమ్స్-2026 ఏర్పాట్లపై

## 'సాయ్' అధికారుల పరిశీలన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా గేమ్స్–2026 ఏర్పాట్లలో భాగంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయి) అధికారుల బృందం మంగళవారం హైదరాబాద్‌లోని పలు క్రీడా వేదికలను పరిశీలించింది. సాయి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమర్ జ్యోతి నేతృత్వంలోని బృందం గచ్చిబౌలి జిఎంసిబి స్పోర్ట్స్ కాంప్లెక్స్, షూటింగ్ రేంజ్, కెవిబిఆర్ ఇండోర్ స్టేడియం, హుస్సేన్ సాగర్ వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్, సైక్లింగ్ వేలోడ్రోమ్, ఎల్‌బి స్టేడియంలను సందర్శించి మౌలిక సదుపాయాలు, క్రీడా వసతులను సమీక్షించింది. హైదరాబాద్‌లోని క్రీడా వసతులపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తూనే, ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు అవసరమైన చోట మరమ్మతులు, మౌలిక సదుపాయాల మెరుగుదల చేపట్టాలని సూచించారు. బుధవారం హకింపేట్ స్పోర్ట్స్ స్కూల్‌తో పాటు మేడ్చల్, కరీంనగర్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని క్రీడా వేదికలను సాయి బృందం పరిశీలించనుంది.

## మిలిటెంట్ పోరాటాలతోనే కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ పత్రిక వార్షికోత్సవానికి రావాలని ఆహ్వానించిన సిజిఎం, ఎడిటర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బలమైన మిలిటెంట్ పోరాటాలతోనే కమ్యూనిస్టు ఉద్యమం మరింత బలోపేతం అవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆగస్టు 1న నిర్వహించనున్న నవతెలంగాణ దినపత్రిక 11వ వార్షికోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని ఆ పత్రిక సిజిఎం పి.ప్రభాకర్, ఎడిటర్ రాంపల్లి రమేశ్ మంగళవారం ఆయనను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. 'రాజ్యాంగం– ప్రజాస్వామ్యం– పత్రికా స్వేచ్ఛ' అంశంపై నిర్వహించే సదస్సులో ముఖ్యవక్తగా పాల్గొనాలని కోరగా, హాజరవుతానని కూనంనేని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నవతెలంగాణ హెచ్‌ఆర్‌జిఎం నరేందర్‌రెడ్డి, బోర్డు సభ్యులు, ప్రత్యేక ప్రతినిధి బి.బసవపున్నయ్య, బ్యూరో ప్రతినిధి అచ్చిన ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జ్ దుర్మార్గం

సిపిఐ నేతలు ఆందోజు రవీంద్ర చారీ, ముత్యాల యాదిరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఢిల్లీలో సామరస్యంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జీ దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి తీవ్రంగా ఖండించారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో అవకతవకలు, పేపర్ లీకేజీలపై బాధ్యత వహించి, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో చేపట్టిన చలో సంసద్ నిరసన కార్యక్రమంలో విద్యార్థుల పట్ల, యువత, ఇతర నిరసనకారుల పట్ల అత్యంత క్రూరంగా, దారుణంగా పోలీసులు లాఠీచార్జి చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం మోడీ,అమిత్‌షాల అసమర్థతకి నిదర్శనమని మండిపడ్డారు. ఢిల్లీ సంఘటనలో పోలీసులతో పాటు పోలీసుల ముసుగులో ఉన్న మతోన్మాద గుండాలు విద్యార్థులపై అత్యంత పాశవికంగా దాడి చేసి గాయపరిచారని ఆరోపించారు. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపి, నిరసనకారులపై మితిమీరిన బలప్రయోగానికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, గాయపడిన విద్యార్థులు మరియు ఇతర నిరసనకారులకు మెరుగైన వైద్య సహాయం అందించడంతో పాటు, అదుపులోకి తీసుకున్న వారిపై చట్టవిరుద్ధమైన చర్యలు జరగకుండా వారి హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

## అక్రమ నిర్మాణాలు తొలగించి పార్కు కాపాడండి

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి వినతి



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** బైరామల్ గూడలోని శ్రీవెంకటేశ్వర కాలనీ (ఎస్‌వి) పబ్లిక్ పార్కును కబ్జా చేయాలనీ చూస్తున్న వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్.వి.కాలనీవాసులతో కలిసి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఈ పార్క్ అభివృద్ధి కోసం దాదాపు 12 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, పార్కుల్లో వాకింగ్ ట్రాక్, అందమైన మొక్కలు నాటించడం జరిగిందని తెలిపారు. పార్కును కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలను చేపడుతున్న నేపథ్యంలో ఆ నిర్మాణాలను తొలగించి పార్కును పూర్తి స్థాయిలో పునరుద్ధరణ చేయాలని కోరారు. కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ తప్పకుండ రెండు రోజుల్లో తమ సిబ్బందిని పంపించి పార్క్ ఆక్రమణల నుండి విడిపించి కాలనీవాసులకు పార్క్ అందుబాటులోకీ తీసుకొస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చంపాపేట్ డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షులు రాజిరెడ్డి, కాలనీ అధ్యక్షులు అమృతరెడ్డి, ఉపాధ్యక్షులు బాలస్వామి, కోశాధికారి అనంతరెడ్డి, గౌరవ సలహాదారులు విశ్వనాథం, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకట్ రెడ్డి, సభ్యులు శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నకిలీ పత్రాలతో లండన్‌కు వెళ్లే యత్నం భగ్నం

## శంషాబాద్‌లో ముగ్గురు పట్టివేత

అంతర్రాష్ట్ర నకిలీ డాక్యుమెంట్ల ముఠాపై సిసిఎస్ ఆరా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నకిలీ సముద్రయాన పత్రాలను ఉపయోగించి లండన్‌కు వెళ్లేందుకు ప్రయత్నించిన ముగ్గురు భారతీయులను శంషాబాద్ విమానాశ్రయం ఇమ్మిగ్రేషన్ అధికారులు పట్టుకున్నారు. ఈ కేసు వెనుక అంతర్రాష్ట్ర స్థాయిలో నకిలీ సముద్రయాన పత్రాలు తయారు చేసి విదేశాలకు అక్రమంగా పంపిస్తున్న ముఠా ఉన్నట్లు గుర్తించిన సిసిఎస్ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. శంషాబాద్ విమానాశ్రయంలోని డిపార్చర్ ఇమ్మిగ్రేషన్ కౌంటర్ వద్ద ఆర్యన్, ముకేష్ కుమార్, రూప్ సింగ్ అనే ముగ్గురు ప్రయాణికులు జెడ్డా మీదుగా లండన్ వెళ్లేందుకు సమర్పించిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ జారీ చేసినట్లు చూపించిన ఫారం1 సర్టిఫికెట్లు, కంటిన్యూయస్ డిశ్చార్జ్ సర్టిఫికెట్లపై ఇమ్మిగ్రేషన్ అధికారులకు అనుమానం రావడంతో పరిశీలించారు. ధ్రువీకరణలో ఆ ముగ్గురు సమర్పించిన ఫారం1 సర్టిఫికెట్లు నకిలీవని తేలింది. దీంతో వారిని అదుపులోకి తీసుకుని శంషాబాద్ ఆర్‌జీఐ విమానాశ్రయ పోలీసులకు అప్పగించారు.

# సిద్దాపూర్ చెత్త డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా పోరాటం

### ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

**ప్రజాపక్షం/కొత్తూరు:** సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకమని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి వివరించారు. మంగళవారం కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు పెద్దఎత్తున ఛలో కలెక్టరేట్‌కు తరలివెళ్ళారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డు కోసం ఏర్పాటు చేసిన 641జీవోను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు ప్రజలకు మేలు చేసే విషయాలపై నిర్ణయాలు తీసుకుంటుందని, ప్రజలకు వ్యతిరేకంగా పనిచేయదని పేర్కొన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం హైద్రాబాద్ వెలుపల కాలుష్యకార పరిశ్రమలు, ఇతర ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించి నిర్ణయాలు తీసుకుని భూసేకరణ చేపట్టిందని, వాస్తవాలు ప్రజలందరికి తెలుసని వివరించారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీపై బిఆర్‌ఎస్ బురద జల్లే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు.



**షాద్‌నగర్:** చెత్త డంపింగ్ యార్డును వ్యతిరేకించే వారందరు ఐక్య పోరాటాలకు సిద్ధమవ్వాలని సెంట్రల్ కమిటీ చైర్మన్ రాంబాల్ నాయక్ కోరారు. మంగళవారం పట్టణంలో సిద్దాపూర్ చెత్త డంపింగ్‌యార్డు వ్యతిరేక జాయింట్ యాక్షన్ కమిటీ మొదటి సమావేశాన్ని చైర్మన్ రాంబాల్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాల్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పచ్చని పంటపొలాల మధ్య ఏర్పాటు చేయనున్న చెత్త డంపింగ్ యార్డును అడ్డుకునేందుకు ఉద్యమాలను తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు...**సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీని మంగళవారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. సలహాదారులుగా బుద్దుల జంగయ్య (సిపిఐ)తో పాటు వివిధ పార్టీ నేతలు గంగిరెడ్డి, అబ్దుల్ రబ్‌జామి, వర్కింగ్ చైర్మెన్‌గా దొడ్డి శ్రీనివాస్ , కన్వీనర్‌గా పినపాక ప్రభాకర్, కో ఆర్డినేటర్లు తిరుమలయ్య, టీజి శ్రీనివాస్, కోచైర్మెన్లు సత్యనారాయణ, మోహన్ సింగ్, ఈశ్వర్‌నాయక్, పెంటనోళ్ల నరసింహా, బొజ్జ శ్రీనివాస్‌రెడ్డి, వడ్డే బాలయ్య, రజిత , కో కన్వీనర్లు అర్జునప్ప, రవీంద్రనాథ్, ప్రశాంత్ , వి.శ్రీకాంత్, పవన్ (ఎఐఎస్ఎఫ్), వరప్రసాద్ , బిత్యానాయక్, శ్రీధర్‌చారి లను ఎన్నుకున్నారు.



## పార్లమెంట్ ముట్టడిలో పోలీసుల దమనకాండను ఖండించిన సిపిఐ

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** ఢిల్లీలో నీట్ పరీక్ష అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నిర్వహించిన పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, యువజనులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలపై పోలీసులు దమనకాండకు పాల్పడడాన్ని సిపిఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, అలాంటి నిరసనలను బల ప్రయోగంతో అణిచివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పేర్కొన్నారు. నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం స్పందించకుండా వారి గొంతు నొక్కే యడానికి పోలీసులను వినియోగించడం ద్వారా సమస్యలకు పరిష్కారం లభించదని స్పష్టం చేశారు. నీట్ అక్రమాలపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని సిపిఐ డిమాండ్ చేసింది. అలాగే పార్లమెంట్ ముట్టడి సందర్భంగా ప్రజలపై దమనకాండకు పాల్పడి న బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు నిరసనకారులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఉమా మహేష్ కోరారు.



## ప్రజల సహకారంతో భద్రతకు బలమైన నిఘా

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఘట్‌కేసర్ పోలీసుల కమ్యూనిటీ నిఘా కెమెరాల కార్యక్రమంలో భాగంగా ఈడబ్ల్యూఎస్ కాలనీలో స్థానిక దాతలు సోమసాని రమేష్, సోమసాని వెంకటేష్, తలతోటి వరమ్మ సహకారంతో ఎనిమిది నిఘా కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి మాట్లాడుతూ నేరాల నివారణ నేరస్థుల గుర్తింపు ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రజల ప్రాణాలు ఆస్తుల రక్షణలో నిఘా కెమెరాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రతి కాలనీ గ్రామంలో ప్రజలు స్వచ్ఛందంగా నిఘా కెమెరాలు ఏర్పాటు చేసి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.అనంతరం ఇన్‌స్పెక్టర్ బాలస్వామి ఉప పరిశీలకుడు ప్రభాకర్ రెడ్డి,నిఘా పర్యవేక్షణలోకి తీసుకువచ్చి సురక్షిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




## ఒక రోజుకు గాను హెల్మెట్ ఉచితం


### జరిమానా స్థానంలో అందిస్తున్న ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులు

**ప్రజాపక్షం/ఉప్పల్ :** హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు జరిమానాల స్థానంలో మరుసటి రోజుకల్లా సొంత హెల్మెట్ ధరించి వచ్చే వరకు ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్మెట్ బ్యాంక్ ద్వారా ఒక రోజుకు గాను హెల్మెట్‌ను ఉచితంగా ఇచ్చే ప్రక్రియను చేపట్టారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జరిమానాలు విధిస్తున్నా వాహనదారుల్లో తీరుమారక పోవటంతో వారితో విధిగా ఓ హెల్మెట్ కొనుగోలు చేయించే లక్ష్యంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ ఆదేశాలతో ఉప్పల్ ప్రాంతంలోని పలు కీలక ప్రాంతాల్లో హెల్మెట్ బ్యాంకు అంటూ టెంట్లు వేసి ఆ మార్గంలో హెల్మెట్ లేకుండా వెళ్లే వాహనదారులను ట్రాఫిక్ పోలీసులు పట్టుకొని తీసుకొని వచ్చి ఓ హెల్మెట్‌ను ఇచ్చి పంపిస్తున్నారు. అయితే తామిచ్చిన హెల్మెట్ పూర్తిగా ఉచితం కాదని, ఈ హెల్మెట్‌ను మరుసటి రోజు తమ వద్దకు వచ్చి తాము కొనుగోలు చేసిన హెల్మెట్ ధరించి ప్రతి రోజూ ఇక దాన్ని ధరించి ప్రయాణిస్తానన్న హామీ ఇవ్వటంతో పాటు తమ వద్ద తీసుకొన్న హెల్మెట్‌ను తిరిగి ఇవ్వాలన్న నిబంధనతో ఉచితంగా హెల్మెట్ బ్యాంకు నుండి ఇస్తున్నారు. ఈ విధంగా హెల్మెట్ వాహనదారులకు ఇచ్చే సమయంలో వారి నుండి ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలులాంటి ప్రభుత్వ గుర్తింపు కార్డు, మొబైల్ ఫోన్ నంబరు నమోదు చేసుకొని మరుసటి రోజు తిరిగి హెల్మెట్‌ను తిరిగి ఇస్తామని సంతకం తీసుకొని ఇస్తున్నారు. జరిమానాగా చెల్లించే డబ్బుతో అయినా మరుసటి రోజు నుండి వాహనదారులు తప్పనిసరిగా కొనుగోలు చేసిన హెల్మెట్ ధరించి ప్రయాణించటమే లక్ష్యంగా హెల్మెట్ బ్యాంకు విధానాన్ని అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా మల్కాజిగిరి ట్రాఫిక్ విభాగ డిసిపి వి.శ్రీనివాసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ విభాగ అడిషనల్ డిసిపి శ్రీనివాస్ కుమార్, ట్రాఫిక్ ఎసిపి సంపత్ కుమార్, ఉప్పల్ ట్రాఫిక్ ఇనస్పెక్టర్ నాగరాజు, ఆర్ఐ గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్గత విభేదాలకు చెక్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీలో గత కొన్ని రోజులుగా నెలకొన్న అంతర్గత విభేదాలకు తెరపడింది. ఈ సందర్భంగా నాగారం డివిజన్ నూతన అధ్యక్షులు భూమయ్యయాదవ్ మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి నివాసానికి విచ్చేసి డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పార్టీ బలోపేతం, కార్యకర్తల ఐక్యత,భవిష్యత్ కార్యాచరరణపై సుదీర్ఘరంగా చర్చించారు.గతంలో జరిగిన చిన్నచిన్న విభేదాలు, అపార్థాలను పక్కనబెట్టి ఇక ఎలాంటి పొరపాట్లు పునరావృత్తం కాకుండా అందరం కలిసికట్టుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పనిచేయాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. ఇందులో నాయకులు గూడురు అశోక్‌గౌడ్, హరిబాబు, సతీష్ గౌడ్,నల్లోల కుమార్,మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల విధులకు ఆటంకం.. శిక్ష



**ప్రజాపక్షం/చర్లపల్లి:** శాంతి భద్రతకు భంగం కల్గించి, పోలీసుల విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తికి ఒక రోజు సాధారణ శిక్ష విధించిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కమలా నగర్ సాయి సంతోషిని హాస్టల్ వద్దకు భరత్‌కుమార్(30) వచ్చి అసభ్యకరమైన భాషలో అరుస్తూ న్యూసెన్స్ సృష్టించడంతో 100కు సమాచారం అందించగా పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కుషాయిగూడలోని మేడ్చల్ జిల్లా కోర్టు 5 స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు. దీంతో కేసును విచారించిన మేజిస్ట్రేట్ బి. సర్వలక్ష్మి నిందితునికి ఒక రోజు కారాగారం శిక్షతో పాటు, 500 రూపాయల జరిమానా విధించారు.

# జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేయాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్



**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ వల్ల ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని, ప్రభుత్వాన్ని తీవ్ర ప్రమాదంలోకి నెడుతున్న ఈ డంపింగ్ యార్డ్‌ను ప్రభుత్వం తక్షణమే ఎత్తివేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.ఎస్.బోస్ డిమాండ్ చేశారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రలు మంగళవారంతో 11వ రోజుకు చేరుకున్నాయి. సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షతన జ్యోతి కాలనీ, సిపిఐ కాలనీ, బజరంగ్ కాలనీల్లో ఈ పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వి.ఎస్.బోస్ మాట్లాడుతూ, గత 25 ఏళ్లుగా జవహర్ నగర్ ప్రజలు డంపింగ్ యార్డ్ ఎప్పుడు ఎత్తివేస్తారా అని నిరీక్షిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఎన్నో విన్నపత్రాలు సమర్పించినా, నిరసనలు తెలిపినా, ప్రజాప్రతినిధులను కలిసినా సమస్య పరిష్కారం కాకపోవడం విచారకరమన్నారు. ఈ డంపింగ్ యార్డ్ వల్ల తాగునీరు విషపూరితంగా మారిందని, గాలి కలుషితమై ప్రజలు తీవ్రమైన వ్యాధుల బారిన పడుతున్నారని మండిపడ్డారు. ఇది ఒక పెద్ద పర్యావరణ విపత్తుగా మారిందని, తాత్కాలిక చర్యలతో కాలయాపన చేసే సమయం దాటి పోయిందని స్పష్టం చేశారు. స్థానిక ప్రజల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని, చట్టాలు, నిబంధనల ప్రకారం డంపింగ్ యార్డ్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో డంపింగ్ యార్డ్ పోరాట కమిటీ సలహాదారు ఆర్.నరసింహా గౌడ్, ఎక్స్ ఉప సర్పంచ్, చైర్మన్ షేక్ షావలి, కోకన్వీనర్లు తోటపల్లి శంకర్ (ఎక్స్ ఎంపిటిసి), శివ బాబు (ఐఎఫ్‌టియు), బహుజన సత్తా బండకింది సింగరయ్య గౌడ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మల నరసింహులు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కసర్ల నాగరాజు, సిపిఐ నాయకులు వి.స్వరూప, రవి నాయక్, వెంకటరమణ, భాస్కర్ రావు, వెంకట్ రాజ్, సిపిఎం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి



**ప్రజాపక్షం/నిజాంపేట్:** ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ సర్కిల్ బాచుపల్లి, పంచవటి కాలనీలో సుమారు రూ.30 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిమెంటు రోడ్డు పనులను మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డితో కలిసి కొలను హన్మంత రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. డ్రైనేజీ లైన్‌తో కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం జరుగుతుందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో కోట్లాది రూపాయల నిధులను తీసుకువచ్చి నిజాంపేట్ సర్కిల్‌ని అభివృద్ధి పరుస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలను రాజశేఖర్ రెడ్డి, బాచుపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొలను జీవన్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్ కార్యదర్శి కొలను బాల్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.




**ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే జన్మదిన వేడుకలు..**

నిజాంపేట్ సర్కిల్ బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే జన్మదిన వేడుకల ను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి కేక్‌ని కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా హన్మంత రెడ్డి మాట్లాడుతూ దేశానికి, కాంగ్రెస్ పార్టీకి నిరంతరం సేవలను అందిస్తున్న మల్లిఖార్జున ఖర్గే నిండు నూరేళ్లు, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు. ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని అన్నారు.

## టిజిఎస్‌ఆర్‌టిసిలో భారీ చేరికలు



**ప్రజాపక్షం/వికారాబాద్ :** టిజిఎస్ఆర్‌టిసలో ఎంప్లాయిస్ యూనియన్‌లో భారీ చేరికలుజరిగియి. టిజిఎస్ఆర్‌టీసివికారాబాద్ డిపోలె టిజేంయు నుండి 114 మంది ,టిఎంయునుండి 15మంది ఎంప్లాయిస్‌యునియన్ ప్రధాన కార్యదర్శివెంకన్న సమక్షంలో చేరినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్‌టీసి అందరు ఒకే యునియన్ ద్వారా సమస్యల పరిష్కరనికి అష్కరం ఉంటుందన్నారు.చేరినవారుగోపాల్ ,జివికే రెడ్డి ,సుదర్శన్, అశోక్ ,స్వమీదాస్,రవికుమార్,సురేష్ ,,బందయ్య ,అర్చన ,సుజాత తదితరులు చేరినారు. ఈకార్యక్రమంలో డిపో ఎంప్లాయిస్ యూనియన్‌నాయకులునర్సింలు, చారి, ఆనంద్, యాదగిరి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## శ్మశాన వాటిక స్థల పరిరక్షణ కోసం నిరసన దీక్ష



**ప్రజాపక్షం/చర్లపల్లి:** చిన్న చర్లపల్లిలో నిర్మిస్తునన శ్మశాన వాటిక స్థలాన్ని హిందూవులకు చెందే విధంగా ఉండాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని చిన్న చర్లపల్లిలో నిర్మిస్తున్న శ్మశాన వాటిక స్థలంలో ముస్లిం, క్రిస్టియన్లకు కాకుండా హిందువులకే చెందే విధంగా ఉండాల ని చిన్న చర్లపల్లి చౌరాస్తాలో హిందూ శ్మశాన వాటిక పరిరక్షణ కోసం నిరసన దీక్ష అన్ని పార్టీ ల నాయకులు తాడూరి శ్రీనివాస్, కె నర్సింగ్‌రావు, డి.నాథం, రుద్రగోని రాంచందర్‌గౌడ్, పల్లె వెంకట్‌రెడ్డి, జంగారెడ్డి, భూపాల్‌రెడ్డి, కె శశికాంత్, కె బాల్‌రాజ్‌లతో ఈ కార్యక్రమా న్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటికలో ఉన్న స్థలాన్ని ఒకేచోటు కేటాయించడం సరికాదని ప్రస్తుతం నిర్మిస్తున్న శ్మశాన వాటికను హిందూవులకు కేటాయించి మరోచోట ముస్లిం, క్రిస్టియన్లకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె రవి, కె రాజు, కె రాము, వి. రాంబాబు, డి. సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ నార్త్ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా రవి కుమార్ బాధ్యతల స్వీకారం




**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ 15వ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం జీడిమెట్లలోని జేఏఈ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ నూతన అధ్యక్షుడిగా రవి కుమార్ అనుముల శెట్టి పదవీ బాధ్యతలు స్వీకరించారు.

జిల్లా 320బి ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అవంతిరెడ్డి నూతన కమిటీ తో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి జీఏటీ ఏరియా లీడర్ ఆవుల గోపాలరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, జిల్లా 320 బిలో సికింద్రాబాద్ నార్త్ లయన్స్‌క్లబ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. మల్లారెడ్డి ఆస్పత్రి వద్ద ప్రతిరోజు నిరంతరాయంగా అల్పాహారం అందించడం అభినందనీయమని కొనియాడా రు. సమాజ సేవలో క్లబ్ సభ్యులు ఎల్లప్పుడూ ముందుండటం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శిగా మహంకాళి రావు, కోశాధికారిగా కర్ణ శ్రీనివాస్‌తో పాటు 30మంది బోర్డు ఆఫ్ డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా 320బి సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చల్లా శ్రీనివాస్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు బిర్రు ఆంజనేయులు, క్లబ్ ప్రముఖులు రాజేంద్ర ప్రసాద్, దీపక్ భట్టాచార్య, విజయ్‌కుమార్‌శెట్టి, తాజా మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ మామిడాల శ్రీనివాస్‌తో పాటు పలువురు లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

## ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యం

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జేజే నగర్, యాప్రాల్ పరిధిలో ఇద్దరు చిన్న పిల్లలతో సహా ఒక మహిళ అదృశ్యమైన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. జవహర్ నగర్ ఎస్‌హెచ్‌ఓ సైదులు తెలిపిన వివరాల ప్రకారం...యాప్రాల్‌కు



చెందిన దాసరి శ్రావణి (28) తన భర్త సుమంత్ తో కలిసి గత కొన్నేళ్లుగా ఇక్కడే నివాసముంటున్నారు. ఈ నెల 16వ తేదీ న భర్త సుమంత్ భార్యతో గొడవపడి తన సొంతూరికి వెళ్ళిపోయాడు. దాంతో శ్రావణి తన ఇద్దరు పిల్లలైన అవినాష్ (9), యశ్వంత్ (7)లతో కలిసి ఇంట్లోనే ఉంటోంది. ఈ నెల 19న ఉదయం 9 గంటల సమయం లో శ్రావణి చెల్లి అనూష అక్క ఇంటికి వెళ్లగా, ఇంటికి తాళం వేసి ఉంది. శ్రావణి, ఆమె ఇద్దరు పిల్లలు ఇంట్లో కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన అనూష వెంటనే చుట్టుపక్కల ప్రాంతా ల్లో, బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో బాధితురాలి చెల్లి అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అదృశ్యమైన వారి ఆచూకీ తెలిసిన వారు వెంటనే స్థానిక పోలీసులను సంప్రదించాలని కోరారు.

## కార్పెంటర్ అదృశ్యం కేసు నమోదు

**ప్రజాపక్షం/జవహర్ నగర్:** బాలాజీనగర్‌కు చెందిన కార్పెంటర్ సోమనారాయణ కుమారుడు సాయికుమార్ (25) మంగళవారం ఉదయం నుంచి కనిపించకుండా పోయినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. బాధితుడు సాయికుమార్ గత కొంతకాలంగా బాలాజీ నగర్‌లో ఉంటూ కార్పెంటర్ వృత్తి చేసుకుంటున్నాడు. జులై 21 న ఉదయం 4:30 గంటలకు ఇంట్లో కుటుంబ సభ్యుల కు పనికి వెళ్తున్నాను అని చెప్పి బయటకు వెళ్లాడు. ఆ తర్వాత నుంచి అతని మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది. అయితే, కొంత సమయం తర్వాత సాయికుమార్ తన అక్కకు ఫోన్ చేసి, బంధువులు తనను తీవ్రంగా



నిందించారని, ఆ బాధను తట్టుకోలేక చనిపోతున్నానని చెబు తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. మనస్తాపంతోనే ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నట్లు చెప్పి వెంటనే ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. దీంతో సాయికుమార్ తండ్రి సోమనారాయణ(65) పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, సాయికుమార్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.



## ఎస్ఐఆర్‌కు కాంగ్రెస్ స్పీడ్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఘట్‌కేసర్ మున్సిపాలిటి 6వ డివిజన్ పరిధిలోని ఇడబ్ల్యూఎస్ కాలనీ బాలాజీనగర్, గాంధీనగర్ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుమారు 60 శాతం ఫారాలను బిఎల్‌ఒలకు అందజేశారు. మిగిలిన గడువులో బిఎల్‌ఒలు సమన్వయంతో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, కొంతం అంజిరెడ్డి, రెడ్డి, సీహెచ్ మచ్చేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.




## 'సర్' కార్యక్రమం పరిశీలన

**ప్రజాపక్షం/దుండిగల్ :** కొంపల్లి డివిజన్ పరిధిలోని జయభేరి పార్క్ సమీపంలోని పియర్సన్ స్కూల్ వద్ద నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సర్వే కార్యక్రమాన్ని కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక బీఎల్‌ఓలతో కలిసి ఓటరు నమోదు, సవరణలు, మార్పులు, కొత్త ఓటరు నమోదుకు సంబంధించిన ప్రక్రియను సమీక్షించారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు, కొంపల్లి మాజీ సర్పంచ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ జిమ్మీ దేవేందర్ ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన కల్పించి, ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, వివరాల్లో మార్పులు లేదా సవరణలు అవసరమైతే సంబంధిత ఎన్యూమరేషన్ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఓటర్లకు అవసరమైన దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, ప్రతి అర్హ పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కావలి గోపాల్, భాస్కర్, ఖదీర్, కిషోర్, నవీన్, ఉదయ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణ రక్షకుడిగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లను తీర్చిదిద్దడమే లక్ష్యం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** విద్యతో పాటు జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ప్రతి విద్యార్థికి నిత్య జీవతంలో చాలా అవసరమని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల జగద్గిరిగుట్ట ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ అన్నారు. మంగళవారం జాతీయ బేసిక్ లైఫ్ సపోర్ట్ (బిఎల్ఎస్), కార్డియోపల్మనరీ రీసస్సిటేషన్ (సిపిఆర్) దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్(ఐఎపి) ట్విన్ సిటిస్ బ్రాంచ్, యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిక్షణలో అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను ఎలా కాపాడాలి, సిపిఆర్ చేసే సరైన విధానం బేసిక్ లైఫ్ సపోర్ట్ (బిఎల్ఎస్) పద్ధతులు, చెస్ట్ కంప్రెషన్స్ ఎఇడి వినియోగం వంటి అంశాలను ప్రత్యక్షంగా ప్రదర్శిస్తు విద్యార్థినులకు ప్రాక్టికల్ శిక్షణ అందించారు. అనంతరం వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గీత మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా విద్యార్థినులకు ఇలాంటి శిక్షణలు దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ స్రవంతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె అనిత, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## మొక్క నాటుదాం.. ప్రాణవాయువును పెంచుదాం : ఎంపిడిఒ శాంత

**ప్రజాపక్షం/మర్పల్లి:** ప్రతి ఒక్కరు మొక్కలు నాటి ప్రాణవాయువును కాపాడుదామని ఎంపిడిఒ శాంత అన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండల పరిధిలోని పట్లుర్ గ్రామ పంచాయాతీ పరిధిలోని సర్పంచు పరశురాం ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పేర్కొన్నారు. గ్రామపంచాయతీలో 3400 మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. పట్లూర్ నుండి గణపూర్‌గ్రామ పంచాతీవరకు 400 మొక్కలు నాటారు, పంచాలింగాలకు వేళ్లే రహదారి వరకు మొక్కలు నాటడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎపిఒ అంజిరెడ్డి, రాజు, విశ్వనాధం, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యుడిగా కరుణాకర్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** భారతీయ జనతా పార్టీ కోసం 35 సంవత్సరాలుగా అంకితభావంతో పనిచేస్తున్న కప్పరగల్ల కరుణాకర్‌ను బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యుడిగా ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం విభాగం సహ కన్వీనర్‌గా నియమించారు. నియామకపత్రాన్ని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్ అందజేశారు. అనంతరం మేడ్చల్ నియోజకవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్ రెడ్డిని కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఏనుగు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాల కోసం ఎన్నో ఒడిదుడుకులు తప్పుడు కేసులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా పనిచేసిన కరుణాకర్‌కు రాష్ట్ర స్థాయి బాధ్యతలు రావడం అభినందనీయమన్నారు.



# ఎన్యూమరేషన్ ఫారాలు వెంటనే సమర్పించాలి

హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటర్ల ముమ్మర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్2026)లో భాగంగా కేటాయించిన ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ల (బిఎల్ఓ)లకు అందజేయాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అన్నారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో మంగళవారం అదనపు కమిషనర్ బి.సంతోష్, జోనల్ కమిషనర్ చంద్రకళలతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించడానికి ఆఖరి తేదీ ఆగస్టు 3 వరకు సమయం ఉందనే భావనతో ఓటర్లు ఆలస్యం చే యవద్దని అన్నారు. స్వీకరించిన ప్రతి ఫారాన్ని వెంటనే డిజిటలైజేషన్ చేయాల్సి ఉన్నందున, అందరూ త్వరగా ఫా రాలు నింపి ఇవ్వాలని కోరారు. చివరి రోజు వరకు వేచి చూస్తే, ఒకేసారి అందరూ ప్రయత్నించడం వల్ల స ర్వర్ డౌన్ అయ్యే ముప్పు ఉందని, పైగా ఎస్ఐఆర్ గడు వు పొడిగింపు ఎంతమాత్రం ఉండదన్నారు. బిఎల్ఓలు కొన్ని ప్రాంతాల్లో నాలుగైదు సార్లు, ఐదారు సార్లు ఇంటింటికీ తిరిగినా ఓటర్లు అందుబాటులో లేకపోవడం ఫారాలు ఇవ్వకపోవడం జరుగుతోందని తెలిపారు.

**ఇప్పటివరకు 43 శాతం డిజిటలైజేషన్ పూర్తి**





హైదరాబాద్ జిల్లా పరిధిలోని ఓటర్ల వివరాలు తెలిపారు. 47,36,669 మొత్తం ఓటర్లు ఉండగా ఇప్పటి వరకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 100 శాతం పూర్తయిందన్నారు. జిల్లాలోని 9.59 శాతం మంది (4,54,327 మంది) ఓటర్లు స్వయంగా ఆన్‌లైన్‌లోనే ఎన్యూమరేషన్ ఫారం పూరించారన్నారు. ఇప్పటివరకు మొత్తం 42.96 శాతం (సుమారు 43 శాతం) ఫారాలను స్వీకరించి, వాటి వివరాలను ఆన్‌లైన్ సిస్టమ్‌లో డిజిటలైజ్ చేశామని చెప్పారు.

**ఓటు హక్కుతో సంక్షేమ పథకాలకు సంబంధం లేదు!**

కొందరు ప్రజల్లో ఉన్న అపోహలను కర్ణన్ ఈ సందర్భంగా తోసిపుచ్చారు. ఓటు హక్కు రద్దవుతుందనో లేదా ఎన్యూమరేషన్ ఇవ్వకపోతే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయనో ప్రచారం చేయడం తప్పు అని అన్నారు. 'మీ ఓటు హైదరాబాద్‌లో ఉన్నా లేక గ్రామాల్లో ఉన్నా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏమీ పోవు. ఓటర్లను భయపెట్టి, వారి వద్ద నుంచి ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకోకుండా అడ్డుకుంటే అటువంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయి' అని కర్ణన్ హెచ్చరించారు.

**నిర్లక్ష్యం వహిస్తే చర్యలు**

ఎస్ఐఆర్ ప్రక్రియ పట్ల అధికారులు తీవ్ర బాధ్యతతో వ్యవహరించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఒక ఏఈఆర్‌ఓను ఇప్పటికే సస్పెండ్ చేశామని కర్ణన్ వెల్లడించారు. అలాగే సరిగ్గా పనిచేయని కొంతమంది బిఎల్ఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఫీల్డ్ లెవల్‌లో బిఎల్‌ఓలు ఏ విధంగా పనిచేస్తున్నారనేది పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా విజిలెన్స్ అధికారులను కూడా రంగంలోకి దించినట్లు చెప్పారు.

**రాజకీయ పార్టీల సహకారం కోరిన డిఇఒ**

నగరంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ బూత్ లెవల్ ఏజెంట్లను (బిఎల్ఎలను) తక్షణమే నియమించాలని కర్ణన్ కోరారు. జిల్లాలో ఉన్న 4,062 పోలింగ్ స్టేషన్‌లకు గానూ ఇప్పటివరకు 25,160 మంది బిఎల్ఏలు నియామకమయ్యారని తెలిపారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు ప్రతిరోజూ ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు పూరించడంలో సహాయపడి, ఒక్కో బిఎల్ఏ రోజుకు గరిష్ఠంగా 30 ఫారాల వరకు బిఎల్ఓలకు అందజేసే వెసులుబాటు కల్పించామన్నారు. నగరంలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్ఓ (ఈఆర్ఓ) ఆఫీసులతో పాటు ట్యాంక్‌బండ వద్ద ఉన్న డిఇఒ కార్యాలయంలో ఓటర్ల సేవార్థం హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఓటరు జాబితాలో తమ పేరు భద్రంగా ఉండాలంటే వెంటనే స్పందించి నింపిన ఎన్యూమరేషన్ ఫారాన్ని తమ పరిధిలోని బిఎల్ఓలకు అందజేయాలని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## గండిపేట్ చెరువులో వరుణజపం



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** వర్షాభావ పరిస్థితులతో రాష్ట్రంలో తాగు, సాగునీటి ఎద్దడి నెలకొంటున్న నేపథ్యంలో వర్షాలు కురవాలని వరుణ జపం నిర్వహించారు. ఈ మేరకు ఏడేండ్ల తరువాత రాష్ట్రంలో సంమృద్ధిగా వర్షాలు కురవాలని గండిపేట్ చెరువులో మంగళవారం చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్, వేదపండితుల ఆధ్వర్యంలో వరుణజపం జరిగింది.

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** సౌత్‌ప్రేమ్‌నగర్ ప్రాంతంలో ప్రజా సమస్యలపై సమరంలో భాగంగా ఈరోజు మంగళవారం నిర్వహించిన పాదయాత్రలో ఖైరతాబాద్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్‌రెడ్డి పాల్గొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు, ప్రజలు నీటి సరఫరా, డీసిల్టింగ్, క్యాచ్‌పిట్‌ల నిర్మాణాల గురించి ఫిర్యాదు చేశారు. పాదయాత్రలో బిఆర్ఎస్ నేతలు రమా ప్రభాకర్‌రెడ్డి, మల్లేష్, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్యను పట్టించుకోరా?



**ప్రజాపక్షం/సీతాఫల్‌మండి:** బౌద్ధనగర్ డివిజన్ పరిధిలోని అంబర్‌నగర్ ప్రాంతంలో నెలకొన్న తాగునీటి సమస్యను స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు తమ ప్రాంతంలో తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, సాయి కిరణ్, కృష్ణమాచారి, రాజేశ్వరి, పావని, రాజమణి, షబానా, లక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్‌టి కమిటీ హాల్‌కు మోక్షం



**ప్రజాపక్షం/కవాడిగూడ:** ప్రజల సౌకర్యార్థం కమ్యూనిటీహాల్ నిర్మించాలని, స్థానిక అవసరాలతో పాటు శుభకార్యాలకు ఉపయోగించుకోవాలని జెడ్‌సి మంగతాయారు సూచించారు. ఈ మంగళవారం ఆమె గాంధీనగర్ కమిటీ హాల్ సందర్శించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పావని, డిసి పుష్పలత, ఎఈ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, నాయకులు రత్న సాయిచంద్, శ్రీకాంత్, ఆనంద్‌రావు, జ్ఞానేశ్వర్, సాయి గౌడ్, శ్యామ్, మధుమతి, బాబ్జీ, అభిషేక్, బిఆర్ఎస్ నాయకులు రాకేష్, శ్రీకాంత్, స్థానికులు చిట్టి, ఉమేష్, పవన్, మురళి, ఎల్లప్ప, శాంసన్, మణి తదితరులు పాల్గొన్నారు.

## నిరసనలో కాంగ్రెస్ కార్యకర్తలు



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** 33 శాతం మహిళ రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని ఇందిరాభవన్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. ఆలిండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కలంబ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణక్క, తెలంగాణ ఇంచార్జ్, నేషనల్ జనరల్ సెక్రెటరీ కమలాక్షిరాజన్న, ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** అభివృద్ధి పనుల తీరుతెన్నులను అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పర్యటించారు. ఈ మేరకు న్యూ పటేల్‌నగర్, చెన్నారెడ్డినగర్‌లలో మాజీ కార్పొరేటర్ ఇ.విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. కార్యక్రమంలో జలమండలి డిజిఎం కృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, రమేష్, సిబ్బంది రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్‌పై పిడియాక్ట్

**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** నిత్య నేరస్తుల పట్ల రాజీలేని 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేస్తున్న హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్, ప్రజా శాంతిభద్రతలకు తీవ్ర ముప్పుగా మారిన చిలకలగూడ రౌడీ షీటర్ బొజ్జ భాగ్యరాజ్‌ను ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) చట్టం కింద నిర్బంధ ఉత్తర్వులను జారీ అయ్యాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు చిలకలగూడ పోలీసులు ఈ పీడీ యాక్ట్ ఉత్తర్వులను మంగళవారం అమలు చేశారు. నిత్యం హింసాత్మక నేరాలకు పాల్పడుతూ ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నట్లు పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

## ట్రైనీ మహిళా ఐపిఎస్ లైంగిక వేధింపుల కేసులో మరో ట్విస్ట్

- జుట్టు పట్టుకుని.. గొంతు నులిమి చంపడానికి ప్రయత్నించాడు
- మెడ వద్ద కత్తిని ఉంచి గది నుండి బయటకు వెళ్లనివ్వలేదు
- ఫిర్యాదులో ఆరోపించిన బాధితురాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని జాతీయ పోలీసు అకాడమీ (ఎన్‌పిఎ)లో శిక్షణ పొందుతున్న ఓ మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారిపై మరో ట్రైనీ అధికారి లైంగిక వేధింపుల కేసు సంచలనంగా మారింది. దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఈ కేసులో కొత్త విషయాలు వెలుగు చూశాయి. ఈ నెల 9న రాత్రి 9 గంటలకు మరో ట్రైనీ అధికారి ఉదయ్‌క్రిష్ణారెడ్డి జుట్టుపట్టుకుని బలవంతంగా తన గదిలోకి తీసుకెళ్లాడని, ఆ తరువాత గొంతు నులిమి చంపేందుకు ప్రయత్నించాడని, మెడపై కత్తి పెట్టి గది నుంచి బయటికి తనను రానివ్వలేదని, అనంతరం మూడు కండోమ్ ప్యాకెట్లను తనపైకి విసిరేశాడని ఆరోపించారు. మరుసటి రోజు మరోసారి శారీరకంగా దాడి చేశాడని బాధితురాలు (ట్రైనీ ఐపిఎస్) తన ఫిర్యాదులో వెల్లడించింది. ఈ ఏడాది జూన్ 23 నుంచి సహచర ట్రైనీ అధికారి ఉదయ్ కృష్ణా రెడ్డి వాట్సాప్ ద్వారా అసభ్యకర, లైంగిక వేధింపులకు గురిచేసే సందేశాలు పంపినట్లు ఆమె ఆరోపించారు. అకాడమీలో ఇతర సహచరుల ఎదుట తనపై అవమానకర వ్యాఖ్యలు చేయడమే కాకుండా, మరో ట్రైనీ అధికారితో అక్రమ సంబంధం ఉందంటూ నిరాధార ఆరోపణలు చేసి, వాటిని ఒప్పుకోవాలని ఒత్తిడి తెచ్చినట్లు ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నారు. బెదిరింపులకు పాల్పడి తన వ్యక్తిగత మొబైల్ సందేశాలు చూపించాలని బలవంతం చేశాడని తెలిపారు. ఈ నెల 8న తన మొబైల్ ఫోన్‌ను బలవంతంగా తీసుకెళ్లి పాస్‌వర్డ్ చెప్పించుకున్నాడని, అదే రోజు అసభ్యంగా ప్రవర్తిస్తూ తన శరీరాన్ని తాకేందుకు ప్రయత్నించాడని ఆరోపించారు. అంతేకాకుండా, తన అనుమతి లేకుండా వ్యక్తిగత వీడియోను చిత్రీకరించి తన భర్తకు పంపి బ్లాక్‌మెయిల్ చేశాడని, తన పరువుకు భంగం కలిగించేలా తప్పుడు ప్రచారం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**దర్యాప్తు వేగవంతం..**

ఇదిలావుండగా అత్తాపూర్ పోలీసులు ఈ కేసులో దర్యాప్తు వేగవంతం చేశారు. నిందితుడైన ఉదయ్‌క్రిష్ణారెడ్డి నుంచి వాంగ్మూలం స్వీకరించారు. అలాగే బాధితురాలి వాంగ్మూలాన్ని కూడా రికార్డు చేశారు. బాధితురాలు ఆరోపించిన అంశాలను పరిగణలోకి తీసుకుని సాక్ష్యాధారాలను సేకరించే పనిలో దర్యాప్తు అధికారులు నిమగ్నమయ్యారు. నిందితుడిని అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయి.

## ఖర్గే జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/నల్లకుంట:** కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే 84వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. బాగ్ అంబర్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావుల సుధాకర్ కురుమ ఆధ్వర్యంలో భారత్‌నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద జరిగాయి. ఈ వేడుకల్లో ఖైరతాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మోత రోహిత్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంభుల శ్రీకాంత్‌గౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్, ఎడెల్లి ప్రభాకర్, కోటం అనిల్, రాజేశ్వర్‌రావు, జమీర్, చంద్రశేఖర్, భరత్, సునీల్, రాకేష్, రోహన్, రాజ్కిరణ్, ప్రదీప్, బాలు, కిరణ్, మొజ్, సైఫ్, సలీం, ఫెరోజ్, శంకర్, సందీప్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఆ 26 బిసి కులాలను తెలంగాణలో చేర్చొద్దు'



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తొలగించిన ఎపికి చెందిన 26 బిసి కులాలను తెలంగాణలో చేర్చవద్దని బిసి ఎ కులాల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొ.భాగయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో కొచ్చాక తొలగించిన 26 బిసి కులాలను అదే జాబితాలో చేర్చమని ఎపి రాష్ట్ర బిసి కులాల ప్రతినిధులు ప్రభుత్వానికి అడగటం, బిసి కమిషన్‌ను పురామాయించడమంటే తెలంగాణ బిసి సమాజానికి ద్రోహం తలపెట్టినట్టేనన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన బిసి ఎ కులాల అభివృద్ధికి రిజర్వేషన్లు పెంచాలని కోరారు. వెంటనే ఈ 26 బిసి కులాలు రాష్ట్రానికి కావని బిసి కమిషన్ ప్రభుత్వానికి నివేదికివ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షులు గడప శ్రీహరి, ప్రధానకార్యదర్శి నారాయణ, నేతలు రామానంద స్వామి, కరాటే రామచందర్ పాల్గొన్నారు.

## వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం

- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ
- పాల్గొన్న ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు,ఇతర ప్రజాప్రతినిధులు ప్రముఖులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** కళ్యాణ వైభోగమే, బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణమే... చూసిన వారి జన్మలు ధన్యమయ్యేలా, తిలకించిన వారి కనులు చెమ్మగిలేలా అంగరంగవైభవంగా మంగళవారం బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం జరిగింది. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఆయన కుటుంబ సభ్యులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్యరెడ్డి, శాసన సభ్యులు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల వంటి వారితో పాటు ప్రముఖులు, పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తుల మధ్య అమ్మవారి కళ్యాణ కనుల పండుగగా జరిగింది. ప్రభుత్వం తరపున రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, బిసి సంక్షేమ, రవాణ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి పొన్నం ప్రభాకర్‌లు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అంతకు ముందు దేవాదాయ శాఖ అధికారులు,ఆలయ అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో అపూర్వ స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున భక్తులు, ప్రముఖులు రావడంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు తరలి రావడంతో క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. విద్యుత్ అంతరాయం, ట్రాఫిక్ సమస్యలు, త్రాగునీరు సమస్య వంటివి కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.ట్రాఫిక్ డిసిపి కాజల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, ఈఓ వినోద్‌రెడ్డి, విద్యుత్ శాఖ, జిహెచ్ఎంసి, హెచ్ఎండబ్ల్యూఎస్, మెడికల్, రెవెన్యూ, దేవాదాయ, పోలీస్ శాఖల అధికారులు అమ్మవారి కళ్యాణంలో పాల్గొన్నారు.

## 'నీట్' నిందితులను శిక్షించాలి




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** శాంతియుత దీక్షలు భగ్నం చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని..సోనమ్ వాంగ్ చుక్ ఆరోగ్యంపై ప్రభుత్వమే బాధ్యత వహించాలని.. నీట్ నిందితులను రక్షిస్తే విద్యార్థుల ఘోష తగులుతుందని ... తెలంగాణ విద్యా కమిషన్ మాజీ చైర్మన్ ఆకునూరి మురళి ఆక్షేపించారు. సోనం దీక్షకు మద్దతుగా విద్యార్థులు మంగళవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కి తరలివచ్చి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులను ఉద్దేశించి ఆకునూరి మురళి మాట్లాడుతూ.. సోనమ్ వాంగ్ చుక్ చేస్తున్న శాంతియుత దీక్షకు ప్రజామద్దతు ఉందని, ఆయనను సందర్శించి పరామర్శించేదుకు వేలాది మంది విద్యార్థులు, వారి తల్లి దండ్రులు రావటం ప్రజాభిమానానికి అద్దం పడుతుందన్నారు. ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం సాయంత్రం నీట్ విద్యార్థులు, వారి తల్లిదండులతో శాంతియుతంగా నిరసన చేపట్టారు.

## గుడిసెవాసులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

ప్రభుత్వానికి ఎం.దశరథ్ నాయక్ విజ్ఞప్తి



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** కొన్ని దశాబ్దాల క్రితం ఉపాధి కోసం నగరానికి వలస వచ్చి గుడిసెలు వేసుకొని నివాసముంటున్న పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, నిర్మించి ఇవ్వాలని లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు ఎం.దశరథ్ నాయక్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఆయన మాట్లాడారు. నగరం శివారు, బస్తీల్లోని ఇప్పటికీ అనేకమంది పేద కుటుంబాలకు సొంతిల్లు లేకపోవడం విచారకరమన్నారు. చంపాపేటలోని సింగరేణి కాలనీ, హయత్‌నగర్ సమీపంలోని బంజారాకాలనీ వాసులకు ప్రభుత్వం వెంటనే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరుగుదొడ్లు, మంచినీరు, కరెంట్ వంటి కనీస వసతుల ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. పిల్లల చదువుకు ఓ పాఠశాల, బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ స్కూళ్లు ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్‌రెడ్డికి దశరథ్‌నాయక్ విజ్ఞప్తి చేశారు.

## హస్తినలో బోనాల సంబురాలు



**ప్రజాపక్షం/చార్మినార్:** దేశ రాజధాని ఢిల్లీ తెలంగాణ భవన్‌లో రెండు రోజుల పాటు జరిగే లాల్‌దర్వాజా బోనాల ఉత్సవాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన బోనాల ఉత్సవాలలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీలు జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్ తదితరులు పాల్గొని బోనాల ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. లాల్ దర్వాజా బోనాల ఉత్సవాలకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కూడా ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి మారుతీయాదవ్, ఉపాధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఎ.వినోద్‌కుమార్, కోశాధికారి ఎ.చంద్రకుమార్, మరో కమిటీ ప్రతినిధులు సి.శివకుమార్ యాదవ్, పోసాని సదానంద్ ముదిరాజ్, పోసాని సురేందర్ ముదిరాజ్, నరసింహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కెటిఆర్‌కు ఆహ్వానం



**ప్రజాపక్షం/లాల్‌దర్వాజా:** చారిత్రక అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో ఆగస్టు 9న జరగనున్న 78వ వార్షిక బోనాల పండుగ ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును ఆలయ కమిటీ ఆహ్వానించింది. ఈ మేరకు నందినగర్‌లో కెటిఆర్‌ను అక్కన్న మాదన్న మహంకాళి ఆలయ కమిటీ ప్రతినిధుల బృందం కలసి రానున్న బోనాల పండుగ సంబరాల్లో పాల్గొనాలని కోరారు. కెటిఆర్ కలిసిన వారిలో ఆలయ కమిటి అధ్యక్షుడు డి.ప్రభాకర్, కార్యదర్శి కె.దత్తాత్రేయ, కోశాధికారి ఏ.సతీష్, కార్యనిర్వహక కార్యదర్శి క్రాంతికుమార్, ఉపాధ్యక్షులు జగన్మోహన్‌కపూర్, వినోద్‌కుమార్, సభ్యులు సాయికిరణ్, రవీందర్‌చారి, అరుణ్ తదితరులు ఉన్నారు.

## యోగాసన పోటీలు




**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆర్యసమాజ్ సీతాఫల్‌మండిలో జిల్లా స్థాయి యోగాసన పోటీలు జరిగాయి.నేతాజీ స్కూల్ అధినేత నిరంజన్‌రెడ్డి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి నందనం కృపాకర్, సీతాఫల్‌మండి ఆర్యసమాజ్ అధ్యక్షుడు గంగాధర్‌రావు, కార్యదర్శి మల్లయ్య, యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ కార్యదర్శి డి.జయరాజ్ ఆర్య, జాయింట్ సెక్రటరీ స్నేహ, వేణుకుమార్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

## హస్తం నేతల స్వాగతం

**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** బల్కంపేట్ ఎల్లమ్మ తల్లి కళ్యాణోత్సవానికి విచ్చేసిన భక్తులకు గ్రేటర్ బీసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత వేదిక పై నుంచి ఏఐసీసీ జాతీయ కోఆర్డినేటర్ డా.రవిశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ రవిశేఖర్‌రెడ్డి ఆషాఢం బోనాల శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీసీ చైతన్య వేదిక గ్రేటర్ అధ్యక్షుడు టి.వినోద్‌కుమార్, జూబ్లీహిల్స్ కన్వీనర్ కాలేరు రవీందర్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లోకి విక్రంగౌడ్?

**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** మాజీ మంత్రి, హైదరాబాద్ నగరంలో తనకంటూ ప్రత్యేకత పొందిన దివంగత మూల ముఖేష్‌గౌడ్ కుమారుడు విక్రంగౌడ్ త్వరలో బిఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. తన తండ్రి ముఖేష్ గౌడ్ మరణం తర్వాత కాంగ్రెస్ పార్టీలో తమ కుటుంబానికి తగిన గౌరవం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ సీనియర్లు వ్యవహరించిన తీరుతో మనస్తాపం చెంది పార్టీ వీడాల్సి వచ్చిందని తెలిపారు. బీజేపీలో చేరినప్పటికీ, అక్కడ కూడా తనకు సముచిత స్థానం దక్కలేదన్నారు.

## విద్యార్థులపై లాఠీఛార్జి..

# అట్టుడికిన ఉభయసభలు

**నీట్ పేపర్ లీక్, రామాలయ విరాళాల చోరీపై చర్చించాలని పట్టుబట్టిన విపక్ష సభ్యులు**
**లోక్‌సభ, రాజ్యసభలో కొనసాగిన వాయిదాల పర్వం**
**రెండవ రోజూ తుడిచిపెట్టుకుపోయిన కార్యకలాపాలు**



**న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీక్, సోమవారం ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీఛార్జి, అయోధ్య రామ మందిర విరాళాల దొంగతనం వివాదం పార్లమెంట్ ఉభయసభల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. ఈ నేపథ్యంలో లోక్‌సభ, రాజ్యసభ బుధవారానికి వాయిదా పడింది. కాగా, లోక్‌సభలో రెండవ రోజు కూడా ఎలాంటి కార్యకలాపాలు జరగలేదు. నీట్ పేపర్ లీక్, సిజెపి నిరసన, అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల చోరీపై చర్చ పట్టుబడుతూ ప్రతిపక్ష సభ్యులు నిరసన తెలిపారు. నినాదాలు చేశారు. దీంతో సభ అట్టుడికింది. కార్యకలాపాలకు పదేపదే అంతరాయాలు ఏర్పడటంతో సభను వాయిదా వేశారు. ఉదయం 11 గంటలకు సభ మొదటి ప్రశ్నను చేపట్టగానే, ప్రతిపక్ష సభ్యులు నీట్ పేపర్ లీక్, నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జిపై నినాదాలు చేయడం ప్రారంభించారు. నిబంధనల ప్రకారం తమ సమస్యలను లేవనెత్తే అవకాశం సభ్యులకు కల్పిస్తామని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హామీ ఇచ్చారు. అయితే, నిరసన చేస్తున్న సభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో, బిర్లా సభను వాయిదా వేశారు. ఆ తర్వాత, మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి ప్రారంభం కాగానే, ప్రతిపక్ష సభ్యులు మళ్లీ నినాదాలు చేయడం మొదలుపెట్టారు. ఈ గందరగోళం మధ్య మంత్రులు పార్లమెంటరీ పత్రాలను సభలో ప్రవేశపెట్టారు. ప్రతిపక్ష సభ్యులు తమ తమ స్థానాలకు తిరిగి వెళ్లాలని సభాపతి పదేపదే కోరినా సానుకూల స్పందన రాకపోవడంతో, సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైనప్పుడు, ప్రతిపక్షాల నిరసనలు, నినాదాలు కొనసాగాయి. అధ్యక్ష స్థానంలో ఉన్న దిలీప్ సైకియా, ప్రతిపక్ష సభ్యులు తమ తమ స్థానాలకు తిరిగి వెళ్లి సభా కార్యకలాపాలలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ప్రతిపక్ష సభ్యులు ఆ విజ్ఞప్తిని పట్టించుకోకపోవడంతో, స్పీకర్ సభను మరుసటి రోజుకు సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

**రాజ్యసభ పలుమార్లు వాయిదా**

కాగా, ఇవే అంశాలపై అటు రాజ్యసభలోనూ విపక్ష సభ్యులు నిరసనకు దిగారు. దీంతో మంగళవారం మధ్యాహ్న భోజనానంతరం రాజ్యసభ సమావేశమైన వెంటనే సభా కార్యకలాపాలను మరుసటి రోజుకు వాయిదా వేశారు. అంతకుముందు, అధికారిక పత్రాలను సభ ముందు ఉంచిన అనంతరం, ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, వైద్య ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రాలు లీక్ వ్యవహారంపై సోమవారం నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసుల చర్య గురించి మాట్లాడారు. నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీఛార్జి చేశారని, పోలీసులు బాష్పవాయువు కూడా ప్రయోగించారని ఖర్గే ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలు అధికార పక్ష సభ్యుల నినాదాలకు దారితీయగా, ప్రతిపక్షాలు ప్రతినినాదాలతో సభ దద్దరిల్లింది. గందరగోళం మధ్య, చైర్మన్ సి పి రాధాకృష్ణన్ సభను మధ్యాహ్నం వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం సభ తిరిగి సమావేశమైనప్పుడు, కొనసాగుతున్న గందరగోళం మధ్య సెక్రటరీ జనరల్ పి సి మోదీ లోక్‌సభ నుండి వచ్చిన ఒక సందేశాన్ని చదివి వినిపించారు. ఎస్ ఆర్ ఎలాంగో, దీపక్ ప్రకాష్ పదవీ విరమణ వల్ల ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయడానికి, లాభదాయక పదవులపై ఏర్పాటు చేసే సంయుక్త కమిటీకి ఇద్దరు సభ్యులను రాజ్యసభ ఎన్నుకోవాలని సిఫార్సు చేస్తూ, లోక్‌సభ తన సోమవారం నాటి సమావేశంలో ఒక తీర్మానాన్ని ఆమోదించిందని మోదీ సభకు తెలియజేశారు. అయితే విపక్ష సభ్యులు నిరసన కొనసాగించడంతో, చైర్మన్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకు రెండవసారి వాయిదా వేశారు.

## అమానుష దాడిపై

# చర్చకు అనుమతించండి


**లోక్‌సభ స్పీకర్‌కు ప్రతిపక్ష ఎంపిల విజ్ఞప్తి**
**ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీతో పాటు ఓమ్‌బిర్లాను కలిసిన విపక్ష ఎంపిలు**



**న్యూఢిల్లీ :** పరీక్షల నిర్వహణలో నెలకొన్న సంక్షోభం, విద్యార్థులపై జరిగిన అమానుష దాడిపై లోక్‌సభలో చర్చకు అనుమతించాలని విపక్ష సభ్యులు స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష ఎంపిలతో కలిసి మంగళవారం వారు ఓమ్ బిర్లాను కలిశారు. సభ కార్యకలాపాలు ప్రారంభం కావడానికి ముందే, రాహుల్ గాంధీతో పాటు ఎస్‌పికి చెందిన ధర్మేంద్ర యాదవ్, శివసేన (యుబిటి)కి చెందిన అరవింద్ సావంత్, ఆర్‌ఎస్‌పికి చెందిన ఎన్.కె. ప్రేమచంద్రన్ తదితరులు స్పీకర్ కార్యాలయంలో ఆయనను కలిశారు. విద్యార్థులపై జరిగిన అమానుష దాడి, పరీక్షల సంక్షోభం విషయంలో ప్రభుత్వానికి ఉన్న బాధ్యతారాహిత్యంపై పార్లమెంటులో సమగ్ర చర్చ జరగాలని, తమ భవిష్యత్తు గురించి న్యాయమైన ప్రశ్నలు అడిగినందుకు విద్యార్థులపై దాడి జరిగిందని రాహుల్ గాంధీ ఎక్స్‌లో పేర్కొన్నారు. భారత యువత భవిష్యత్తు గురించి పార్లమెంటు చర్చించలేకపోతే, ఇక దాని ఉనికికి అర్థం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయాన్ని ప్రతిపక్షం అణచివేయనివ్వదు. విద్యార్థుల గళం వీధుల్లోనూ, పార్లమెంటులోనూ వినిపించేలా చూస్తామన్నారు. పేపర్ లీక్ వ్యవహారం, విద్యార్థులపై జరిగిన దాడి విషయంపై హోం మంత్రి అమిత్ షా సభకు వచ్చి సమాధానం ఇవ్వాలని తాము డిమాండ్ చేస్తున్నట్లు కాంగ్రెస్ విప్ మాణిక్కం ఠాగూర్ తెలిపారు. అంతకుముందు, పార్లమెంటు వర్షాకాల సమావేశాల రెండో రోజు ప్రారంభానికి ముందు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఛాంబర్‌లో 'ఇండియా' కూటమి ఫ్లోర్ లీడర్లు సమావేశమై, తమ తదుపరి వ్యూహంపై చర్చించారు. ఈ సమావేశంలో ఖర్గేతో పాటు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు జైరాం రమేష్, కె.సి. వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ధర్మేంద్ర యాదవ్, ఎన్‌సిపి (ఎస్‌పి)కి చెందిన సుప్రియా సూలే, శివసేన (యుబిటి)కి చెందిన సంజయ్ రౌత్, జెఎంఎంకు చెందిన మహువా మాజీ, సిపిఐకి చెందిన పి. సందోష్ కుమార్, సిపిఐ(ఎం)కు చెందిన జాన్ బ్రిట్టాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలకు ఇది సమయం కాదు..

**జవాబుదారీతనం కోరి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాల్సిన రోజు**
**తన పుట్టినరోజు వేడుకలపై మల్లికార్జున ఖర్గే వ్యాఖ్య**



**న్యూఢిల్లీ :** లాఠీచార్జీలు, బాష్ప వాయువు షెల్స్ ప్రయోగించడం, శాంతియుత ప్రజాస్వామ్య నిరసనను అణచివేయడం వంటి కేంద్ర సర్కార్ చర్యలను యావత్ దేశం చూసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ఈ బాధాకరమైన పరిస్థితుల్లో తాను తన పుట్టినరోజు జరుపుకోకూడదని నిర్ణయించుకున్నానని చెప్పారు. 'ఈ రోజు సంబరాలు చేసుకునే రోజు కాదు, జవాబుదారీతనం కోరి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాల్సిన రోజు' అని మంగళవారం 84వ ఏట అడుగుపెట్టిన ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య తల్లి తన పసిబిడ్డలతో ఇలా ప్రవర్తించకూడదని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. అయితే 'నాకు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు, శ్రేయోభిలాషులు మరియు ప్రతి పౌరుడికి నేను హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. మీ ఆప్యాయత నాకు ఎంతో విలువైనది, మీలో ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు' అని ఖర్గే అన్నారు. కానీ ఈ రోజు సంబరాలు చేసుకునే రోజు కాదు, ఇది జవాబుదారీతనం కోరే రోజు, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించండని అని అన్నారు. న్యాయం కోరుతున్న విద్యార్థులపై క్రూరమైన లాఠీలు, బాష్ప వాయువు ఎందుకు ప్రయోగించారని ప్రశ్నించారు. పార్లమెంటును ఎందుకు సీల్ చేశారు, ఇంటర్నెట్‌ను ఎందుకు నిలిపివేశారని ప్రభుత్వాన్ని నిలదీశారు. పదేపదే జరుగుతున్న ప్రశ్నపత్రాల లీకేజీలకు, లక్షలాది మంది యువత పడుతున్న బాధకు ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. ఈ విషయంపై పార్లమెంటులో పూర్తిస్థాయి చర్చకు ప్రభుత్వం తక్షణమే అనుమతించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయానికి నైతిక, రాజకీయ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఖర్గే అన్నారు.

## సిజెపి 'చలో సంసద్'ఘటనలో

# నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు



**న్యూఢిల్లీ :** కాక్‌రోచ్ జనతా పార్టీ (సిజెపి), విద్యార్థులు సోమవారం (జులై 20) నిర్వహించిన 'సంసద్ చలో' యాత్ర సందర్భంగా జరిగిన విధ్వంసం, ఇతర సంఘటనలకు సంబంధించి ఢిల్లీ పోలీసులు నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. మరో రెండు కేసులు నమోదు చేసే దిశగా పోలీసులు చర్యలు చేపడుతున్నారని మంగళవారం సంబంధిత వర్గాలు తెలిపాయి. పార్లమెంట్ స్ట్రీట్, కన్నాట్ ప్లేస్, ఇతర పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేయబడ్డాయని వివరించారు. భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) ఆయుధాల చట్టం, ప్రభుత్వ ఆస్తుల నష్ట నివారణ చట్టంలోని పలు నిబంధనలను వర్తింపజేశారని వారు చెప్పారు. కన్నాట్ ప్లేస్‌లోని 'రీగల్ సినిమా' సమీపంలోజరిగిన హింస, రాళ్లదాడికి సంబంధించి ఒక ఎఫ్ఐఆర్ నమోదుకాగా, చట్టవిరుద్ధంగా గుమిగూడటం, పార్లమెంట్ సమావేశాల సందర్భంగా అనధికారికంగా డ్రోన్ ఎగురవేయడం, హింస వెనక కుట్ర ఉందంటూ వేర్వేరు కేసులు నమోదు అయ్యాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, ఇతర సంబంధిత నేరాలకు సంబంధించి మరో రెండు ఎఫ్ఐఆర్‌లు కూడా సిద్ధం చేస్తున్నారని ఒక పోలీస్ అధికారి తెలియజేశారు. ఈ ఎఫ్ఐఆర్‌లో ప్రజా ఆస్తి నష్ట నివారణ చట్టంలోని నిబంధనలను కూడా పొందుపరిచారు. నిందితులు చట్టవిరుద్ధంగా గుమిగూడి, ప్రజా శాంతికి భంగం కలిగించి, ప్రభుత్వ విధులను నిర్వర్తించనీయకుండా అడ్డుకుని, హింసకు పాల్పడ్డారని, ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించినట్లు ఆరోపణలు ఉన్నాయని ఎఫ్ఐఆర్‌లో నమోదయ్యాయి.మార్చ్ సందర్భంగా కన్నాట్ ప్లేస్, ఔటర్ సర్కిల్‌లోని రీగల్ సినిమా సమీపంలో జరిగిన హింస, రాళ్లదాడి, పోలీస్ వాహనాల విధ్వంసానికి సంబంధించి గుర్తు తెలియని వ్యక్తులపై మరో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వర్గాలు తెలిపాయి. హింసాకాండ సమయంలో నిరసనకారులు పోలీసుల మీద రాళ్లు రువ్వడంతో పాటు ఆ ప్రాంతంలో మోహరించిన పోలీస్ వాహనాలను కూడా ధ్వంసం చేశారని ఒక అధికారి చెప్పారు. హింసాకాండలో పాల్గొన్నవారిని గుర్తించేందుకు దర్యాప్తు అధికారులు సిసిటివి ఫుటేజీ, డ్రోన్ దృశ్యాలు, మొబైల్ ఫోన్ వీడియోలు, ఇతర ఎలక్ట్రానిక్ ఆధారాలను పరిశీలిస్తున్నారు. విచారణలో భాగంగా సోషల్ మీడియా కంటెంట్, ఇతర డిజిటల్ సమాచారాన్ని కూడా వారు విశ్లేషిస్తున్నారని వర్గాలు తెలిపాయి.సోమవారందేశరాజధానిలో చోటుచేసుకున్న ఘర్షణల నేపథ్యంలో ఢిల్లీలో పోలీసుల భద్రతను కట్టుదిట్టం చేశారు.

## సిక్కింలో కుప్పకూలిన టన్నెల్

**కొండచరియలు విరిగిపడడంతో పెనుప్రమాదం**
**అధికారులు, కార్మికులు సహా సొరంగంలో చిక్కుకున్న 25 మంది**
**10 మంది మృత్యువాత**
**కొనసాగుతున్న గాలింపు, సహాయక చర్యలు**







**గ్యాంగ్‌టక్ :** సిక్కింలో ఘోర ప్రమాదం సంభవించింది. నామ్‌చి జిల్లాలో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో నిర్మాణంలో ఉన్న సొరంగం కూలిపోయింది. ఈ ఘటనలో పది మంది మృత్యువాత పడినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. ఘటనాస్థలిలో గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని నామ్‌చి జిల్లా అధికారి పేర్కొన్నారు. జోలుంగేలోని సమర్‌దుంగ్‌లో ఉన్న ఎన్‌హెచ్‌పిసి తీస్తా స్టేజ్–4 జలవిద్యుత్ ప్రాజెక్ట్ సొరంగం కొండచరియలు విరిగిపడటం వల్ల కూలిపోయిందని సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్ తెలిపారు. సోమవారం ఎడిఐటి–3 సొరంగం అకస్మాత్తుగా కూలిపోయినప్పుడు, ప్రాజెక్ట్ అధికారులు, కార్మికులతో సహా మొత్తం 25 మంది అందులో చిక్కుకుపోయారని ఆయన చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తనతో మాట్లాడి, సహాయక చర్యల గురించి ఆరా తీశారని ముఖ్యమంత్రి తెలిపారు. 'మంగళవారం ఉదయం 9.30 గంటల వరకు పది మృతదేహాలను వెలికితీశారు. మరణించిన వారిలో ఏడుగురిని గుర్తించారు, కాగా గుర్తించని మూడు మృతదేహాలను సింగ్టమ్ జిల్లా ఆసుపత్రికి, ఎస్‌టిఎన్‌ఎం ఆసుపత్రికి తరలించారని నామ్‌చి పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తించిన ఏడుగురు మృతులలో నలుగురు పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురికి చెందినవారు కాగా, అసోం, పంజాబ్, ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లకు చెందినవారు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. మరొకరు నామ్‌చి నివాసి అని పోలీసులు తెలిపారు. 'ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు నా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాను. ఈ విషాద సమయంలో, రాష్ట్రం మొత్తం ఆ కుటుంబాలకు అండగా ఉంది, ఈ క్లిష్ట సమయంలో మేము వారికి దృఢంగా మద్దతుగా నిలుస్తాము' అని తమాంగ్ ఒక ప్రకటనలో అన్నారు. కొనసాగుతున్న సహాయక చర్యలను తాను నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. సొరంగంలో చిక్కుకున్న మిగిలిన కార్మికుల మృతదేహాలను వెలికితీసేందుకు నామ్‌చి జిల్లా యంత్రాంగం, సిక్కిం రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (ఎస్ఎస్‌డిఎంఎ), సిక్కిం పోలీసులు, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్), అగ్నిమాపక, అత్యవసర సేవల విభాగం, అలాగే పాక్యోంగ్, సిలిగురి నుండి వచ్చిన జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌టిఆర్‌ఎఫ్) బృందాలు ఇతర ప్రత్యేక ఏజెన్సీలతో కలిసి అవిశ్రాంతంగా పనిచేస్తున్నాయని తమాంగ్ చెప్పారు. ఘటనపై ప్రధాని మోదీ ఫోన్ చేసి ఆరా తీశారన్నారు. 'బాధిత కార్మికులు, సోమవారం నాడు, నిర్మాణంలో ఉన్న సొరంగం ప్రవేశద్వారం వద్ద కొండచరియలు విరిగిపడటం, మధ్యాహ్న సమయంలో గ్యాస్ లీక్ అయ్యే అవకాశం ఉండటంతో సుమారు 27 మంది కార్మికులు లోపల చిక్కుకుపోయారని జిల్లా అధికారులు తెలిపారు. సొరంగం లోపల గ్యాస్ ఉండటం వల్ల సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడిందని, చిక్కుకుపోయిన కార్మికుల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించిన పలువురు సిబ్బందికి తల తిరగడం, స్పృహ కోల్పోవడం వంటి సమస్యలు ఎదురయ్యాయని వారు చెప్పారు.

## పేపర్ లీకేజీల నివారణకు

# రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రావాలి

**'మంగళ మిలన్' సమావేశంలో ప్రధాని మోదీ పిలుపు**
**సమస్య పరిష్కారానికి పార్టీలకు అతీతంగా అందరితో చేతులు కలుపుతాం**
**లాయర్ల సహాయంతో లీకేజీ నేరస్థులకు వీలైనన్ని కఠిన శిక్షలు**
**సాక్ష్యాలతో నిరూపించేందుకు కట్టుదిట్టమైన ఉమ్మడి వ్యవస్థ**
**విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా చర్యలు తీసుకున్నాం**



**న్యూఢిల్లీ:** ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో భవిష్యత్తులో విద్యార్థుల జీవితాలతో ఎవరూ చెలగాటం ఆడకుండా ఉండేందుకు వీలుగా కఠిన చర్యలు తీసుకున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ప్రతి మంగళవారం జరిగే ఎన్‌డిఎ పార్లమెంటరీ పార్టీ ఎంపీల సమావేశం''మంగళ మిలన్'లో మోదీ ప్రసంగిస్తూ, ఈ ప్రశ్నాపత్రాల లీకేజీ బెడద నివారణకు జాతీయ ప్రయోజనాల రీత్యా రాష్ట్రాలలోని ప్రభుత్వాలు కూడా కలిసి రావాలని పిలుపు ఇచ్చారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం సమస్య పరిష్కారానికి పార్టీలకు అతీతంగా అందరితో చేతులు కలుపుతుందని చెప్పారు. నేరస్థులను శిక్షించేందుకు, సాక్ష్యాధారాలతో సహా అన్నీ నిరూపించేందుకు కట్టుదిట్టమైన ఒక ఉమ్మడి వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ఆయన ఉద్ఘాటించారు. ఈ లీకేజీ వ్యవహారాలలో నేరస్థులుగా తేలినవారికి దేశ అత్యున్నత న్యాయవాదుల సహాయంతో వీలైనన్ని కఠిన శిక్షలు పడేట్టు చూస్తామన్నారు.

రాబోయేకాలంలో ఇక ప్రశ్నాపత్రాల లీకేజీలు ఎదురుకాకుండా మళ్ళీ జరగకుండా కఠిన చర్యలు తీసుకున్నామన్నారు.

కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) నాయకత్వంలో పలు విద్యార్థి,యువజన సంఘాలన్నీ కలిసి సోమవారం వేలాదిమందితో పార్లమెంటుకు నిర్వహించతలపెట్టిన భారీ ప్రదర్శనను పోలీసులు భగ్నం చేసి అతిపెద్ద కళంకాన్ని మూటగట్టుకున్న ఒక రోజు తర్వాత ప్రధానమంత్రి మోదీ ఎన్‌డిఎ ఎంపీల సమావేశంలోఈ విషయం గురించి ప్రముఖంగా మాట్లాడారు. ఈ సమావేశం అనంతరం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ వివరాలన్నీ తెలియజేశారు. సమావేశానికి ప్రతి ఎంపీ తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా ప్రధానమంత్రి ముందుగానే మార్గదర్శకాలు జారీ చేశారని చెప్పారు. గంటసేపు ప్రధానమంత్రి ఈ సమావేశంలో ప్రసంగించారని చెప్పారు. ప్రశ్నాపత్రాల లీజీలకు సంబంధించిన వ్యవహారంలో ఇప్పటి వరకూ ప్రభుత్వం 13 మందిని అరెస్టు చేసి జైలుకు పంపామని కూడా ఎంపీలకు మోదీ వివరించారన్నారు. ''అదే సమయంలో ప్రధానమంత్రి ఏం చెప్పారంటే, విద్యార్థుల భవిష్యత్తుకు ఇక రాబోయే కాలంలో ఎలాంటి ఆటంకాలు రాకుండా, సమస్యలు ఎదురు కాకుండా చూసేందుకు నీట్ పునఃపరీక్షకు తాము ప్రాధాన్యత ఇచ్చామని, ఈ పునఃపరీక్షను చాలా విజయవంతంగా నిర్వహించామని, పరీక్షా ఫలితాలను ఎలాంటి జాప్యం లేకుండా విడుదల చేశామని చెప్పారు'' అని రిజుజు పాత్రికేయులతో అన్నారు.

రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన ఎంపీలుసహా బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. నితిన్ నబీన్ ఇటీవల రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ సమావేశం ద్వారా ఎన్నో మంచి ఫలితాలు వచ్చాయని, ప్రధానమంత్రి చాలా ముఖ్యమైన విషయాలు సమావేశంలో మాట్లాడారని చెప్పారు. దేశంలో గడచిన కొద్ది నెలలుగా ఎన్‌డిఎ ప్రభుత్వం సాధించిన విజయాలను మోదీ వివరించారని చెప్పారు. అనేక దేశాలతో ఎన్‌డిఎ ప్రభుత్వం చేసుకున్న స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాల గురించి ఆయన వివరించారని చెప్పారు.దేశంలో రైతు,వ్యాపారులు,చిన్న,సూక్ష్మ పరిశ్రమలు,యువకులు,నిరుద్యోగుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని ఈ ఒప్పందాలు చేసుకున్నామని చెప్పారన్నారు. ఏ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం చేసుకున్నా దానిలో మన దేశ రైతుల ప్రయోజనాలే ప్రధానంగా ఉంటాయని చెప్పారన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లో ఎన్‌డిఎ ఎంపీలు కీలకపాత్ర నిర్వహిస్తారన్నారు.''అన్నిముఖ్యమైన బిల్లులను ఆమోదింపజేసేందుకు మేం ఐక్యంగా ఉన్నాం,జాతీయ ప్రయోజనాలకోసమే ఈ బిల్లులను సభముందుకు తీసుకువస్తాం,మేం ప్రతిపక్షాలకు కూడా విజ్ఞప్తి చేస్తున్నాం, వారికి భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు, కానీ వారు కూడా దేశంకోసం ముందుకు రావాలి,దేశ భవిష్యత్తు,దేశ యువకుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రతిపక్ష ఎంపీలు ముందుకు రావాలి'' అని కిరెణ్ రిజుజు కోరారు.

## సోనమ్ వాంగ్‌చుక్‌ను..

# ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించేందుకు 'ఢిల్లీ హైకోర్టు ఒకే'

**సతీమణి గీతాంజలి ఆంగ్మో పిటిషన్‌పై ఆదేశం జారీ**



**న్యూఢిల్లీ :** విద్యా వ్యవస్థలో వైఫల్యాలపై 20రోజులకు పైగా నిరాహారదీక్ష చేస్తున్న హక్కుల కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించేందుకు ఢిల్లీ హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సోనమ్ వాంగ్‌చుక్ ఆందోళనను విస్మరించలేమనే అభిప్రాయాన్ని వ్యక్తంచేసింది. దీంతో వాంగ్‌చుక్‌కు ఊరట లభించింది. ఆయన సతీమణి గీతాంజలి జె.ఆంగ్మో కోర్టులో పిటిషన్ వేయడం ద్వారా చేస్తున్న న్యాయపోరాటం ఫలితాన్ని ఇచ్చింది. పరీక్షల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని గత నెల 28వ తేదీ నుంచి నిరాహారదీక్ష చేస్తున్న హక్కుల కార్యకర్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను తక్షణమే ఇక్కడి సఫ్దర్‌జంగ్ హాస్పిటల్ నుంచి గుర్‌గావ్‌లోని మెదాంత హాస్పిటల్‌కు తరలించాలని ఢిల్లీ హైకోర్టు మంగళవారం ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వ హాస్పిటల్‌లో ఆయనకు జరుగుతున్న చికిత్సలో జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తూ హైకోర్టు ఆదివారం ఇచ్చిన ఉత్తర్వుకు వ్యతిరేకంగా సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఆంగ్మో దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి డి.కె.ఉపాధ్యాయ, జస్టిస్ తేజాస్ కరియాలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాన్ని జారీ చేశారు. వాంగ్‌చుక్‌ను నిరంతరం పర్యవేక్షించడానికి అవసరమైన వైద్యులను ఏర్పాటు చేయాలని కోర్టు మేదాంత హాస్పిటల్ డైరెక్టర్‌ను ఆదేశించింది. వైద్యులచే ఆమోదించబడిన, వైద్య ప్రమాణాలు, నియమావళికి అనుగుణంగా మందులు ఇవ్వాలని 'దానికి అప్పీల్‌దారు భర్త కట్టుబడి ఉండాలి' అని హైకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21 ప్రకారం సోనమ్ వాంగ్‌చుక్ ప్రాథమిక హక్కులన నెరవేర్చే విధంగా, అతడిని తనకు నచ్చిన హాస్పిటల్ అయిన మెదాంత ఆసుపత్రికి తరలించాలని పేర్కొంది. సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె. ఆంగ్మో కోరుకున్నప్పుడు ఆయనను సందర్శించడానికి అనుమతి ఉంటుందని కూడా ఆ ఆదేశంలో పేర్కొన్నారు. విచారణ సందర్భంగా వాంగ్‌చుక్‌ను మెదాంత హాస్పిటల్‌కు తరలించడానికి ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతర లేదని ధర్మాసనానికి సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. 'మెదాంత ఒక పేరొందిన ఆసుపత్రి. అతడిని ఆ హాస్పిటల్‌క తరలించడానికి ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదు' అని మెహతా అన్నారు. ఎఐఐఎంఎస్ (ఎయిమ్స్) డాక్టర్లతో పాటు, సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌లో సోనమ్ వాంగ్‌చుక్‌కు వైద్యం అందిస్తున్న డాక్టర్ల బృందం, సోనమ్ వాంగ్‌చుక్ సొంత వైద్యులను కూడా కోర్టు సంప్రదించి ఒక ఏకాభిప్రాయం ఉన్నట్లు గమనించింది. ఆదివారం జరిగిన ఒక ప్రత్యేక విచారణలో సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో సోనమ్ వాంగ్‌చుక్‌కు జరుగుతున్న చికిత్స విషయంలో జోక్యం చేసుకోవడానికి జస్టిస్ మిని పుష్కర్ణ నిరాకరించారు. నిరాహారదీక్ష చేస్తున్న వాంగ్‌చుక్‌ను జంతర్ మంతర్ నుంచి ఒక ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించడాన్ని ఏకపక్షచర్యగా పరిగణించలేమని జస్టిస్ మిని పుష్కర్ణ పేర్కొన్నారు. తన నిరాహారదీక్ష 21న జంతర్‌మంతర్ నిరసన స్థలం నుంచి హక్కుల కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను ఢిల్లీ పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌కు తరలించిన ఒక రోజు అనంతరం ఆదివారం ఆయన భార్య గీతాంజలి జె.ఆంగ్మో తన పిటిషన్‌పై తక్షణ విచారణను కోరారు.

**హైకోర్టు మా వాదనను సమర్థించింది :** గీతాంజలి జె. వాంగ్మో హక్కుల కార్యకర్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను సఫ్దర్‌జంగ్ హాస్పిటల్ నుంచి మెదాంత హాస్పిటల్‌కు తరలించేందుకు ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాన్ని వాంగ్‌చుక్ సతీమణి గీతాంజలి జె.ఆంగ్మో స్వాగతించారు. తమ వైద్యులను ఎంచుకునే పౌరుడి ప్రాథమిక హక్కును ఆ ఆదేశం పునరుద్ఘాటించిందని ఆమె అన్నారు. వాంగ్‌చుక్‌ను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించడం 'నిర్బంధంతో సమానం' అని ఆంగ్మో ఆరోపించారు. రోగి మానసిక స్థితి చాలా ముఖ్యం. 'ఢిల్లీ హైకోర్టు అనుకూలమైన ఆదేశం ఇవ్వడం నాకు చాలా సంతోషంగా ఉన్నది' అని ఆమె అన్నారు.

**ఆరుగురు ఎంపీలు షిండే నేతృత్వంలోని శివసేనలో చేరడాన్ని సవాల్‌చేస్తూ...**

# 'సుప్రీం'ను ఆశ్రయించిన శివసేన (యుబిటి)



**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో తమ ఆరుగురు ఎంపీల విలీనానికి లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఇచ్చిన ఆమోదాన్ని సవాల్ చేస్తూ శివసేన (యుబిటి) మంగళవారం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. శివసేన (యుబిటి) తరపున హాజరైన న్యాయవాది దేవదత్ కామత్ ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పాంచోలి ముందు ఈ విషయాన్ని ప్రస్తావించారు. పిటిషన్‌ను బుధవారం విచారణకు జాబితా చేయాలని కామత్ ధర్మాసనాన్ని కోరారు. 'మేం చూస్తాం' అని సిజెఐ అన్నారు. జులై 18న షిండే నేతృత్వంలోని శివసేనలో ఆరుగురు శివసేన (యుబిటి) ఎంపీలు విలీనం అయ్యేందుకు ఆమోదం లభించిందని కామత్ బెంచ్‌కు వివరించారు. వర్షాకాల సమావేశాలకు ముందు జులై 18న షిండే నేతృత్వంలోని శివసేనలో ఆరుగురు శివసేన (యుబిటి) ఎంపీల విలీనానికి బిర్లా ఆమోదం తెలిపారు.ఆరు ఎంపీల విలీనంతో శివసేన బలం 13కు పెరిగిందని అధికారవర్గాలు తెలిపాయి.శివసేన (యుబిటి)తరపున మొత్తం 9మంది ఎంపీలు ఎన్నిక కాగా, వారిలో ఆరుగురు ఎంపీలు షిండే నేతృత్వంలోని శివసేనలో చేరారు. ఫిరాయింపులు ఈ పరిధిలోకి వస్తాయి కాబట్టి తిరుగుబాటు ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని శివసేన (యుబిటి) స్పీకర్ ముందు వాదించింది.

# పది రోజులు కాల్పుల విరమణ

మధ్యవర్తుల ప్రతిపాదన
పదోరోజు కొనసాగిన అమెరికా దాడులు
హోర్ముజ్‌లో నౌక దగ్ధం: నావికులు క్షేమం
17 మంది సైనికుల్ని చంపారు,మూల్యం చెల్లించాలి : ట్రంప్



**దుబాయ్ :** అమెరికా–ఇరాన్ మధ్య పదిరోజుల పాటు కాల్పుల విరమణ తక్షణం పాటించాలని మధ్యవర్తి దేశాలు ప్రతిపాదించాయి. కాగా, ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన పశ్చిమాసియా హోర్ముజ్ జలసంధిపై ఆధిపత్యం కోసం జరుగుతున్న యుద్ధంలో అమెరికా–ఇరాన్ మధ్య వరుసగా పదోరోజు మంగళవారం తీవ్రస్థాయిలో దాడులు కొనసాగినప్పటికీ, మరోవైపు మధ్యవర్తి దేశాలు విరామం లేకుండా శాంతికోసం తమ దౌత్య ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. ఈ చర్యలకు ఇరాన్ కూడా పూర్తి సహకారాన్ని అందిస్తోందని, ఇరాన్ కూడా తనదైన దౌత్య యత్నాలు చేస్తోందని ఆ దేశ విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ సోమవారం ప్రకటించిన నేపథ్యంలో మధ్యవర్తుల నుండి పది రోజులపాటు కాల్పుల విరమణ పాటించాలనే ప్రతిపాదన ముందుకు వచ్చింది. ఈ కాల్పుల విరమణ ప్రయత్నాల నేపథ్యంలో ఇరాన్ హోంశాఖామంత్రి పాకిస్థాన్‌లో పర్యటించి పశ్చిమాసియా పరిణామాలపై చర్చించడం ప్రాముఖ్యత సంతరించుకుంది. పది రోజులుగా అమెరికా తీవ్రస్థాయిలో దాడులు చేస్తున్నప్పటికీ, ఇరాన్‌ను ఓడించి హోర్ముజ్ జలసంధిని స్వాధీనం చేసుకోలేకపోయింది. తమ సైనికులను చంపినందుకు ప్రతీకారం తీర్చుకుంటామని ట్రంప్ హెచ్చరిక చేయగా, హోర్ముజ్‌లో రెండు నౌకలను దగ్ధం చేశామని, జోర్డాన్,కువైట్, బహ్రైన్‌లలో ఉన్న అమెరికా మిలిటరీ స్థావరాలను ధ్వంసం చేశామని ఐఆర్‌జిసి ప్రకటించింది. అమెరికాతో ఇప్పుడు ఇరాన్ పూర్తిస్థాయి యుద్ధంలో నిమగ్నమై ఉందని ఆ దేశాధ్యక్షుడు పెజెష్కియన్ ప్రకటించారు. ఇదిలా ఉండగా, పదోరోజు ఇరాన్‌లోని కీలక మౌలిక వ్యవస్థలపైన, ఇరాన్‌కు ఉన్న సముద్ర సామర్థ్యాన్ని ధ్వంసం చేయడంపైనా అమెరికా సైన్యాలు ప్రధాన లక్ష్యాలుగా దాడులు సాగించాయి. మంగళవారం తెల్లవారకముందే దాడులను విజయవంతంగా వైమానిక పూర్తిచేసినట్లు సెంట్‌కామ్ ప్రకటించింది. ఇరాన్ మిలిటరీ కమాండ్ సెంటర్లు, క్షిపణి ప్రయోగ కేంద్రాలు, డ్రోన్ ప్రయోగ వేదికలు,కోస్తా ప్రాంత నిఘా కేంద్రాలు,టవర్లను ధ్వంసం చేసినట్లు ఎక్స్ వేదికగా పేర్కొంది. జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు కొనసాగకుండా ఇరాన్ అడ్డుకుంటోందని, అందువల్ల ఈ విధంగా అడ్డుకునే సముద్ర సంబంధమైన శక్తిసామర్థ్యాలను ధ్వంసం చేసేందుకు, ఇరాన్‌ను నిర్వీర్యం చేసేందుకు అమెరికా వరుస దాడులు చేస్తోందని సెంట్‌కామ్ ప్రకటించింది. ఫిబ్రవరి 28న యుద్ధం మొదలైనప్పటికీ జులై వరకూ ఎక్కువగా అమెరికాకు సైనిక నష్టం జరగలేదు. కానీ ఇప్పటివరకూ 17 మంది అమెరికా సైనికులు ఇరాన్ దాడుల్లో మరణించారు. అదేవిధంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా పౌరులు అప్రమత్తంగా ఉండాలని, ఇరాన్ శక్తులు దాడులుచేసే ప్రమాదం పొంచి ఉందని ట్రంప్ ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. పశ్చిమాసియా వెలుపల ఉన్న అమెరికన్లు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కోరింది.

కాగా 17 మంది అమెరికా సైనికులను చంపినందుకు ఇరాన్ భారీ మూల్యం చెల్లించాల్సిందేనని డోనాల్డ్ ట్రంప్ తాజా హెచ్చరిక చేశారు. ప్రతిసారీ మీరు మా సైనికుణ్ణి చంపుతున్నారు, అలా చంపిన ప్రతిసారీ, ప్రతి ఘటనకు మీరు మూల్యం చెల్లించాల్సిందే, ఈ దిశగా మా దాడుల వ్యూహం కొనసాగుతుంది అని ట్రంప్ హెచ్చరించారు.అదే సమయంలో ఐఆర్‌జిసి కూడా అమెరికాకు ఒక హెచ్చరిక చేస్తూ, ఖర్గ్ ద్వీపం జోలికి వస్తే సహించబోమని పేర్కొంది. ఇరాన్ ఐఆర్‌జిసి సైన్యాలు కువైట్‌లో ఉన్న విద్యుత్ ప్లాంటులు, నీటి శుద్ధి కర్మాగారాలపై పెను దాడులు కొనసాగించాయి. బహ్రైన్, జోర్డాన్‌లలో అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణి దాడులు చేసింది. కానీ ఈ దాడులను తిప్పికొట్టామని, ఇరాన్ క్షిపణులను కూల్చివేశామని ఆ రెండు దేశాలు ప్రకటనలు చేశాయి. హోర్ముజ్ జలసంధిలో ఒక గుర్తు తెలియని ప్రొజెక్టైల్ ఒక చమురు ట్యాంకర్‌పై దాడి చేయడంతో ఆ ట్యాంకర్‌లో మంటలు చెలరేగాయి. ట్యాంకర్ దగ్ధమైంది. దీంతో ఉన్న నావికులు అందరూ లైఫ్‌బోట్ ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నారు. వీరంతా క్షేమంగా ఉన్నారని, నౌక దగ్ధం అవుతోందని యుకెఎంటిఓ (బ్రిటన్ సముద్ర వాణిజ్య కార్యకలాపాల సంస్థ) ప్రకటించింది. ఒమన్‌లోని లిమాకు తూర్పున ఎనిమిది నాటికల్ మైళ్ళదూరంలో నౌకపై దాడి జరిగింది. కాగా హోర్ముజ్ దక్షిణ మార్గంలో రెండు నౌకలపై దాడుల తర్వాత ఈ రెండు నౌకలూ మంటల్లో దగ్ధమైనట్లు ఐఆర్‌జిసి సైన్యాలు ప్రకటించాయి.

**సౌదీ అరేబియా నౌకలపై హౌతీల దిగ్బంధనం ప్రారంభం :**

ఎర్రసముద్రంలో సౌదీ అరేబియా వాణిజ్య నౌకల రాకపోకలపై యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటు సైన్యాలు దిగ్బంధనం అమలు చేయడం ప్రారంభించాయి. దీంతో సౌదీ అరేబియా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటివరకూ కేవలం హోర్ముజ్ ద్వారా మాత్రమే రాకపోకలు స్తంభించిపోవడంవల్ల ప్రపంచ వాణిజ్యానికి, చమురు,ఇతర సరుకు రవాణాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఇప్పుడు ఎర్ర సముద్రానికి ముఖద్వారం వంటి బాబ్ ఎల్–మాండెబ్ జలసంధిని మూసివేస్తున్నట్లు యెమెన్‌లోని హౌతీలు ప్రకటించారు. దీనివల్ల సౌదీఅరేబియా వాణిజ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. హౌతీల ప్రకటనను సౌదీ అరేబియా తీవ్రంగా ఖండించింది. ప్రతి సంవత్సరం అంతర్జాతీయ వాణిజ్యంలో 12 శాతం మేరకు బాబ్ ఎల్‌మాండెబ్ జలసంధి ద్వారానే జరుగుతూ ఉంటుంది. ఇరాన్ పూర్తిస్థాయి యుద్ధంలో ఉందని, ఈ వాస్తవాన్ని గుర్తించాలని ఆ దేశాధ్యక్షుడు పెజెష్కియన్ ఒక ప్రకటనలో చెప్పారు. శత్రువర్గమైన అమెరికా–ఇజ్రాయెల్‌పై పూర్తిస్థాయి దాడులకు సిద్ధంగా ఉండాలని యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు,లెబనాన్‌లోని హెజ్బొల్లాసైన్యాలు, హమాస్ ఉగ్రవాదులకు ఇరాన్ ఇంతకుముందే పిలుపు ఇచ్చింది. ఎర్ర సముద్రాన్ని మూసివేసేందుకు సిద్ధపడాలని కూడా హౌతీలకు తొలుత ఆదేశాలు ఇచ్చింది. కాగా జులై 14 నుండి ఇరాన్ ఓడరేవులపై అమెరికా సైన్యాలు దిగ్బంధనాన్ని తిరిగి అమలు చేస్తున్నాయి. అంతకుముందు విధించిన దిగ్బంధనం ఎంఓయుపై సంతకాల తర్వాత జూన్ 18వ తేదీన ఎత్తివేశారు.

కానీ ఎంఓయును అమెరికా రద్దు చేయడంతో దిగ్బంధనం తిరిగి మొదలైంది. ఇప్పుడు దీనికి ప్రతిగా హౌతీ తిరుగుబాటుదారులు కూడా సౌదీ అరేబియా నౌకల రాకపోకలను అడ్డుకుంటూ దిగ్బంధనం ప్రారంభించారు.

# అమెరికా–ఇరాన్ సంయమనం పాటించాలి

'ఏసియన్' విదేశీ మంత్రుల
వార్షిక సమావేశం పిలుపు




**మనీలా :** పశ్చిమాసియాలో సంభవిస్తున్న పరిణామాలపై ''ఏసియన్'' (ఆగ్నేయ ఆసియా దేశాల కూటమి) విదేశీమంత్రుల వార్షిక సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వరుస యుద్ధ దాడుల వల్ల మధ్యవర్తుల ప్రయత్నాలకు విఘాతం కలుగుతుందని, శాంతియుత పరిష్కారానికి ఉన్న అవకాశాలు తగ్గిపోతాయని అందువల్ల ఉభయపక్షాలు సంయమనం పాటించాలని పిలుపు ఇచ్చింది. ఈ సమస్యపై ఐక్యత సాధించాలని కోరింది. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో ఏసియన్ విదేశీమంత్రుల సమావేశం మంగళవారం ప్రారంభమైంది. వారం రోజులపాటు జరిగే ఈ సమావేశాలలో పశ్చిమాసియాలో తీవ్ర పరిణామాలు,మయన్మార్‌లో అంతర్గత సంఘర్షణలు, వలసలు,చైనా–ఫిలిప్పీన్స్ మధ్య కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతలు,ప్రాంతీయ అస్థిరత,భద్రత,అంతర్జాతీయ చట్టాలను గౌరవించడం,ఇంధన మార్కెట్లు,సరఫరా వ్యవస్థ నిర్వహణ వంటి అంశాలపై ప్రధానంగా చర్చలు జరుగుతాయి. హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలు సక్రమంగా,స్వేచ్ఛగా కొనసాగేందుకు కూడా ఒక ప్రణాళికపై చర్చిస్తారు.2021లో చేసిన పంచసూత్రాల ప్రణాళికను అమలు చేయకుండా మయన్మార్ ఉల్లంఘనలకు పాల్పడినందువల్ల ఈసారి సమావేశాలకు మయన్మార్‌ను రానీయకుండా బహిష్కరించారు. తప్పుచేసిన సభ్యదేశంపట్ల ఎలాంటి వైఖరి తీసుకోవాలనే విషయంపై కూడా ఈ సమావేశంలో చర్చలు జరుగుతాయి. ఫిలిప్పీన్స్ విదేశీమంత్రిత్వశాఖ కార్యదర్శి మా థెరిసా లజారో ప్రారంభోపన్యాసం చేస్తూ,పశ్చిమాసియా సమస్య పరిష్కారానికి చురుకైన,క్రియాశీల పద్ధతుల్లో సమస్య పరిష్కారం కోసం ఏసియన్ దేశాలు స్పందించాలని పిలుపు ఇచ్చారు. విచ్ఛిన్నమైన ప్రపంచంలో ఏ ఒక్క దేశం కూడా ఈ తీవ్రమైన అస్థిర పరిస్థితులను, సంక్షోభాన్ని ఒంటరిగా తట్టుకోలేదని, మన బలం,మన స్థైర్యం అన్నీ ఐక్యతతోనే ముడిపడి ఉన్నాయని, ఈ విధంగా ఘర్షణలు సాగితే విడిపోయే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. అమెరికా,రష్యా,చైనా,జపాన్ దేశాలకు చెందిన విదేశాంగమంత్రులు కూడా ఈ సమావేశంలో పాల్గొంటారు. వారం రోజులపాటు ఈ సమావేశాలు జరుగుతాయి. ఈ సమావేశంలో ముఖ్యంగా అమెరికా–చైనాలకు చెందిన విదేశాంగ మంత్రులు మార్కో రుబియో, వాంగ్ యీ రాబోయే గురువారం ఈ సమావేశం సందర్భంగా ముఖాముఖీ సమావేశం నిర్వహించనున్నారు. ఈ తరుణంలో అందరూ వీరిద్దరిమధ్యా సమావేశంపైనే ఎక్కువగా దృష్టి కేంద్రీకరించారు. ప్రస్తుతం దక్షిణ చైనా సముద్రంలో చైనా–ఫిలిప్పీన్స్‌దేశాల మధ్య ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజా ఘర్షణల నేపథ్యంలో అమెరికా కూడా ఈ విషయంలో జోక్యం చేసుకుని చైనాకు హెచ్చరిక చేసింది. దీనిపై చైనా కూడా తీవ్రంగా స్పందించింది.

**దక్షిణ చైనాలో ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకు అమెరికా ప్రయత్నం**

దక్షిణ చైనాలో ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు అమెరికా ప్రయత్నం చేస్తోందని చైనా విమర్శించింది. దక్షిణ చైనాలో సిసిజి చట్టం అమలును పర్యవేక్షించే చైనా సిబ్బంది,అధికారులపట్ల ఫిలిప్పీన్స్ సముద్ర నావికులు దూకుడుగా ప్రవర్తించారని చైనా చెబుతుండగా,అమెరికా అందుకు విరుద్ధ ప్రకటన చేసింది. చైనా సిబ్బంది దాడిచేసి ఘటనను అమెరికా విదేశాంగ శాఖ ఖండించింది. ఆసియా–పసిఫిక్‌లో, ఏసియన్ కూటమిలో తన ప్రభావం,వైభవం క్షీణించిపోతోందన్న అమెరికా బాధ,ఆక్రోశమే వారి చర్యలకు కారణమని చైనా విదేశీమంత్రిత్వశాఖ విమర్శించింది. ఏసియన్ కూటమి సమావేశాల సందర్భంగా ఈ అంశానికి ఆజ్యంపోసి ఉద్రిక్తతలు రెచ్చగొట్టాలని అమెరికా ప్రయత్నం చేస్తోందని చైనా విదేశీమంత్రిత్వశాఖ విమర్శించింది.చైనాలోని రెనాయ్ జియోవో వద్ద అక్రమంగా నిలిపి ఉంచిన ఫిలిప్పీన్స్ నౌకనుండి రబ్బరు పడవలో వచ్చిన సిబ్బంది చైనా నౌకను ఢీకొట్టి వివాదానికి దిగారని విమర్శించింది.

# నెతన్యాహూను అరెస్టు చేయం : ట్రంప్

**వాషింగ్టన్ :** ఒకవేళ నెతన్యాహూ అమెరికాలో పర్యటన చేస్తే ఆయనను తమ భూభాగంపై ఎన్నటికీ అరెస్టు చేయబోమని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అదే సమయంలో న్యూయార్క్ మేయర్ మమ్దానీ మాత్రం ఆయన అరెస్టుకు పలు ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్నారు. 2024లో అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ఇచ్చిన తీర్పులో నెతన్యాహూపై అరెస్టు వారెంటు జారీ చేసింది. ఏ దేశంలో కాలు పెట్టినా ఆయనను అరెస్టు చేయాలని ఆదేశించింది. సెప్టెంబరులో జరిగే ఐక్యరాజ్యసమితి సాధారణ సభ సమావేశాల సమయంలో నెతన్యాహూ అమెరికా వస్తే తాము తమ దేశంలో అరెస్టుకు అనుమతించబోమని ట్రంప్ చెప్పారు. కానీ తమ యంత్రాంగం ద్వారా నెతన్యాహూను అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయేమో అని పరిశీలిస్తున్నట్లు మమ్దానీ ప్రకటించిన కొద్ది రోజుల తర్వాత ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ట్రంప్ పై వ్యాఖ్యానాలు చేశారు. యుద్ధ నేరాల్లో హేగ్ కోర్టు అరెస్టు వారెంటు ఎదుర్కొంటున్న నెతన్యాహూ అమెరికాలో ఎంతకాలం ఉన్నాగానీ, అరెస్టుచేయబోమని స్పష్టత ఇచ్చారు.



డెమోక్రాట్స్‌పార్టీలో మమ్దానీ వామపక్ష భావజాల విభాగ నాయకుడుగా దేశంలో పేరుపడ్డారు. రాబోయే నవంబరు ద్వైవార్షిక ఎన్నికలలో ట్రంప్‌ను దెబ్బతీసే ప్రత్యర్థిగా ఆయన వెనుక అనేకమంది మద్దతుదారులు రిపబ్లికన్లపై పోటీకి సిద్ధమవుతున్నారు.

# ద్రోహులను క్షమించను

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో బిజెపి పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు ఐక్యంగా కలిసి ముందుకు అడుగులు వేద్దామని ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, టిఎంసి నాయకురాలు మమతా బెనర్జీ ''ఇండియా కూటమి''లో కాంగ్రెస్,వామపక్షాలకు కీలక ప్రతిపాదన చేశారు. ఇండియా కూటమిలో ఉన్న కాంగ్రెస్,వామపక్షాలు పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు తీవ్ర ప్రత్యర్థులుగా ఉన్నప్పటికీ, వారు అదే కూటమి ఛత్రం కింద ఉంటూ తమతో కలిసి రావాలని కోరారు. రాష్ట్రంలో బిజెపికి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు ఒక ఐక్య సంఘటన ఏర్పాటు చేసి కలిసి పోరాటం చేద్దామని మమతా బెనర్జీ విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో తనకు ఎలాంటి అహంభావం,భేషజాలు లేవని, బెంగాల్‌లో బిజెపికి వ్యతిరేకంగా పోరాటం చేసే ఇతర పార్టీలు కూడా విభేదాలు పక్కనపెట్టి అదే స్ఫూర్తితో ముందుకు రావాలని కోరారు.

జులై 21న నేలకొరిగిన (1993) టిఎంసి అమరవీరులకు నివాళులు అర్పించేందుకు నిర్వహించిన వార్షిక ర్యాలీలో కోల్‌కతాలో మమతాబెనర్జీ ప్రసంగిస్తూ, బిజెపి పాలకులపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అవసరమైతే తాను కాక్రోచ్ జనతాపార్టీ నిరసన ప్రదర్శనల్లో పాల్గొంటానని ప్రకటించారు. నీట్ అవకతవకల వల్ల మరణించిన విద్యార్థుల ప్రాణాలను కేంద్రం తిరిగి తీసుకురాగలదా? అని ప్రశ్నించారు. కేవలం అయోధ్య ఆలయంలోనే కాదు, బెంగాల్‌లో కూడా వివిధ ఆలయాలలో బిజెపి నిదులు దోచుకుంటోందన్నారు. త్వరలోనే బెంగాల్ వ్యాప్తంగా జిల్లాలో పర్యటనలు చేస్తానన్నారు. ''బెంగాల్‌లో బిజెపి పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు ఇండియా కూటమి కింద అందరూ ఏకం కావాలని నేను కోరుకుంటున్నాను, ఈ విషయంలో నాకు ఎలాంటి అహంభావం లేదు, ఇతరులు కూడా కలిసి పోరాడాలని కోరుకుంటున్నాను'' అని పార్టీల పేర్లు ప్రస్తావించకుండా చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భవించిన తర్వాత మొదటిసారి సంస్థాగతంగా అతిపెద్ద చీలికను ఆమె ఎదుర్కొంటున్నారు.

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో తిరిగి పట్టు సాధించేందుకు టిఎంసి చేస్తున్న ప్రయత్నాలలో భాగంగానే మమతా బెనర్జీ ఈ ప్రతిపాదన చేశారని భావిస్తున్నారు. బెంగాల్ ఎన్నికల్లో ఘోర ఓటమి, పార్టీలో నాయకులు, ఎంపిలు, ఎంఎల్‌ఎల అసమ్మతి,,పార్టీ చీలిక, కోర్టు కేసులు, పోరాటపరంగా టిఎంసి బలహీన పడటం వంటి అనేక పరిణామాల పూర్వరంగంలో ఆమె ఈ సరికొత్త ప్రతిపాదన చేశారు. పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్–వామపక్షాలతో సంబంధాల విషయంలో చేసిన ఈ అభ్యర్థన ఆమె పార్టీ వైఖరిలో ముఖ్యమైన మార్పును సూచిస్తోందని పిటిఐ పేర్కొంది. ఐతే తన సొంత పార్టీలో ఉంటూ ద్రోహం చేసినవారిని క్షమించేది లేదని,అసమ్మతివాదులను ఎప్పటికీ తిరిగి పార్టీలో చేర్చుకోబోమని ఆమె ప్రకటించారు. అసమ్మతివాదులపట్ల తాము కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

తృణమూల్ కాంగ్రెస్‌పార్టీని బలహీనపరచేందుకు ముఖ్యమంత్రి సువేందు అధికారి రాష్ట్రంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని వాడుకుంటున్నారని విమర్శించారు. ఆయన తొడుక్కున ముసుగు తొలగించి నిజస్వరూపం బయట పెడతానని హెచ్చరించారు. ''నేను గనుక నోరు విప్పితే, పార్టీలో ఉన్న పది సంవత్సరాలలో నువ్వు చేసిన పనులు ఏమిటో అన్నీ బయటపెడతా, నువ్వు తొడుక్కున ముసుగు తొలగించి నీ నిజస్వరూపం బహిర్గతం చేస్తా,కేంద్రంలో గనుక ఎన్నికల్లో బిజెపి ఓడిపోతే పశ్చిమ బెంగాల్‌లో కూడా ప్రభుత్వం కుప్పకూలిపోయే పరిస్థితి వస్తుంది'' అని హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండీ టిఎంసి నాయకులను, ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని కేంద్ర దర్యాప్తు సంస్థలను అధికారి వాడుకుంటున్నారు, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టిఎంసి నాయకులు,కార్యకర్తలపై 14,000 కేసులు నమోదు చేశారు,ఈ విధంగా వారు సిఐడి పనిచేసి గిన్నిస్‌బుక్కులోకి ఎక్కాలని చూస్తున్నారు'' అని వ్యంగ్య విమర్శలు చేశారు.

## బెదరని యువత

(మొదటి పేజీ తరువాయి)

అవకతవకలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మద్దతుదారులు నినాదాలు చేయడంతో, విద్యాశాఖ మంత్రి హర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించడంతో మధ్యాహ్నం అంతా నిరసన ప్రదేశం జనంతో కిక్కిరిసిపోయింది. సోమవారం భద్రతా సిబ్బందితో జరిగిన ఘర్షణ తమను నిరుత్సాహపరచలేకపోయిందని, పైగా మరింత మందిని ఉద్యమంలోకి చేర్చిందని చాలా మంది నిరసనకారులు అన్నారు. అయితే పేరు ట్యాగ్‌లు లేని పోలీసు సిబ్బంది మహిళలతో సహా నిరసనకారులను కొట్టి, వారిని ఉగ్రవాదులు అని పిలిచారని ఆరోపిస్తూ, యువ మద్దతుదారుల బృందం ఒకటి తమ అనుభవాలను దీప్కేకు వివరించింది. దీప్కే చేతులు జోడించి వారికి క్షమాపణ చెబుతూ కనిపించారు. సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నట్లు ఉద్యమ నాయకులెవరూ నిరసన స్థలాన్ని విడిచిపెట్టలేదని ఆయన సభకు తెలిపారు. ప్రతిష్టంభనకు పరిష్కారం కనుగొనే ప్రయత్నంలో భాగంగా సిజెపి అధికార ప్రతినిధి అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ కేంద్ర మంత్రి జెపి నడ్డాను కలవడానికి వెళ్లారని ఆయన వారికి చెప్పారు. తరువాత, ఒక ఎక్స్ పోస్ట్‌లో, అణచివేతలో గాయపడిన వారికి దీప్కే క్షమాపణలు చెప్పారు.

'మా మద్దతుదారులందరికీ, ముఖ్యంగా మగ పోలీసు అధికారుల చేతిలో దారుణంగా దెబ్బలు తిన్న అమ్మాయిలకు క్షమాపణలు చెబుతున్నాను. ఢిల్లీ పోలీసుల అమానుష చర్యల నుండి మిమ్మల్ని కాపాడటానికి ఇంకా మెరుగ్గా చేసి ఉండాల్సింది' అని దీప్కే ఎక్స్‌లో రాసుకొచ్చారు. 20 మందికి పైగా విద్యార్థుల మరణాలకు కారణమైన ధర్మేంద్ర ప్రధాన్‌ను కాపాడటానికి, ప్రభుత్వం ఇంకా ఎంతో మంది యువ విద్యార్థుల రక్తాన్ని చిందించాలని కోరుకుంటోందని దీప్కే ప్రశ్నించారు. గాయపడిన వారు తనకు ఫోన్ చేస్త వ్యక్తిగతంగా క్షమాపణలు చెప్పాలనుకుంటున్నానన్నారు. విద్యార్థుల కోసం తాము పోరాడుతూనే ఉంటామని మరో పోస్ట్‌లో పేర్కొన్నారు. కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష 24వ రోజుకు చేరుకుందని సిజెపి ప్రతినిధి అశుతోష్ రాంకా తెలిపారు. ఆయన ఇప్పటికీ మన కోసం పోరాడుతున్నారని, ప్రధాన్‌ను తొలగించాలని రాంకా ఎక్స్ ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు.

## రైతుల అడ్డగింత

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు అంచనా వేయడంతో కీలక జాతీయ రహదారుల పొడవునా భద్రను కట్టుదిట్టం చేశారు. పంజాబ్ సహా హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాల నుంచి రైతులు భారీయెత్తున తరలివస్తారని గతంలో రైతు నాయకులు తెలియజేశారు.ఈ ప్రణాళికలో భాగంగా పంజాబ్ నుంచి 1000 మంది రైతులు బస్సుల్లో ఢిల్లీకి తరలివెళుతున్నారు. రైతుల కాన్వాయ్ మంగళవారం ఉదయం గురుద్వారాశ్రీ పతేగఢ్ సాహిబ్ నుంచి బయల్దేరింది. వారు సోమవారం రాత్రి గురుద్వారా వద్ద నున్న సరాయి (యాత్రికుల సత్రం) వద్ద బసచేశారు. గురుద్వారా నుంచి వారు జిటి రోడ్డుపై సిర్‌హింద్ సమీపంలో ఉన్న మాధోపూర్ వద్దకు చేరుకుని, అక్కడ నుండి శంభువైపు బయల్దేరారు. కురుక్షేత్రలోని షాహబాద్ సమీపంలో ఖనౌరి సరిహద్దు వద్ద, కర్నాల్‌లో కూడా రైతులను పోలీసులు అడ్డుకున్నారు. కురుక్షేత్రలో జ్యోతిసర్ వద్ద తమను అడ్డుకున్నారని రైతులు ఆరోపించారు. హర్యానా–జాతీయ రాజధాని ప్రాంతాల మధ్య ఉన్న సింఘూ సరిహద్దువద్ద మంగళవారం దాదాపు నలుగురు రైతులను అదుపులోకి తీసుకున్నారని రైతు నాయకులు తెలిపారు. పోలీసులు తమను ఢిల్లీకి వెళ్లనివ్వలేదని, తమ వాహనాలను సరిహద్దు వద్ద నిలిపివేసి అక్కడే ఉండాలని ఆదేశించారని ఒక రైతు నాయకుడు వివరించారు. పంజాబ్ రైతు నాయకుడు సర్వాన్ సింఘ్ పాంధర్ మాట్లాడుతూ నయాబ్ సింగ్ సైని ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తాము శాంతియుతంగా ఢిల్లీ వెళదామని అనుకున్నామని, అయితే హర్యానా వద్దే అడ్డుకున్నారని పాంధర్ ఆరోపించారు.

## సీతక్కపై నమోదైన కోవిడ్ కేసు రద్దు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర మంత్రి, ములుగు ఎమ్మెల్యే దనసరి అనసూయ అలియాస్ సీతక్కపై కోవిడ్ నిబంధనల ఉ ల్లంఘన ఆరోపణలతో నమోదైన క్రిమినల్ కేసును హైకోర్టు కొ ట్టివేసింది. ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలు లేవని, చట్టబద్ధమైన విధానాన్ని అనుసరించకుండా కేసు నమోదు చేశారని పే ర్కొంటూ జస్టిస్ కె. సుజన మంగళవారం ఉత్తర్వులు జారీ చేశా రు. 2021 ఏప్రిల్ 26న కోవిడ్‌ను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చాలంటూ ఇందిరాపార్క్ వద్ద సీతక్కతో పాటు కాంగ్రెస్ నాయకులు చేపట్టిన నిరాహార దీక్ష సందర్భంగా అనుమతి లేకుండా కార్యక్రమం నిర్వహించారని, కోవిడ్ వ్యాప్తికి కారణమయ్యారంటూ గాంధీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. హైకోర్టు కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

## ప్రకటన చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. బ్రిట్టాస్ మాట్లాడుతూ శాంతియుత ఉద్యమాన్ని అణచివేయడానికి కేంద్రం బలప్రయోగం చేస్తోందన్నారు. దేశంలో వాస్తవంగా సైనిక పాలన అమలవుతోందని, అమాయక యువకులపై జరిగిన ఈ దారుణం మునుపెన్నడూ చూడలేదన్నారు. వారి ఆందోళన దేశం కోసమే, కానీ వారిపై క్రూరంగా దాడి చేశారని మండిపడ్డారు. జాతీయ రాజధానిలో ఇంతటి రక్తపాతాన్ని మునుపెన్నడూ చూడలేదన్నారు. అమాయక యువకుల పుర్రెలు కూడా పగలగొట్టారని, ఇందులో పోలీసులే కాకుండా, ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు కూడా పాలుపంచుకున్నారని ఆరోపించారు. అయినప్పటికీ, విద్యార్థులు అద్భుతమైన స్థైర్యాన్ని ప్రదర్శించి పార్లమెంటుకు చేరుకున్నాన్నారు. ఈ విషయంపై పార్లమెంటులో పలుమార్లు అంతరాయాలు ఏర్పడ్డాయని పేర్కొంటూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, హోం మంత్రి అమిత్ షా ఇద్దరి రాజీనామాలను ప్రతిపక్షం డిమాండ్ చేస్తోందని బ్రిట్టాస్ అన్నారు. 'పుర్రెలు, కాళ్లు విరిగిన పలువురు యువకులను కలిశాం. వందలాది మంది విద్యార్థులు గాయాలతో రోడ్లపై పడి ఉన్నారు. బాధ్యులను జవాబుదారీగా చేయాలి' అని ఆయన అన్నారు. గాయపడిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎంపిలు నినాదాలు చేశారు.

పరీక్షలు, ఉన్నత విద్యలో జరిగిన అవకతవకల ఆరోపణలపై కొనసాగుతున్న వివాదం నేపథ్యంలో ప్రధాన్ రాజీనామా చేయాలని కూడా వారు డిమాండ్ చేశారు. వేలాది మంది ప్రదర్శనకారులు పార్లమెంటు వైపు కవాతు చేయకుండా ఢిల్లీ పోలీసులు బాష్పవాయువు, లాఠీఛార్జులు ప్రయోగించి అడ్డుకున్న మరుసటి రోజు తర్వాత వామపక్ష పార్లమెంటేరియన్ల పర్యటన జరిగింది.

## మెరుపు ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిఘటించారు. పోలీసులు ఆయన మీద పడి బలప్రయోగం చేశారు. ఈ సందర్భంగా తోపులాటలోరాహుల్ గాంధీ ముక్కు కుడి వైపు గాయమై రక్తం వచ్చింది. అలాగే చేతులు, కాళ్ళకు గాయాలయ్యాయి.

మంగళవారం ఎలాంటి చర్చ చేపట్టకుండానే పార్లమెంటును వాయిదా వేసిన తరువాత సుమారు 3:20 గంటల ప్రాంతంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కర్నాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, కేరళ ముఖ్యమంత్రి వి.డిసతీశన్, కాంగ్రెస్ లోక్‌సభ, రాజ్యసభ ఎంపిలు ప్రియాంకగాంధీ, జై రాం రమేశ్, చరణ్‌జీత్ సింగ్ చన్నీ సహా సుమారు వంద మ ంది ఎంపిలు ప్రధాని నివాసం వద్దకు చేరుకొని బైఠాయించారు. చరిత్రలో తొలిసారి పార్లమెంటు ఉభయ సభ ప్రతిపక్ష నేతలు కలిసి ప్రధాని ఇంటి ముందు ధర్నా చేయడం ఇదే తొలిసారి. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా ఇక్కడి ఒక ఆసుపత్రిలో గాయపడిన విద్యార్థులను పరామర్శించిన వెంటనే ఈ అసాధారణ దృశ్యాలు చోటుచేసుకున్నాయి.ఖర్గే కొద్ది సేపు అక్కడే ఉండి వెళ్ళిపోయారు. దాదాపు 20 నిమిషాల తర్వాత, ప్రధానమంత్రి కార్యాలయ (పిఎంఒ) సహాయ మంత్రి జితేంద్ర సింగ్ నిరసన స్థలంలో రాహుల్ గాంధీని కలిసి, ధర్నాను విరమించాలని కోరారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని రాహుల్‌గాంధీ పట్టుబడడంతో ఆయన వెళ్ళిపోయారు. మూడు గంటల పాటు సాగిన ఈ ధర్నా కొనసాగింది. విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ హోంమంత్రి అమిత్ షాతో కలిసి రాజీనామా చేయాలని, విద్యార్థులకు క్షపమాణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే సహా అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర ముఖ్యనేతలు ప్రధాని నివాసం వద్ద బైఠాయించి నిరసన తెలియజేశారు. కొద్ది సేపటి తరువాత ఎన్‌సిపి(శరద్ పవార్) ఎంపి సుప్రియా సూలే అక్కడికి వచ్చి సంఘీభావం తెలిపారు. ఎస్‌పి అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ కూడా ప్రధాని నివాసం వద్దకు చేరుకొని రాహుల్‌గాంధీ కలిసి ధర్నాలో భాగస్వాములయ్యారు. పోలీసులు, రిజర్వు పోలీసులు భారీ సంఖ్యలో ధర్నా చేసిన వారి చుట్టూ మొహరించారు. ఎంపిలను దశలవారీగా అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు.

చివరలో రాహుల్‌గాంధీ, అఖిలేశ్ యాదవ్, ప్రియాంక గాంధీని అరెస్టు చేశారు. తమను తరలిస్తున్న బస్సు నుంచి బైటకు వేలాడుతూ 'గుండాగిరి నహీ చలేగీ' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. కాగా, ప్రియాంక గాంధీని పోలీసులు తరలించిన మందిర్‌మార్గ్ పోలీస్ స్టేషన్‌కు సిపిపి చైర్‌పర్సన్ సోనియాగాంధీ చేరుకొని పరామర్శించారు. సోమవారం నాడు పార్లమెంటు వైపు జరిగిన సిజెపి నేతృత్వంలోని నిరసన ర్యాలీలో యువ విద్యార్థులపై పోలీసులు జరిపిన అరాచక చర్యలకు నిరసనగా కాంగ్రెస్ నేతలు అంతకుముందు ప్రధాని నివాసం వరకు ర్యాలీగా వెళ్లారు. యువ విద్యార్థులపై జరిగిన అరాచకాలకు సమాధానం కోరుతూ తాము ప్రధాని మోదీ ఇంటికి ర్యాలీగా వెళ్లామని, ప్రభుత్వం ఎటువంటి బాధ్యత వహించడానికి గానీ, పార్లమెంటులో దీనిపై చర్చ జరపడానికి గానీ ఇష్టపడటం లేదని రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

ఈ ఘటన కంటే ముందు నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై పార్లమెంటుకు చేపట్టిన నిరసన ర్యాలీలో పోలీసుల చర్యల వల్ల గాయపడి, ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా (ఆర్ఎంఎల్) ఆసుపత్రిలో చేరిన విద్యార్థులను లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ కలిసి వారికి సంఘీభావం తెలిపారు. ఆసుపత్రిలో వెంటిలేటర్ సపోర్ట్‌పై ఉన్న గాయపడిన యువ నిరసనకారిణి తల్లిని కూడా వారు కలిశారని సంబంధిత వర్గాలు తెలిపాయి. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ విద్యార్థుల ఆరోగ్యం గురించి ఆరా తీసి, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

**విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పాలి : రాహుల్‌గాంధీ**

కాగా, పార్లమెంట్ భవన సముదాయంలో రాహుల్‌గాంధీ విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులపై జరిగిన పోలీసుల దాష్టీకానికి గాను ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలని, అలాగే హోం మంత్రి అమిత్ షాతో కలిసి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యపై చర్చించాలని ప్రతిపక్షం కోరుకుంటోందని ఇతర ప్రతిపక్ష ఎంపిలతో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓమ్‌బిర్లాను కలిసి ఆయనకు తెలియజేశానని చెప్పారు. దీనిపై ప్రభుత్వాన్ని అడగాల్సి ఉంటుందని బిర్లా చెప్పారన్నారు. అంటే, పార్లమెంట్‌లో చర్చ జరగాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని స్పీకర్ మాకు చెబుతున్నారని తమకు అర్థమైందన్నారు. 'ఇది విద్యార్థులు, దేశ భవిష్యత్తుకు సంబంధించిన విషయం. ప్రజలను కొడుతున్న తీరు పూర్తిగా భారతీయతకు విరుద్ధం. సోమవారం జరిగిన ఘటనకు సంబంధించి మోదీ కనీసం క్షమాపణ కూడా చెప్పలేదు' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు పేర్కొన్నారు. విద్య, పరీక్షల వ్యవస్థలు పూర్తిగా విఫలమయ్యాయని, అవి అస్తిత్వం కోల్పోయాయని దేశం మొత్తానికి తెలుసునన్నారు. 'దేశంలోని యువతకు ఎలాంటి అవకాశాలు లేవు. అన్ని ద్వారాలు మూసుకుపోయాయి. కేవలం ఒక్క ద్వారం మాత్రమే తెరిచి ఉంది, అదే పోటీ పరీక్షల ద్వారం; కానీ ఆ ద్వారం కూడా ధ్వంసమైపోయింది' అని ఆయన చెప్పారు.

విద్యార్థులు కేవలం విద్యా విధానం గురించే కాకుండా, తమ భవిష్యత్తు గురించి కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. 'నేడు ఈ దేశంలో మిస్టర్ అదానీ, మిస్టర్ అంబానీల ప్రభావం వల్ల, విద్యా వ్యవస్థను ఆర్ఎస్ఎస్ పూర్తిగా తన గుప్పిట్లోకి తీసుకోవడంతో 'ప్రచారకులు' విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్లుగా నియమితులవుతున్న నేపథ్యంలో తమకు భవిష్యత్తు లేదని విద్యార్థులు అంటున్నారు. ఇది కేవలం విద్యకు సంబంధించిన విషయం మాత్రమే కాదు, ఇది యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశం' అని అన్నారు.

# అప్పుడు రోహిత్ మాటలు నమ్మలే : శాంసన్





లార్డ్స్‌లో శతకంతో విమర్శకుల చెంప చెళ్లుమనిపించిన రోహిత్ శర్మకు సంజూ శాంసన్ సారీ చెప్పాడు. టి–20 వరల్డ్ కప్ 2026లో తనకు అవకాశం లభిస్తుందని రోహిత్ చెప్పినా.. తాను నమ్మలేదని శాంసన్ తెలిపాడు. 'స్వదేశంలో ముగిసిన పొట్టి ప్రపంచకప్ సమయంలో నేను రోహిత్‌ను నమ్మలేదు. అందుకు ఇప్పుడు సారీ' అని మంగళవారం శాంసన్ పేర్కొన్నాడు. అంతే కాదు మెగా ఈవెంట్లో తనను తాను ఆత్మవిమర్శ చేసుకున్న తీరును సంజూ వెల్లడించాడు. స్వదేశంలో జరిగిన టి–20 ప్రపంచకప్ లీగ్ దశలో బెంచ్‌మీదే కూర్చున్న సంజూ శాంసన్.. నాకౌట్లో చెలరేగాడు. తనకిచ్చిన అవకాశాన్ని రెండుచేతులా అందిపుచ్చుకొని.. వరసగా అర్ధ శతకాలతో టీమిండియా విజయాల్లో కీలకమయ్యాడు. అయితే.. న్యూజిలాం డ్‌తో విఫలమైనందున టోర్నీ ప్రపంచ కప్ జరుగుతుండగా 'అసలు నేను తుది జట్టులో ఉంటానా? ఉండనా?' అనే సందేహం అతడిని వెంటాడిందట. అప్పుడు.. రోహిత్ శర్మ అతడితో 'సంజూ.. నీకు పక్కాగా అవకాశం వస్తుంది. దిగులు చెందకు' అని చెప్పాడని శాంసన్ తాజాగా వెల్లడించాడు. 'నేను నిజాయతీగా చెబుతున్నా.. అప్పుడు రోహిత్‌ను నమ్మలేదు. సారీ. అతడు హృదయపూర్వంగా లేదా తన అనుభవంతో ఆ మాట చెప్పి ఉండవచ్చు. కానీ, ఆరోజు అతడికి నాపై ఉన్న నమ్మకం నాకు లేదు. ఆరోజు నేను అతడి మాటల్ని నమ్మే పరిస్థితిలో లేను. ఎందుకంటే.. న్యూజిలాండ్‌తో పొట్టి సిరీస్ ముగిసిన రెండు రోజులకే వరల్డ్ కప్ మొదలైంది. దాంతో.. నాకు మెగా టోర్నీకి సిద్ధమయ్యేందుకు దాదాపు వారం పట్టింది. అంటే.. నేను అప్పటికీ సిద్ధంగా లేనని నా ముఖంలో 100 శాతం కనిపించేది. ఐదారు రోజులు నేను అదే విధమైన నిరాశలో ఉండిపోయాను. ఆ సమయంలో నాకు నేను ధైర్యం చెప్పుకున్నా. నీకు తెలుసా నువ్వు విఫలమయ్యావు. తర్వాత ఏంటీ? నువ్వు అట్టడుగున ఉన్నావు. ఇక్కడి నుంచి పైకి మాత్రమే వెళ్లగలవు. కాబట్టి.. మానసికంగా సన్నద్ధమవ్వు. నేను క్రికెట్ ఎందుకు ఆడుతున్నాను? నా లక్ష్యం ఏంటీ?.. ఇలా వరల్డ్ కప్ సమయంలో నన్ను నేను విశ్లేషించుకున్నా. అలా నన్ను నేను ప్రశ్నించుకున్నాక అంతా మారిపోయింది. మళ్లీ ట్రాక్‌లోకి వచ్చాను' అని శాంసన్ వెల్లడించాడు. టి–20 వరల్డ్ కప్ నాకౌట్లో రెచ్చిపోయిన శాంసన్ వెస్టిండీస్‌పై 97 నాటౌట్.. సెమీస్‌లో ఇంగ్లండ్‌పై 89, ఫైనల్లోనూ న్యూజిలాండ్‌పై 46 బంతుల్లో 89 రన్స్ చేశాడు. టీమిండియా మూడోసారి టి–20 వరల్డ్ కప్ విజేతగా నిలవడంతో.. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా ఎంపికయ్యాడు శాంసన్.

# కష్టకాలంలో.. విరాట్ భాయ్ అండగా నిలిచాడు

పి.వి. సింధు





భారత షట్లర్లెవరికీ సాధ్యం కాని జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్‌ను పి.వి. సింధు తొలిసారిగా కైవసం చేసుకుని సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆమె విజయం వెనుక కఠిన సాధనతో పాటు భారత క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ ఇచ్చిన ఒక సలహా ఆమె జీవితాన్నే మార్చి వేసింది. ఈ టోర్నీకి ముందు సింధు ఫామ్ కోల్పోయి కెరీర్ పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ఆమె కోహ్లీని సంప్రదించాక సవాళ్లను అధిగమించి విజేతగా నిలిచింది. జీవితంలో ఏది సాధించాలన్నా నమ్మకం అనేది అత్యంత కీలకమైంది. లక్ష్యాన్ని చేరే క్రమంలో దారులన్నీ మూసుకుపోయి తీవ్ర నిరాశలో కొట్టుమిట్లాడుతున్నప్పుడు నిజాయితీతో కూడిన చిన్నమాట సాయమైనా అద్భుతాలు చేసేలా ప్రేరిపిస్తుంది. సరిగ్గా రెండేండ్ల కింద వరకు ఇలాంటి క్లిష్ట పరిస్థితని ఎదుర్కొన్న పి.వి.సింధు స్టార్ క్రికెటర్ కింగ్ కోహ్లీని కలువడంతో అతడిచ్చిన విలువైన సూచనలు తన కెరీర్‌నే మార్చివేసిందని సింధు తెలిపారు. తాను కెరీర్ పరంగా ఫామ్ కోల్పోయి తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న సమయంలో విరాట్ భాయ్‌ను నా భర్త దత్తాతో వెళ్లి కలిశానని తెలిపారు. వెంటనే ఆయన స్పందించాడన్నారు. ఫామ్ కోల్పోయిన సమయంలో సెంచరీ కోసం సుదీర్ఘ నిరీక్షణను ఎలా అధిగమించారని సింధు కోహ్లీని అడగగా.. కింగ్ కోహ్లీ స్పందిస్తూ పరుగులు చేయడమే తన పని అని, అందులోనే ఆనందాన్ని ఆస్వాదించడం ప్రారంభించాను' అని అతడు చెప్పినట్లు ఆమె తెలిపారు. విరాట్ చెప్పిన మాటలు తనపై ప్రభావం చూపాయని, అతని పాజిటివ్ వైఖరిని బ్యాట్మింటన్‌కు అప్లై చేసుకొని ఫలితాలను సాధించినట్లు చెప్పారు. విరాట్ భాయ్‌కు ఎప్పటికి రుణపడి ఉంటామని పి.వి. సింధు తెలిపారు. కాగా, పారిస్ ఒలింపిక్స్ అనంతరం సింధు ఆటతీరుపై స్పోర్ట్స్ సైన్స్ ఆధారంగా విశ్లేషణ జరిపామని దత్త సాయి తెలిపారు. దూకుడుగా ఆడటం తగ్గించి, అవసరానికి మించి లైన్ కాల్స్‌పై ఆధారపడటం వంటి లోపాలను గుర్తించి వాటిపై ప్రత్యేకంగా పనిచేశామని వివరించారు. కోచ్‌లు, ఫిట్‌నెస్ నిపుణుల సూచనల మేరకు ఆహార నియమాలు కూడా కచ్చితంగా పాటించడం వల్లే టైటిల్ సాధ్యమైందని పేర్కొన్నారు.

## మహిళ

## ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లోనూ

# వివక్ష...పెట్టుబడిదారీ వ్యవస్థ



ప్రపంచంలోనే అత్యధిక మంది వీక్షించే క్రీడోత్సవం 'ఫిఫా పురుషుల ప్రపంచకప్' ముగిసింది. ఫైనల్‌లో అర్జెంటీనాను ఓడించి, స్పెయిన్ టైటిల్ కైవసం చేసుకోవడాన్ని కోట్లాది మంది ప్రత్యక్షంగా లేదా ప్రసార మాధ్యమాల్లో పరోక్షంగా వీక్షించారు. కేరింతలు కొట్టారు. కోట్లాది మంది అభిమానులను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఈ టోర్నమెంట్ కేవలం క్రీడా పోటీ మాత్రమేగాక, భారీ వాణిజ్య వ్యవస్థ, మీడియా శక్తి, అంతర్జాతీయ పెట్టుబడులు, ప్రకటనల మార్కెట్, రాజకీయ ప్రభావాల సమ్మేళనంగా కూడా గుర్తింపు సంపాదించింది. అదే సమయంలో మహిళల పట్ల కొనసాగుతున్న వివక్షను కళ్లకు కట్టింది. ఒకప్పుడు కార్మికవర్గం, సాధారణ ప్రజల ఆటగా పేరుగాంచిన ఫుట్‌బాల్, నేడు బహుళజాతి సంస్థలు, ప్రసార హక్కులు, స్పాన్సర్‌షిప్‌లు, డిజిటల్ వేదికల ఆధీనంలో బిలియన్ల డాలర్ల పరిశ్రమగా రూపాంతరం చెందింది. ఈప్రక్రియలో క్రీడ మాత్రమే కాకుండా సమాజంలోని లింగ అసమానతలు కూడా కొత్త రూపాల్లో పునరుత్పత్తి అవుతున్నాయని పలువురు సామాజిక విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రపంచకప్ సమయంలో మహిళల పట్ల సమాజంలో ఉన్న పాత మూస ధోరణు లు మరింత బలపడుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఫుట్‌బాల్ గురించి మహిళలకు అవగాహన ఉండదనే అభిప్రాయాన్ని సరదాజోక్‌ల రూపంలో ప్రచారం చేయడం ఇప్పటికీ కొనసాగుతోంది. ప్రకటనల ప్రపంచంలో కూడా ఇదే ధోరణి కనిపిస్తుంది. ప్రపంచకప్ సందర్భంగా వచ్చే అనేక వాణిజ్య ప్రకటనల్లో పురుషులను మ్యాచ్‌ను ఆస్వాదించే ప్రధాన పాత్రలుగా చూపిస్తే, మహిళలను వంట చేయడం, చిరుతిండ్లు సిద్ధం చేయడం, ఇంటిని శుభ్రంచేయడం వంటి సంప్రదాయ పాత్రలకే పరిమితం చేస్తుంటాయి. మరోవైపు స్టేడియాల్లో మహిళా అభిమానులపై కెమెరాలు కేంద్రీకరించినప్పుడు కూడా వారి క్రీడాభిమానాన్ని కాకుండా రూపసౌందర్యాన్నే ప్రధానంగా చూపించే ప్రయత్నం జరుగుతుందని విమర్శలు ఉన్నాయి. దీంతో మహిళలు నిజమైన అభిమానులుగా కాకుండా ఒక దృశ్య ఆకర్షణగా మాత్రమే చిత్రీకరించబడుతున్నారని మహిళా హక్కుల కార్యకర్తలు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితి సోషల్ మీడియా వేదికలలో మరింత తీవ్రంగా కనిపిస్తోంది. మహిళలు మ్యాచ్‌లపై సాంకేతిక విశ్లేషణలు చేసినా, తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినా, తరచూ అవమానకర వ్యాఖ్యలు, ట్రోలింగ్, సైబర్ వేధింపులను ఎదుర్కొంటున్నారు. ఫుట్‌బాల్‌పై మాట్లాడే హక్కు పురుషులకే ఉందన్న భావన ఇప్పటికీ డిజిటల్ ప్రపంచంలో కొనసాగుతుండటం దీనికి నిదర్శనంగా భావిస్తున్నారు. అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు ఫుట్‌బాల్‌ను లోతుగా అధ్యయనం చేస్తూ, క్లబ్‌లు, జాతీయ జట్లకు అంకితభావంతో మద్దతు తెలుపుతూ ఈ మూస ధోరణులను సవాలు చేస్తున్నారు. మహిళల భద్రత అంశం కూడా ప్రపంచకప్ నిర్వహణలో కీలక చర్చగా మారింది. స్టేడియాల పరిసరాల్లో మద్యం విక్రయాలపై కఠిన నియంత్రణలు, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు, ప్రజా ప్రదేశాల నిర్వహణ వల్ల మహిళలు మరింత సురక్షితంగా మ్యాచ్‌లను వీక్షించగలిగినట్లు అనేక అంతర్జాతీయ మాధ్యమాలు నివేదించాయి. దీనివల్ల మహిళల భద్రత అనేది వ్యక్తిగత జాగ్రత్తలపై మాత్రమే కాకుండా, ప్రభుత్వ విధానాలు, నిర్వహణా వ్యవస్థ, ప్రజా స్థలాల రూపకల్పనపై కూడా ఆధారపడి ఉంటుందని ఈ అనుభవం చూపించింది. ఇక ప్రపంచకప్ వెనుక కనిపించని మరో వాస్తవం కార్మికుల శ్రమ. స్టేడియాలు, హోటళ్లు, ఆతిథ్యరంగం, పరిశుభ్రత, ఆహార సేవలు వంటి రంగాల్లో వేలాది మంది మహిళలు, ముఖ్యంగా వలస కార్మికులు, తక్కువ వేతనాలతో పనిచేస్తుంటారు. ప్రేక్షకుల దృష్టి ఆటగాళ్లపై, కోచ్‌లపై, కోట్ల రూపాయల ఒప్పందాలపై ఉండగా, ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయడానికి కష్టపడే కార్మికుల పాత్ర చాలా వరకు గుర్తింపు పొందదు. కాబట్టి ప్రపంచకప్‌ను కేవలం క్రీడా కోణంలో కాకుండా, వర్గ అసమానతలు, లింగ వివక్ష, శ్రమ దోపిడీ, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థల కోణంలో కూడా విశ్లేషించాల్సిన అవసరం ఉందని సామాజిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. క్రీడా వేదికలు నిజమైన సమానత్వానికి ప్రతీకలుగా మారాలంటే మహిళలను అభిమానులుగా, విశ్లేషకులుగా, కార్మికులుగా, నిర్ణయాధికారులుగా సమాన గౌరవంతో గుర్తించే దిశగా క్రీడా ప్రపంచం ముందడుగు వేయాల్సిన అవసరం ఉంది.

## ధైర్యవంతురాలు కరెన్



జీవితంలో నిజం కోసం నిలబడటానికి విద్య, హోదా, అధికారమే అవసరం కాదు. ధైర్యం, నిజాయితీ, బాధ్యత ఉంటే చాలు అనే విషయాన్ని అమెరికాకు చెందిన కరెన్ సిల్క్‌వుడ్ తన జీవితంతో నిరూపించింది. ముగ్గురు పిల్లలకు తల్లైన ఆమె 1970లలో ఒక అణు ఇంధన కర్మాగారంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తూ, అక్కడ కార్మికుల భద్రతను నిర్లక్ష్యం చేస్తున్నారని, ప్రమాదకరమైన లోపాలను దాచిపెడుతున్నారని గుర్తించింది. తన సహోద్యోగుల ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని భావించిన కరెన్, వాటికి సంబంధించిన ఆధారాలను సేకరించి అధికారుల దృష్టికి తీసుకెళ్లే సాహసం చేసింది. తన వద్ద ఉన్న ఆధారలను కోర్టుకు సమర్పించడానికి వెళుతున్న సమయంలో, ఆమె అనుమానాస్పదంగా రోడ్డు ప్రమాదంలో మరణించింది. నిజం బయటపడకుండా అడ్డుకోవాలనే ప్రయత్నంలో భాగంగా కరెన్‌ను హత్య చేసి ఉంటారన్న అనుమానాలు ఉన్నాయి. ఆమె మరణం వెనుక ఉన్న రహస్యాలు పూర్తిగా వీడకపోయినా, ఆమె పోరాటం వృథా కాలేదు. ఆమె కుటుంబం చేసిన న్యాయపోరాటం ఫలితంగా కార్మికుల హక్కులకు, పరిశ్రమల్లో భద్రతకు, విజిల్‌బ్లోయర్ల రక్షణకు అమెరికాలో కీలకమైన చట్టపరమైన మార్పులు చోటుచేసుకున్నాయి. కరెన్ కథ ప్రతి మహిళకు ఒక స్ఫూర్తి. అన్యాయాన్ని చూసి మౌనంగా ఉండటం కంటే, దాన్ని ప్రశ్నించే ధైర్యమే సమాజాన్ని ముందుకు నడిపిస్తుంది. సత్యం కోసం నిలబడే వ్యక్తులు కొన్నిసార్లు కష్టాలను ఎదుర్కొన్నా, వారి ఆలోచనలు సమాజంలో శాశ్వత మార్పులకు నాంది పలుకుతాయి. మహిళలు కుటుంబ బాధ్యతలతో పాటు సామాజిక బాధ్యతలను కూడా సమర్థంగా నిర్వర్తించగలరని, తమ స్వరం ఎన్నో జీవితాలను రక్షించగలదని కరెన్ జీవితం చెబుతోంది. నిజాయితీ, నిబద్ధత, ధైర్యం కలిసినప్పుడు ఒక సాధారణ మహిళ కూడా చరిత్రలో చెరగని ముద్ర వేయగలదని ఆమె జీవితం మనకు గుర్తు చేస్తుంది.

# దేశ రాజకీయాలను శాసించే శక్తి యువతరానిదే

యువజన వ్యతిరేక విధానాలతో
ఆక్రోశం పెరిగి ఉద్యమాల వైపు

ఉద్యోగాలు, విద్యా సమస్యలపై
పాలకులు వెంటనే స్పందించాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రభుత్వాలు అవలంబిస్తున్న యువజన వ్యతిరేక విధానాలతో తీవ్ర అసంతృప్తి పెరిగి యువత ఉద్యమాల వైపు అడుగులు వేస్తోందని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మంగళవారం నల్లగొండలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఎఐవైఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేశ రాజకీయాలను శాసించే శక్తి యువత చేతుల్లోనే ఉందన్నారు. యువత ఆకాంక్షలను, సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు వాటిని నిర్లక్ష్యం చేస్తూ అణచివేత ధోరణి అవలంబించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. యుజజన వ్యతిరేక విధానాలతో ఆక్రోశం పెరిగి యువత ఉద్యమాల వైపు అడుగులు వేస్తున్నారన్నారు. ఢిల్లీలో జరిగిన యువజన నిరసనలు దేశ యువతలో పెరుగుతున్న అసంతృప్తికి నిదర్శనమన్నారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ ఘటన దేశ విద్యా వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీసిందని, దీనికి రాజకీయ, పరిపాలనా బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని దేశవ్యాప్తంగా డిమాండ్ వస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పం దించకపోవడం బాధాకరమన్నారు. గతంలో చిన్నఘటనలకే మంత్రు లు రాజీనామాలు చేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా, పోటీ పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించడం వల్ల లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారన్నారు. యువశక్తిని పోలీసు బలంతో అణచివేయాలని ప్రయత్నిస్తే ప్రజావ్యతిరేక పరిస్థితులు మరింత తీవ్రతరం అవుతాయని నెల్లికంటి సత్యం హెచ్చరించారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర మాట్లాడుతూ ఉద్యోగ నియామకాలు, పోటీ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో జరిగే ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నమల్ల నవీన్, జిల్లా కార్యదర్శి యషబోయిన మల్లేశం, గడ్డం నవీన్, బండారు శంకర్, జూలూరు వెంకటాచారి, దశరథ్, బాబీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను విస్మరిస్తున్న పాలకులు

ప్రజాసమస్యల పరిష్కారానికి
నిరంతర పోరాటాలు

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు
బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర, రాష్ట్ర పాలకులు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారని, సామాన్యుల కంటే కార్పొరేట్ శక్తుల పట్ల సానుకూలత ప్రదర్శిస్తున్నారని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు ఆరోపించారు. కేంద్రంలో మోదీ సర్కార్ ప్రజల గురించి ఆలోచించడం లేదని పేద, మధ్యతరగతి ప్రజలు బతకలేని స్థితికి ప్రభుత్వ చర్యలు నెట్టివేస్తున్నాయన్నారు. సిపిఐ ప్రజా సంఘాల సంయుక్త సమావేశం మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. బిజి క్లెమెంట్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగ సబ్సిడీలను ఎత్తివేసి వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్ పరిధిలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తుందన్నారు. రసాయనిక ఎరువులపై సబ్సిడీ ఎత్తివేత, ఇతర దేశాల నుంచి జీరో ట్యాక్స్‌తో వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతి కార్పొరేటీకరణలో భాగంగానే జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. అంబానీ, అదానీ తప్ప వేరే సమూహాల గురించి ప్రభుత్వం ఆలోచించడం లేదని వారి కనుసన్నల్లోనే ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి విబి జీ రాం జీ పథకాన్ని తీసుకు వచ్చారని అదే క్రమంలో నాలుగు లేబర్ కోడ్స్‌ను అమల్లోకి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల గురించి పట్టించుకోవడం లేదని హేమంతరావు తెలిపారు. పంటల బీమా పథకాన్ని అమలు చేయడంతో పాటు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి, సమస్యలపై ప్రజలను చైతన్యం చేయడానికి ఆగస్టు నెలలో సిపిఐ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపడుతున్నామని, సెప్టెంబర్ నెలలో చలో ఢిల్లీ విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆగస్టు ఆరు నుంచి 15 వరకు ఖమ్మం జిల్లాలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పాదయాత్రకు సంబంధించిన ఏర్పాట్లపై ప్రజా సంఘాల సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో సిపిఐరాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, అజ్మీర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# హైస్పీడ్ రైలుమార్గాన్ని గత అలైన్‌మెంట్ ప్రకారమే కొనసాగించాలి

సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** హైస్పీడ్ రైలు మార్గాన్ని గత అలైన్‌మెంట్ ప్రకారమే కొనసాగించాలని, నకిరేకల్, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల మేధావులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, ఉద్యోగులు అన్ని వర్గాల ప్రజా సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీలు ఆలోచించాలని, ఈ విషయాన్ని చర్చించాలని రైల్వే లైన్ సాధన కోసం ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని భారత కమ్యూనిస్టు పార్టీ అనమాల లింగయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణకు ముఖద్వారంగా ఉన్న దినదిన అభివృద్ధి చెందుతున్న కోదాడ, సూర్యాపేట పట్టణాలకు హై స్పీడ్ రైల్వే మార్గం ఎంతో అవసరమన్నారు. గత అలైన్‌మెంట్ సూర్యాపేట, కోదా మీదుగా జగ్గయ్యపేట ఉన్నప్పటికీ దానిని మార్చడం సరైనది కాదన్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్నపట్టణాలకు ప్రజలకు హైస్పీడ్ రైలు అవసరమన్నారు. హైస్పీడ్ రైలు మార్గాన్ని ఆలైన్మెంట్ క్యాబినెట్ నిర్ణయాన్ని మార్చకపోతే అన్ని వర్గాలను కలుపుకుని రైతులు మార్గం వచ్చేంత వరకు పోరాటాలు నిర్వహిస్తామని వారన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరి, గుండు వెంకటేశ్వర్లు, జడ శ్రీనివాస్, యల్లావుల రమేష్, కౌన్సిలర్ చెనగాని సైదులు, జక్కుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# యువతపై లాఠీచార్జి అమానుషం

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

ఖమ్మం జిల్లాకేంద్రంలో సిపిఐ రాస్తారోకో

**ప్రజాపక్షం/ఖమ్మం :** నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో, భవిష్యత్తులో చెలగాటమాడిన ఆయనను కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఆయన కోరారు. ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి ఆందోళన చేపట్టిన విద్యార్థి యువకులపై లాఠీ చార్జి చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం స్థానిక బైపాస్ రోడ్డులో సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధి కల్పనలో పూర్తిగా విఫలమైన మోదీ సర్కార్ ఇప్పుడు ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించి ప్రశ్నా పత్రాల లీకేజీ ద్వారా అవినీతికి పాల్పడుతుందన్నారు. లీకేజీకి కారణమైన ధర్మేంద్ర ప్రధాన్‌ను మోడీ ఎందుకు బర్తరఫ్ చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. దేశంలో నియంతృత్వ ధోరణిలో పాలన సాగుతుందని శాంతియుత ప్రజాపోరాటాలపైన లాఠీలు ఝూళిపించడమే ఇందుకు నిదర్శనమని సురేష్ తెలిపారు. నియంతృత్వ ధోరణితో అవలంభించిన ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదని గతం మాదిరే మోదీ ప్రభుత్వానికి కూడా అంతిమ ఘడియలు సమీపిస్తున్నాయని సురేష్ తెలిపారు. రాస్తారోకో సందర్భంగా బైపాస్ రోడ్డులో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఆందోళన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, అజ్మీర రామ్మూర్తి, మహ్మద్ సలాం, శింగు నర్సింహారావు, పగడాల మల్లేష్, దండు ఆదినారాయణ, మిడికంటి వెంకట రెడ్డి, సిహెచ్ సీతామహాలక్ష్మి, యంగల ఆనందరావు, కూచిపూడి రవి, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, నానబాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

ఆగస్టు 1న సూర్యాపేటలో జిల్లా 3వ మహాసభలు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఆగస్టు 1న సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరుగు ఎఐటియుసి జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. 106 సంవత్సరాల చరిత్ర కలిగి భారతదేశంలోని ఏకైక పెద్ద కార్మిక సంఘంగా ఉన్న ఏఐటియుసి జిల్లా మూడో మహాసభలను జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ మహాసభల్లో కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమం రూపొందించుకోవడం కోసం దోహదపడుతాయన్నారు. కార్మిక వ్యతిరేక విధానాల అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సమరశీల పోరాటాలకు సన్నద్ధం చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి గుగులోతు రాజారాం, బ్యాంక్ ఎంప్లాయిష్ యూనియన్ నాయకులు నీల శ్రీనివాస్, ప్రాంతీయ కార్యదర్శి సాయిబాబా, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎడెల్లి శ్రీకాంత్, బూర సైదులు, దీకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు న్యాయం చేస్తాం

## తెలంగాణ ఉద్యమకారుల కమిటీ చైర్మన్ డాక్టర్ కె.కేశవరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జార్ఖండ్ రాష్ట్రం కంటే మరింత మెరుగైన విధానాన్ని, నిబద్ధతతో తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తామని తెలంగాణ ఉద్యమకారుల కమిటీ చైర్మన్ డాక్టర్ కె.కేశవరావు అన్నారు. అన్ని రాజకీయా పార్టీలు, ప్రజా సంఘాల నుండి వచ్చే సలహాలను, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) ప్రాంగణంలో వైద్యులు,న్యాయవాదులు,జర్నలిస్టుల సంఘాలతో తెలంగాణ ఉద్యమకారుల కమిటీ మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, సభ్యులు,ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, అద్దంకి దయాకర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, ఎస్. రాములు నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు, డాక్టర్లు, అడ్వకేట్లు చురుకైన పాత్రను పోషించారన్నారు. డిజిటల్ విధానంలో రికార్డ్ చేసిన ఆధారాల ద్వారా ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూస్తామని స్పష్టం చేశారు. అన్ని విజ్ఞప్తులను క్రోడీకరించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నివేదిస్తామన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్‌తో పాటు జర్నలిస్టుల సంఘాల నాయకులు మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, పల్లె రవికుమార్,కప్పర ప్రసాద్, నర్సింగ్‌రావు, అడ్వకేట్ జెఎసి కన్వీనర్ ఎం.రాజేందర్‌రెడ్డి , ఎస్. సత్యంరెడ్డి, ప్రహ్లాద్, వైద్యుల సంఘం ప్రతినిధులుగా డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్ తదితరులు కమిటీకి తమ అభిప్రాయాలను తెలియజేశారు.

**ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయండి..**

తెలంగాణ ఉద్యమకారుల నిమిత్తం ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, చైర్మన్లు, డైరక్టర్ పోస్టులలలో ఉద్యమకారులకే ప్రాధాన్యత కల్పించాలని పలువురు కోరారు. కాలపరిమితిలోపు తెలంగాణ ఉద్యమకారుల కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని సూచించారు. ఛానల్స్, పత్రికల రక్షణ నిమిత్తం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని, జర్నలిస్టులకు గుర్తింపు ఇవ్వాలని, 250 గజాల నివాస స్థలాన్ని కేటాయించాలని, ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించాలని, పిల్లలకు ఉచిత నాణ్యమైన విద్యను అందించాలని, జర్నలిస్టుల కుటుంబ ఆరోగ్య రక్షణ కోసం ప్రత్యేక హాస్పిటల్ సదుపాయం కల్పించాలని కోరారు. న్యాయవాద వ్యవస్థ, ఉద్యమకారుల హక్కుల పరిరక్షణ కోసం శాసనమండలిలో అడ్వకేట్లకు, డాక్టర్లకు ప్రత్యేక ఎమ్మెల్సీ స్థానాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. డాక్టర్లకు ప్రభుత్వ బదిలీల్లో ప్రత్యేక ప్రాధాన్యత పాయింట్లు ఇవ్వాలని కోరారు.

# ముందస్తు ప్రణాళికతో ముందుకు



- ఎల్‌నినో ప్రభావం వ్యవసాయం, తాగు నీరు, విద్యుత్ రంగంపై పడకుండా కార్యాచరణ రూపొందిస్తున్నాం
- రైతులు నష్టపోకుండా తక్కువ నీటితో సాగుచేసే పంటలను ప్రోత్సహిస్తున్నాం
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజల తోడ్పాటుతో ఎల్‌నినో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క విశ్వాసాన్ని వ్య క్తం చేశారు. ఇందుకు ఎల్‌నినో ప్రభావంపై ప్రజల్లో గ్రామీణ స్థాయి వరకు అవగాహన కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ముందుకు కొనసాగుతున్నామని వెల్లడించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో 'పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతల పెరుగుదల నుంచి తెలంగాణ సంసిద్ధత వరకు' అనే అంశంపై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సులో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వా తావరణం, జలవనరుల నిపుణులు, వాటర్ మె నేజ్‌మెంట్ రంగాలకు చెందిన పలువురు నిపుణులు తమ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వా రా ప్రణాళిక, ఆర్థిక, వ్యవసాయ, నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖల అధికారులకు ఎల్‌నినో ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం డిప్యూటీ సిఎం మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంలో వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై పడకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తోందని తెలిపారు. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతల మార్పులు తెలంగాణలోని వర్షపాతం, చెరువులు, సాగు, తాగునీటి వనరులపై చూపే ప్రభావాన్ని శాస్త్రవేత్తల సహకారంతో అధ్యయనం చేసి కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. వర్షాభావ పరిస్థితులు ఎదురైనా రైతులు నష్టపోకుండా తక్కువ నీటితో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నామని, వ్యక్తిగతం నుంచి జిల్లా స్థాయి వరకు సంసిద్ధత పెంచేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పశువులు, పక్షులు, అటవీ జంతువులకు నీరు, ఆహార కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం కేవలం వ్యవసాయంపైనే కాకుండా విద్యుత్‌రంగంపై కూడా తీవ్ర ప్రభావం చూపనుందన్నారు. విద్యుత్ రంగంలో పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. పగటి పూట అందుబాటులో ఉండే సౌర విద్యుత్‌ను గరిష్టంగా వినియోగించడం ద్వారా ప్రభుత్వంపై, ప్రజలపై ఆర్థిక భారం తగ్గుతుందని చెప్పారు. అవసరాలకు అనుగుణంగా థర్మల్ విద్యుత్‌ను వినియోగిస్తూ గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడుతున్నామని వెల్లడించారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో వర్షాకాలంలో కూడా ఎసిలు, ఫ్యాన్లు, బోర్‌వెల్స్, లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్ల వినియోగం పెరిగి విద్యుత్ డిమాండ్ వేసవి స్థాయికి చేరుకుందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి అవగాహన సదస్సులను జిల్లాల వారీగా నిర్వహించి ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాలని అధికారులను డిప్యూటీ సిఎం ఆదేశించారు. కార్యక్రమంలో ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ ఉప్పల్, వివిధ శాఖల ఉన్నతాధికారులు దివ్య దేవరాజన్, గోపి, జితేష్ వి.పాటిల్, ప్రణాళికా శాఖ డైరెక్టర్ రూఫస్ దత్తం తదితరులు పాల్గొన్నారు.




# ఎన్‌టిఎ రద్దు.. కేంద్రమంత్రి ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి

## ఎఐవైఎఫ్ నిరసన ప్రదర్శన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను రద్దు చేయడంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నేర్లకంటి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో యువత, విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జీ, బాష్పవాయువు ప్రయోగం చేయడాన్ని ఖండిస్తూ మంగళవారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నిరసనకారులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ఎన్‌టిఎ అసమర్థత వల్ల పరీక్షల నిర్వహణపై విద్యార్థుల్లో నమ్మకం దెబ్బతిందని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని, నిరసనలను అణచివేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్. బాలకృష్ణ,నాయకులు కళ్యాణ్, మహేష్, ఎం. భగత్ సింగ్, సి.హెచ్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉనికి కోసం బిజెపి అధ్యక్షుడి నిరాధార ఆరోపణలు

## ఎల్‌నినో విపత్తుపై కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలి

## రామచంద్రరావుకు మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు రాజకీయ ఉనికిని చాటుకునేందుకే నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఎల్‌నినో ప్రకృతి విపత్తు నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణకు ప్రత్యేక నిధులు తీసుకురావడంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ జాతీయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న రామచంద్రరావు విమర్శలు చేయడం కంటే కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే విధంగా నిధులు సాధించాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై కాకుండా రాజకీయ ప్రచారంపైనే ఆయన దృష్టి కేంద్రీకరించారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న క్యూర్ చట్టం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తర్వాత అన్ని రాజకీయ పార్టీలకు తమ అభిప్రాయాలు వెల్లడించే పూర్తి అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. బిజెపి తన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ద్వారా సభలో తమ అభిప్రాయాన్ని చెప్పవచ్చని, ముందుగానే గందరగోళం సృష్టించే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పనిచేస్తోందని, ప్రతిపక్షాల గొంతు నొక్కే సంస్కృతి తమది కాదని స్పష్టం చేశారు. గతంలో బిజెపి ప్రభుత్వం కీలక చట్టాలను సరైన చర్చ లేకుండానే తీసుకొచ్చిందని విమర్శిస్తూ, తెలంగాణ ప్రభుత్వం మాత్రం ప్రతి అంశంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ అనంతరమే నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పటికీ ఏ శాసనసభలోనూ సభ్యుడు కాకపోవడంతో రామచంద్రరావు నిరాశలో ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. జిహెచ్‌ఎంసి పరిధిలో పేదలకు ఇళ్లు ఇవ్వడంపై బిజెపి తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ల నిర్మాణ పథకంలో కేంద్ర నిధులు ఉన్నాయని చెప్పే బిజెపి నాయకులు, నిజంగా తెలంగాణపై చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రానికి అదనపు నిధులు, ప్రాజెక్టులు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని మంత్రి సవాల్ విసిరారు. తెలంగాణకు వచ్చే నిధులు కేంద్రం చేసే ఉపకారం కాదని, రాష్ట్ర ప్రజలు చెల్లించే పన్నుల్లో తెలంగాణకు రాజ్యాంగబద్ధంగా లభించే వాటా మాత్రమేనని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం కేంద్రం నుంచి మరిన్ని నిధులు, మరిన్ని అభివృద్ధి ప్రాజెక్టులు సాధించడంపైనే బిజెపి నాయకత్వం దృష్టి సారించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

# క్యాన్సర్ బాధితురాలికి ఉచిత చికిత్స అందించండి

## బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి హైకోర్టు మధ్యంతర ఆదేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం ప్రకారం 25 శాతం ఉచిత వైద్య సేవల కోటా కింద క్యాన్సర్‌తో బాధపడుతున్న జగిత్యాల జిల్లా మల్యాల మండలానికి చెందిన బాలె భాగ్యమ్మకు తక్షణమే చికిత్స అందించాలని బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిని హైకోర్టు ఆదేశించింది. ఉచిత చికిత్స అమలును జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పర్యవేక్షించాలని సూచించింది. అలాగే ప్రభుత్వానికి ఇచ్చిన హామీ మేరకు 25 శాతం ఉచిత చికిత్స అమలు పరిస్థితిపై నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది. జస్టిస్ ఎన్.వి. శ్రావణ్‌కుమార్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గంద్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ 1989లో జారీ చేసిన జీవో 434 ప్రకారం పేదలకు 25 శాతం ఇన్‌పేషంట్, 40 శాతం ఔట్‌పేషంట్ సేవలను ఉచితంగా అందించాలనే షరతుతో 7.35 ఎకరాల భూమిని లీజుకు ఇచ్చారని తెలిపారు. అనంతరం 2022లో జీవో 80 ద్వారా ఉచిత చికిత్సల అమలును పర్యవేక్షించే విధానాన్ని ప్రభుత్వం రూపొందించిందన్నారు. అయినప్పటికీ పిటిషనర్‌కు ఉచిత చికిత్స నిరాకరించడంతో అధికారులకు వినతిపత్రం ఇచ్చినా స్పందన లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం పిటిషనర్‌కు వెంటనే ఉచిత చికిత్స అందించాలని ఆస్పత్రిని ఆదేశించింది.

# పోలీసు నియామకాల షెడ్యూల్ సమర్పించాలి

## రిక్రూట్‌మెంట్ బోర్డుకు హైకోర్టు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** : రాష్ట్రంలో పోలీసు శాఖలో చేపట్టనున్న నియామకాలకు సంబంధించిన పూర్తి షెడ్యూలును నాలుగు వారాల్లో సమర్పించాలని పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డును హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వం ఆమోదించిన 7,400 పోస్టుల భర్తీ ప్రక్రియకు సంబంధించి స్పష్టమైన కార్యాచరణను కోర్టు ముందుంచాలని పేర్కొంటూ విచారణను వాయిదా వేసింది. ఖాళీల భర్తీ విషయంలో జాప్యాన్ని సవాలు చేస్తూ హెల్ప్ ద పీపుల్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కీతినీడి అఖిల్ శ్రీగురుతేజ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వ తరఫున ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ తొలి విడతలో 5 వేల ఎస్సై, ఏఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. మిగిలిన 2,400 పోస్టులు అగ్నిమాపక, జైళ్ల శాఖలకు సంబంధించినవని వివరించారు. దీనిపై పిటిషనర్ తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేస్తూ గత విచారణలో 7 వేలకుపైగా పోస్టులు భర్తీ చేస్తామని ప్రభుత్వం తెలిపిందని, ఇప్పుడు 5 వేల పోస్టులకే నోటిఫికేషన్ పరిమితం చేశారని పేర్కొన్నారు. నాలుగేళ్లుగా నియామకాలు చేపట్టలేదని, స్పష్టమైన కాలపరిమితితో భర్తీ ప్రక్రియ పూర్తిచేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం పూర్తి నియామక షెడ్యూలును నాలుగు వారాల్లో సమర్పించాలని ఆదేశించింది.

# ఎకో టూరిజం అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

## సిఎస్ సంజయ్ జాజు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఎకో టూరిజం అభివృద్ధి, పులుల సంరక్షణ, టైగర్ రిజర్వుల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో అటవీ శాఖ, పర్యాటక శాఖ సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సిఎస్‌కు వివరించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎకో టూరిజంను అభివృద్ధి పరచి తద్వారా యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి కల్పించడంతో పాటు పర్యటక రంగం ద్వారా రాష్ట్ర ఆదాయం పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ప్రత్యేకంగా భద్రాచలం పరిసర ప్రాంతాలలో ఉన్న కిన్నెరసాని, శ్రీశైలం నల్లమల అటవీ ప్రాంతాలలో అమ్రాబాద్, గోదావరి నది తీర ప్రాంతంలో ఉన్న కవ్వాల్ టైగర్ రిజర్వు, ఆదిలాబాద్, ములుగు ప్రాంతాలలో ఎకో టూరిజం అభివృద్ధికి తగిన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పథకాల ద్వారా రాష్ట్రానికి కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకుని ఎకో టూరిజంను అభివృద్ధి చేయాలని అన్నారు. రాష్ట్రంలో విలువైన అటవీ సంపద ఉందని, జీవ వైవిధ్యం, సహజ ప్రకృతి అందాలను పర్యాటక అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎకో టూరిజం అభివృద్ధికి పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా ప్రాజెక్టులు రూపొందిస్తే , ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు జిడిపి ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్త భాగస్వామ్యంతో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సిఎస్ సూచించారు. ముఖ్యంగా ఫ్యూచర్ సిటీ, అనంతగిరి, వికారాబాద్, సిటీ అర్బన్ ప్రాంతాలలో ఎకో టూరిజంను ప్రోత్సహించాలని అన్నారు. అటవీ ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ, నిబంధనలకు అనుగుణంగా పర్యాటక మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని, సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. సమావేశంలో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ వినయ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణకు ద్రోహం చేసింది ఎవరో ప్రజలకు తెలుసు : బల్మూరి వెంకట్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అధికారం కోల్పోయిన అసహనంతోనే బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్ విమర్శించారు. సిఎల్‌పి కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణకు ద్రోహం చేసింది ఎవరో, మేలు చేసింది ఎవరో రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా తెలుసని పేర్కొన్నారు. తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిన బిఆర్‌ఎస్‌కు రాష్ట్ర అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును కూలేశ్వరంగా మార్చిన భయంతోనే మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ బయటకు రావడంలేదని ఆరోపించారు. వాస్తవాలు తెలుసుకోకుండా కెటిఆర్ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గత బిఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని, టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజీలు, పరీక్షల వాయిదాలతో యువత జీవితాలతో ఆడుకున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఎలాంటి లీకేజీలు లేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించి నియామక ప్రక్రియ చేపట్టామని తెలిపారు. కెటిఆర్ నిరాధార ఆరోపణలు ఇలాగే చేస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని బల్మూర్ వెంకట్ హెచ్చరించారు.

# పోలీసు శాఖలో సమూల మార్పులకు శ్రీకారం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పోలీసు శాఖను మరింత ఆధునికంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్ అధ్యక్షతన మంగళవారం స్టాఫ్ ఆఫీసర్ల సమావేశం నిర్వహించారు. శాఖలో చేపట్టాల్సిన పరిపాలనా, విధానపరమైన, సాంకేతిక సంస్కరణలపై అధికారులు విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ముఖ్యంగా ఎస్‌ఆర్‌సి నివేదిక అమలు, మావోయిస్టు ముప్పు పేరుతో అవసరానికి మించి కల్పించిన భద్రతను ఉపసంహరించడం ద్వారా దాదాపు 400 మంది పోలీసు సిబ్బందిని, బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలను అవసరమైన ప్రాంతాల్లో సమర్థవంతంగా వినియోగంలోకి తీసుకురావడంపై సమీక్షించారు. అలాగే శాఖలోని సిబ్బంది, వాహనాల సమగ్ర ఆడిట్ నిర్వహించి వాటి వినియోగ సామర్థ్యాన్ని పెంచేందుకు కార్యాచరణపై చర్చించారు.గ్రేహౌండ్స్, ఆక్టోపస్ ప్రత్యేక బలగాలను ఒకే క్యాంపస్ నుంచి నిర్వహించే ప్రతిపాదన, తెలంగాణ పోలీసు మాన్యువల్‌కు తుది రూపు ఇవ్వడం, ఐపీఎస్ అధికారుల యూనిఫాంలో క్రాస్‌బెల్ట్‌లు, లాఠీలు వంటి సంప్రదాయ అంశాల కొనసాగింపుపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ సిబ్బంది సమస్యలు, వాటి పరిష్కారానికి ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం, విజిలెన్స్, ఆహార కల్తీ నిరోధం, డ్రగ్ కంట్రోల్ వంటి రంగాల్లో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల ఏర్పాటు, ట్రాఫిక్ అండ రోడ్డు భద్రత బ్యూరో ఏర్పాటు వంటి అంశాలను అధికారులు సమీక్షించారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా టెక్నాలజీ అండ్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగాన్ని మరింత ఆధునికీకరించడంతో పాటు సిసిటిఎన్‌ఎస్ 3.0, టిజికాప్ 3.0, హాక్ఐ 3.0 ప్రాజెక్టుల అమలు పురోగతిని డిజిపి సమీక్షించారు. డిజిటల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో అధికారులు చేసిన సూచనలు, అభిప్రాయాలను సమగ్రంగా పరిశీలించి, తెలంగాణ పోలీసు శాఖ భవిష్యత్ విధానాల రూపకల్పనలో వాటిని పరిగణనలోకి తీసుకుంటామని డిజిపి సి.వి. ఆనంద్ తెలిపారు. రాష్ట్ర పోలీసు వ్యవస్థను కాలానుగుణంగా మరింత ప్రజానుకూలంగా, సాంకేతికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.



# తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన జర్నలిస్టులకు తగిన గౌరవం

## ఉద్యమకారుల కమిటీని కోరిన విరాహత్ అలీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన మహా ఉద్యమంలో, క్రియాశీలక పాత్రను పోషించిన జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించి, వారి సేవలకు, త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ తెలంగాణ ఉద్యమకారుల కమిటీని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం, సంక్షేమం, జర్నలిస్టులతో ఉద్యమ గుర్తింపు కమిటీ హైదరాబాద్‌లోని తెలంగాణ అమర జ్యోతి ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన సంప్రదింపుల సమావేశంలో విరాహత్‌అలీ తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అనంతరం తెలంగాణ కమిటీకి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను, ఆవేదనను, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి తెలియజేస్తూనే, ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను, వాస్తవాలను ప్రజలకు చేరవేసి ఉద్యమానికి నైతిక బలాన్ని చేకూర్చడంలో జర్నలిస్టులు కీలక బాధ్యతలను నిర్వర్తించారని గుర్తు చేశారు.అనేక ప్రాంతాల్లో జర్నలిస్టులు ఉద్యమకారులతో కలిసి ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని, పలుచోట్ల ఉద్యమ జాయింట్ యాక్షన్ కమిటీలకు నాయకత్వం వహించారని తెలిపారు. ఉద్యమ సమయంలో పోలీసులు జర్నలిస్టులపై లాఠీచార్జీలు చేశారని, ఉస్మానియా యూనివర్సిటీతో పాటు పలు చోట్ల కెమెరాలను పోలీసులు ధ్వంసం చేశారని వివరించారు. అన్ని అంశాలను తెలంగాణ ఉద్యమకారుల ఎంపిక కమిటీ సానుభూతితో పరిశీలించి, ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని సేవలందించిన జర్నలిస్టులకు ఉద్యమకారులుగా గుర్తింపు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు

# రాహుల్ గాంధీ అరెస్ట్ ప్రజాస్వామ్య స్ఫూర్తిపై దాడి

## అరెస్టును ఖండించిన రాష్ట్ర మంత్రులు

## టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ తదితరుల అరెస్టును రాష్ట్ర మంత్రులు తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ ప్రధాని నివాసం వద్ద చేపట్టిన శాంతియుత నిరసన సందర్భంగా కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, సీతక్కతో పాటు టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వేర్వేరు ప్రకటనల్లో స్పందించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడం ద్వారా ప్రజల గొంతును అణచివేయలేరని అన్నారు. నీట్ పేపర్ లీక్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని, విద్యార్థుల ఆందోళనలకు పరిష్కారం చూపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన కాంగ్రెస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# విద్యా వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన కేంద్రం : యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో విద్యా వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టిందని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ప్రశ్నాపత్రాల లీక్‌లతో విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందదన్నారు. న్యాయం కోసం గొంతెత్తిన విద్యార్థులపై లాఠీచార్జీలు, కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఆవేదనను అర్థం చేసుకోకుండా కేంద్ర ప్రభుత్వం అణచివేత ధోరణి అవలంభిస్తోందని మండిపడ్డారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రతను కల్పించడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

# ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తులు ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకానికి దరఖాస్తుల స్వీకరణ మంగళవారం నుంచి ప్రారంభమైంది. క్యూర్ పరిధిలోని అర్హులైన వారు మీ సేవ కేంద్రాలు లేదా మీ సేవ వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దరఖాస్తుల ప్రక్రియ ఆగస్టు 10 వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. మీ సేవ పోర్టల్‌తో పాటు మీ సేవ వాట్సాప్ (8096958096) ద్వారా కూడా పౌరులు దరఖాస్తు చేసుకోవడంతో, అప్లికేషన్ స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం కల్పించారు. మీ సేవ, లేదా వాట్సాప్‌లో హాయ్ పంపి చాట్‌బాట్ సూచనలను అనుసరిస్తూ మొబైల్ ద్వారానే దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. దరఖాస్తు సమయంలో ఆధార్ కార్డు వివరాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు, జరిమానా

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మద్యం సేవించి వాహనం నడిపిన ఒక్కరికి 2 రోజుల జైలు శిక్ష, జరిమానా సూర్యాపేట కోర్టు విధించినట్లు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ బి.యాదవేందర్ రెడ్డి తెలిపారు. పలు ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేయగా ఒకరు పట్టుబడగా వారిని మంగళవారం ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా 2 రోజుల జైలుతోపాటు, రూ.1,000 జరిమానా విధించారని వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాలతోపాటు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. పోలీసులు చేసే వాహన తనిఖీలు ప్రజల ప్రాణరక్షణ కోసమేనని ప్రజలు సహకరించాలని కోరారు.

## మహిళ ఆత్మహత్యాయత్నం



కాపాడిన పోలీసులు

**ప్రజాపక్షం/బీబీనగర్ :** కుటుంబ కలహాలు, వ్యక్తిగత సమస్యల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ మహిళ బీబీనగర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించగా, అప్రమత్తమైన పోలీసులు సకాలంలో స్పందించి ఆమెను సురక్షితంగా రక్షించారు. పోలీసులు తెలిపిన ప్రాథమిక వివరాల ప్రకారం, వివాహిత అయిన ఆ మహిళకు కుటుంబ విభేదాల కారణంగా భర్తతో దూరం ఏర్పడింది. అనంతరం మరో వ్యక్తితో పరిచయం ఏర్పడి, కొంతకాలంగా అతనితో కలిసి ఉంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆరోగ్యానికి సంబంధించిన అనుమానాల నేపథ్యంలో సదరు వ్యక్తి వైద్య పరీక్షలు చేయించగా, వాటి ఫలితాల కారణంగా ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. అనంతరం ఆ మహిళను బీబీనగర్ చెరువు కట్ట సమీపంలో వదిలి వెళ్లినట్లు సమాచారం. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మహిళ చెరువులో దూకి ప్రాణాలు తీసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ విషయం పోలీసులకు చేరడంతో వారు వెంటనే రంగంలోకి దిగి, కేవలం 10 నిమిషాల్లో ఆమెను గుర్తించి సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కౌన్సెలింగ్ కూడా నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. మహిళ ఆరోగ్య పరిస్థితి, వ్యక్తిగత పరిస్థితులు, ఘటనకు దారితీసిన అసలు కారణాలపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## కెజిబివి పాఠశాలను సందర్శించిన జిల్లా అడిషనల్ కలెక్టర్



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని రాంపూర్ కెజిబివి పాఠశాలను మంగళవారం అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాల పరిశుభ్రత, నీటి వసతి, వంట గది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. 220 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో నీటికి ఇబ్బంది కలుగుతున్నదని ఎంపీడీవో గీతారెడ్డి అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో, వెంటనే ఈ విషయాన్ని గ్రిడ్ ఈ, ఈ కరుణాకర్ నీటి ఇబ్బందులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ డి.అనిత తదితరులు పాల్గొన్నారు.

## సర్‌ను వంద శాతం పూర్తి చేయాలి

ఎస్ఐఆర్‌పై బిఎల్ఎలతో ప్రభుత్వ విప్ వీరేశం సమీక్ష



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్ఏలు) సూచించారు. మంగళవారం నకిరేకల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎస్ఐఆర్‌పై సమీక్ష సమావేశాలు నిర్వహించారు మంగళవారం మండల కేంద్రంలోని శబరి గార్డెన్స్‌లో జరిగిన సమావేశానికి ప్రభుత్వ విప్ వీరేశంతో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్నా కైలాస్ నేత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేముల వీరేశం మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైందని అన్నారు. నార్కట్‌పల్లి మండలంలో ఇప్పటికే 91.6 శాతం సర్వే పూర్తి కావడం అభినందనీయమని పేర్కొన్న ఆయన, మిగిలిన 9 శాతం ప్రక్రియను వచ్చే రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ మువ్వా విజయ్ బాబు, ఈఆర్‌వో స్థాయి కోఆర్డినేటర్ చామల శ్రీనివాస్ జెర్రిపోతుల భరత్ గౌడ్, బత్తుల ఉషయ్య గౌడ్, గాయం శ్యాంసుందర్ రెడ్డి, సత్తు సత్తయ్య, గడ్డం పశుపతి, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జిల్లా కేంద్రంలోని ఎంఎఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి డిమాండ్ చేశారు. మంగళవారం ఐద్వా ఆధ్వర్యంలో పాఠశాలను సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు సరిపడ తరగతి గదులు లేవని, ఖాళీగా 3 టీచర్స్ పోస్టులు ఉన్నాయని, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్‌లు లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం వండేందుకు వంట గది కూడా లేక రేకుల షెడ్డులో వండుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి విద్యార్థుల కోసం లైబ్రరీ, సైన్స్ ల్యాబ్‌కు గదులు, వంట గది, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులను నియమించడంతోపాటు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి మేకనబోయిన సైదమ్మ, గుడిపూరి లక్ష్మి, పోతురాజు లక్ష్మి, శాంత పాల్గొన్నారు.

# తాగునీటి కొరత లేకుండా చర్యలు



జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ:** క్షేత్రస్థాయిలో ప్రత్యేక అధికారులు వారానికి రెండుసార్లు తప్పనిసరిగా పర్యటించి హాస్టళ్లు, గ్రామపంచాయతీలు, పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, వ్యవసాయ కేంద్రాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఎక్కడా తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలను వారానికి రెండుసార్లు సందర్శించి నివేదికలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు సమర్పించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించడంతో పాటు, గుడిసెల్లో నివసిస్తున్న అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, కేజీబీవీలు, గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, మిషన్ భగీరథ నీటి సరఫరా షెడ్యూల్ ప్రకారం అందించాలని ఆదేశించారు. మునుగోడు ప్రాంతంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్నందున బోర్లు మరమ్మతులు చేసి ప్రత్యామ్నాయ నీటి వనరులు సిద్ధంగా ఉంచాలని, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో అవసరమైన చోట ప్రత్యామ్నాయ నీటి సరఫరా చర్యలు చేపట్టాలని అన్నారు. గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న సీట్లను పేద విద్యార్థులకు వెంటనే భర్తీ చేసి వారికి విద్యావకాశాలు కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## కష్టపడ్డ ప్రతి కార్యకర్తకూ గుర్తింపు

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం) :** కష్టపడి పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. మండలంలో 100 శాతం ఓటరు మ్యాపింగ్ పూర్తి చేసిన బూత్ లెవల్ ఏజెంట్లను ప్రత్యేకంగా ఆయన అభినందించారు. ఈ సందర్భంగా బిఎల్‌ఏలకు ప్రోత్సాహకంగా నగదు బహుమతిని స్థానిక మండల పార్టీ కార్యాలయంలో అందజేశారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రభుత్వం పథకాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరవేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కందడి అనంతరెడ్డి, మాజీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, నాయకులు బత్తిని ఉప్పలయ్య గౌడ్, జె.నగేష్, కోసన కిష్టయ్య, కట్టెకోల హనుమంతు, సర్పంచులు ప్రజాప్రతినిధులు అనుబంధ సంఘాల నాయకులు బిఎల్‌ఎలు యూత్ కాంగ్రెస్ ఎన్ఎస్‌యుఐ నాయకులు పాల్గొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును కాపాడడంలో పూర్తిగా విఫలమైందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ నల్లగొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం సుభాష్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. యువకులు ప్లకార్డులు చేతబూని,కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన విద్యార్థియువజన నిరసనలు దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఆగ్రహానికి ప్రతీక అన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పరీక్షల లీకేజీలపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల న్నారు. ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎనమల్ల నవీన్, ఎసబోయిన మల్లేష్, గడ్డం నవీన్, జూలూరి మహేష్, బండారు శంకర్, కట్ట దశరథ్, బాబీ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# జలసంరక్షణ పనులకు అధికారులు ప్రాధాన్యత

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అధికారులు జలసిరి, తాగునీరు, జల సంరక్షణ పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వి.బి. రామ్‌జీ, స్వచ్ఛ భారత్, జలసిరి, ఎల్‌నినో, వ్యవసాయ సంబంధిత అంశాలపై జిల్లాలోని ఎంపిడిఓలు, ఎంపిఓలు, పంచాయితీ కార్యదర్శులతో ఆయన వెబ్‌ఎక్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల లక్ష్యాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సమర్పించి, మరుగుదొడ్డి లేని అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి మరుగుదొడ్డి మంజూరు చేయాలన్నారు. ఇందిరమ్మ, నాన్ ఇందిరమ్మ గృహాలకు సంబంధించిన ప్రతిపాదనలను విడివిడిగా సమర్పించాలని ఆదేశించారు. మంజూరైన మరుగుదొడ్లకు సంబంధించిన ఫోటోలను స్వచ్ఛ భారత్ మిషన్ యాప్‌లో అప్‌లోడ్ చేసి నిధులు పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంకుడు గుంతలు, బోరుబావుల పునరుద్ధరణ, ఇంటి పైకప్పుల వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు, వ్యవసాయ కుంటలు వంటి పనులకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఉద్యానవన, ఆయిల్ ఫామ్ రైతులను ప్రోత్సహించి వ్యవసాయ కుంటలు, బోరుబావుల పునరుద్ధరణ పనులను పెంచాలని సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పైకప్పుల వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలకు, ప్రతి గ్రామ సమాఖ్య భవనానికి సామూహిక పారిశుద్ధ్య సముదాయం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. పాఠశాల మరుగుదొడ్ల అంచనాలను వెంటనే సిద్ధం చేసి ఆమోదానికి పంపాలని తెలిపారు. అన్ని పథకాలలో సమాచారం ఖచ్చితత్వం, సకాలంలో ప్రతిపాదనల సమర్పణ, చెల్లింపుల పూర్తి, క్షేత్రస్థాయి ధృవీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, లక్ష్యాలు పూర్తయ్యే వరకు ప్రతిరోజు పర్యవేక్షణ, క్లస్టర్ వారీగా సమీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఓ పిడి సన్యాసయ్య, జడ్‌పి సిఈఓ శిరీష, డిపిఓ యాదగిరి, ఈజిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ‘సర్’లో మిర్యాలగూడను రాష్ట్రానికే ఆదర్శంగా నిలపాలి

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంను వంద శాతం పూర్తిచేసి రాష్ట్రంలోనే మిర్యాలగూడ నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజీవ్ భవన్‌లో ఆయన ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్‌నేత, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సర్ ఇన్‌చార్జ్ షబ్బీర్ అలీ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో పట్టణ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అయిన ఓటరు జాబితా ఖచ్చితత్వం అత్యంత కీలకమన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సర్ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని, అవసరమైన దరఖాస్తులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో, అంకితభావంతో పనిచేస్తే మిర్యాలగూడ నియోజకవర్గం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధాబాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పట్టణ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ‘సర్’లో బిఎల్ఏ, సూపర్‌వైజర్ల పాత్ర కీలకం



ఎమ్మెల్యే మందుల సామేల్

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** ఓటర్ నమోదు ప్రక్రియలో బిఎల్ఏ, సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్, సర్ ప్రక్రియ నియోజకవర్గ ఇంచార్జి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండేటి మల్లయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గ స్థాయి మండల అధ్యక్షులు, బిఎల్ఏలు, సూపర్‌వైజర్లు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఓట్లను తీసివేత ప్రక్రియకు పూనుకుందని, మాయ మాటలతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఓటర్ నమోదు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏలు, సూపర్‌వైజర్లు శక్తివంచన లేకుండా పనిచేస్తున్నారని అన్నారు. తుంగతుర్తి నియోజక వర్గంలో సుమారు 20 వేల ఓట్లు పోతాయని తెలిపారు. గ్రామాల్లో చనిపోయిన వారి సంఖ్య, గతంలో హైదరాబాద్‌లో, గ్రామాల్లో ఓట్లు ఉండేవని, ఇప్పుడు ఏదైన ఒకే చోట ఓట్లు ఉండే ఆస్కారం ఉందని తెలిపారు. తుంగతుర్తి మండల కేంద్రంలో సుమారు 56 అడుగుల జాతీయ జెండా ఏర్పాటుకు స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, పిఏసిఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు, మండల అధ్యక్షులు రేగటి రవి గౌడ్, పచ్చిపాల వెంకన్న, సుంకర జనార్ధన్, వెంకటేశం, మధుకర్ రెడ్డి, మల్లారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ గంగరాజు యాదవ్, నాయకులు మాచర్ల అనిల్, కొండ రాజు, అజయ్ పాల్గొన్నారు.

# ఆలేరు బిఆర్ఎస్‌లో ముదిరిన ‘పోరు’





**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత పోరు పరాకాష్టకు చేరింది. తాజా మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి చేసిన ఆరోపణలు, దానికి తోడు ప్రస్తుత ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఇచ్చిన ఇంటర్వ్యూ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్గా మారడంతో బీఆర్ఎస్ వర్గపోరు బహిరంగంగానే భగ్గుమంది. ఈ వివాదం ఏ స్థాయికి చేరిందంటే... ఆలేరు నియోజకవర్గ కేంద్రంలోని ప్రకాష్ గార్డెన్లో అంగరంగ వైభవంగా నిర్వహించాల్సిన మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ జన్మదిన వేడుకలు అర్ధాంతరంగా రద్దయ్యాయి. ఈ పరిణామంతో నాయకుల మధ్య పచ్చిగడ్డి వేస్తే మండేంతగా విభేదాలు తీవ్రమాయ్యాయని స్పష్టమవుతోంది.

**సునీత చాలా లేట్‌గా కళ్లు తెరిచింది: విప్ బీర్ల ఐలయ్య సెటైర్లు**

సునీత మహేందర్ రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలపై ఓ టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో స్పందించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మరింత మంట రాజేశారు. ‘గతంలో రెండుసార్లు సునీత చేతిలో ఓడిపోయిన భిక్షమయ్య గౌడ్, ఆమెను గెలిపించడానికి ఎందుకు పనిచేస్తారని సునీత అనుకుంది? ఆమె చాలా లేటుగా కళ్లు తెరిచింది’ అని ఎద్దేవా చేశారు. అంతేకాకుండా, ‘భిక్షమయ్య గౌడ్ అనుచరులు చాలామంది నాతో మాట్లాడినప్పుడు... 'సార్, ఆయన మీకే పనిచేస్తున్నాడు, మిమ్మల్నే గెలిపించమని మాకు చెప్పారు' అని నాతో స్పష్టంగా చెప్పారు‘ అంటూ ఐలయ్య సంచలన విషయాలను బయటపెట్టారు.

**నన్ను దగ్గరుండి ఓడగొట్టారు : గొంగిడి సునీత ఆవేదన**

అంతకుముందు గొంగిడి సునీత ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ‘తన శిష్యుడైన బీర్ల ఐలయ్యను గెలిపించడానికే భిక్షమయ్య గౌడ్ బీఆర్ఎస్లోకి వచ్చి దగ్గరుండి ఓడగొట్టారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు పాల్గొన్న ఎన్నికల సభల్లో కూడా ఆయన కనీసం నా పేరు ఎత్తలేదు, నాకు ఓటు వేయమని ప్రచారం చేయలేదు‘ అని విరుచుకుపడ్డారు. భిక్షమయ్య గౌడ్ పార్టీకి నమ్మకస్తుడు కాదని, ఆయనొక వెన్నుపోటుదారుడని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డీలిమిటేషన్ తర్వాత కెటిఆర్ ఆశీస్సులతో టికెట్ తనకే వస్తుందని భిక్షమయ్య చెప్పుకుంటున్నారని, అయితే కేసీఆర్ కుటుంబంలో కూతురి లాంటి తనకే ఆలేరు బీఆర్ఎస్ టికెట్ దక్కుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

**వైరల్ వీడియోలు.. రద్దయిన బర్త్‌డే వేడుకలు!**

వీరిద్దరి ఇంటర్వ్యూల క్లిప్పింగులు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ కావడంతో నియోజకవర్గంలో రాజకీయం ఒక్కసారిగా హీటెక్కింది. ఈ ఆరోపణలు ప్రత్యారోపణల తీవ్రతను తట్టుకోలేక, ఆలేరులోని ప్రకాష్ గార్డెన్స్‌లో ఘనంగా జరగాల్సిన తన పుట్టినరోజు వేడుకలను భిక్షమయ్య గౌడ్ రద్దు చేసుకోవడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. తన సొంత క్యాడర్‌తో ఇన్నాళ్లూ నియోజకవర్గంలో బలంగా ఉన్న భిక్షమయ్య, ఈ రగడతో తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది.

**మూడు ముక్కలాటగా ఆలేరు బీఆర్ఎస్.. ఆందోళనలో క్యాడర్**

ఒకవైపు గొంగిడి సునీత, మరోవైపు బూడిద భిక్షమయ్య గౌడ్, ఇంకోవైపు కల్లూరి రామచంద్రారెడ్డి... ఇలా నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధానంగా మూడు వర్గాలుగా విడిపోయి తిరుగుతుండటంతో గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు తీవ్ర అయోమయంలో పడ్డారు. ఎవరికి మద్దతు తెలిపినా మిగతా నేతల నుంచి ఇబ్బందులు తప్పవనే భయం కార్యకర్తల్లో నెలకొంది. ‘నాపై పోటీకి బీఆర్ఎస్‌లో ముగ్గురు నేతలు కొట్టుకుంటున్నారు’ అని బీర్ల ఐలయ్య అన్న మాటలు ఇప్పుడు నిజమయ్యాయని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు. పార్టీ అభివృద్ధికి అండగా ఉండే నాయకులను ప్రోత్సహించకపోతే, రాబోయే రోజుల్లో వర్గపోరు కారణంగా ఆలేరు స్థానం మళ్లీ కాంగ్రెస్ పావురం కావడం ఖాయమని గులాబీ శ్రేణులు హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం జోక్యం చేసుకుని ఆలేరు నాయకత్వంపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని స్థానిక బీఆర్ఎస్ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.



## రోడ్డు రోలర్ కింద బుల్లెట్ సైలెన్సర్లు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: ఎస్‌పి కె.నర్సింహ

**ప్రజాపక్షం/కోదాడ:** నిబంధనలకు విరుద్ధంగా బుల్లెట్ బైకులను మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చి అధిక శబ్దాలతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వాహనదారులపై కోదాడ పట్టణ, ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కఠిన చర్యలు చేపట్టారు. ఈ డ్రైవ్‌లో గుర్తించిన 40 మోడిఫైడ్ సైలెన్సర్లను మంగళవారం కోదాడ రంగా థియేటర్ చౌరస్తాలో జిల్లా ఎస్‌పి నర్సింహ సమక్షంలో రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి నర్సింహ మాట్లాడుతూ అతివేగంగా, అధిక శబ్దాలతో వాహనాలు నడుపుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమన్నారు. వృద్ధులు, రోగులు, చిన్నారులకు ఇలాంటి తీవ్ర అసౌకర్యం కలిగిస్తాయని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు కంపెనీ అమర్చిన సైలెన్సర్లనే ఉపయోగించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. యువత బాధ్యతయుతంగా వ్యవహరించిన ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రోడ్డు ప్రమాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. పట్టణంలో ప్రశాంతతకు భంగం కలిగించే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, టౌన్ ఇన్స్‌పెక్టర్ శివశంకర్‌నాయక్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## రైతుల చిరకాల కల సాకారం..



ధర్మారెడ్డిపల్లి కాలువలో సాగునీటి విడుదల

**ప్రజాపక్షం/వలిగొండ :** భువనగిరి నియోజకవర్గ రైతాంగం చిరకాలంగా ఎదురుచూస్తున్న శుభ ఘడియ ఆవిష్కృతమైంది. వలిగొండ మండలంలోని సంగెం ధర్మారెడ్డిపల్లి కాలువలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కలిసి సాగునీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా కాలువ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నీటిని విడుదల చేసిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దాదాపు రూ.125 కోట్ల వ్యయంతో చేపట్టిన ధర్మారెడ్డిపల్లి కాలువ నిర్మాణ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 16 నెలల్లోనే సగానికి పైగా పూర్తి చేసి, రైతులకు సాగునీటిని అందించే స్థాయికి తీసుకువచ్చిందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టుకు తమ ప్రభుత్వం వేగం తీసుకొచ్చి రైతుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిందని అన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు నాటికి ధర్మారెడ్డిపల్లి కాలువ నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో పూర్తి చేసి, రైతులకు శాశ్వతంగా సాగునీటిని అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాలువ పూర్తయిన అనంతరం వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో వ్యవసాయ ఉత్పత్తి పెరగడమే కాకుండా రైతుల ఆర్థికాభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ధర్మారెడ్డిపల్లి కాలువలో నీటి విడుదలతో ఈ ప్రాంత రైతుల చిరకాల నిరీక్షణకు తెరపడిందని, కాలువ పూర్తయిన తర్వాత ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మండల, గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, రైతులు, ఇరిగేషన్ ఇఇ, డిఇ, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
బుధవారం
22-07-2026
www.prajapaksham.in

అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగ వంశీ నిర్మించిన చిత్రం 'లెనిన్'. ఈ సినిమాకి మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు.

# రీల్



## షూటింగ్‌లో బాలకృష్ణకు గాయాలు


వృద్ధి సినిమా బ్యానర్‌పై బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎన్ బి కె 111 సినిమాలో బాలకృష్ణ కు ప్రమాదం జరిగింది. కాకినాడ ఎయిర్ పోర్ట్ ప్రాంగణంలో షూటింగ్ జరుగుతున్న నేపథ్యంలో అక్కడ కొన్ని కీలక యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. షూటింగ్ జరుగుతుండగానే బాలకృష్ణ ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డారు. దీంతో బాలకృష్ణ మోకాలికి దెబ్బ తగిలింది. వెంటనే బాలకృష్ణకు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గాయం తీవ్రతను తెలుసుకునేందుకు స్కానింగ్ కూడా నిర్వహించారు.వైద్యుల సలహా మేరకు మైనర్ సర్జరీ చెయ్యాల్సి ఉంటుందని బాలకృష్ణ మీడియా ప్రతినిధి బృందం తెలిపింది. బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని ఆయన అభిమానులు అంటున్నారు. త్వరగా కోలుకోవాలని ఫాన్స్ ప్రార్థనలు చేస్తున్నారు.

## 'రావే చెలియా' అంటున్న జై కృష్ణ

'రావే చెలియా' అంటున్నాడు సూపర్ స్టార్ కృష్ణ మనవడు. మహేష్ బాబు అన్న కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని అజయ్ భూపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానిని కూడా ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో సీనియర్ నటుడు డాక్టర్ మోహన్ బాబు విలన్ పాత్రను పోషిస్తున్నారు. నిర్మాత పి.కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అశ్విని దత్ సమర్పిస్తున్నారు. ఇప్పటివరకు విడుదలైన పాటలు, టీజర్లు, ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా మేకర్స్ ఈ చిత్రం నుంచి రావే చెలియా సాంగ్‌ని లాంచ్ చేశారు. జీవీ ప్రకాశ్ కుమార్ ఈ పాట ప్రేమ, భావోద్వేగాలతో హార్ట్ టచ్చింగ్ మెలోడీగా కంపోజ్ చేశారు. నాగ్ అర్జున్ రెడ్డి అందించిన మనసుని తాకే సాహిత్యానికి, కపిల్ కపిలన్ తన వోకల్స్ తో ప్రాణం పోశారు. జయకృష్ణ సినిమాటోగ్రఫీని నిర్వహించగా, జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. మాధవ్ కుమార్ గుళ్ళపాటి ఎడిటర్‌గా వ్యవహరిస్తుండగా, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైనర్. ఈ చిత్రం 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: జి.వి. ప్రకాష్ కుమార్, సినిమాటోగ్రఫీ: జయకృష్ణ,ఎడిటర్: మాధవ్ కుమార్ గుళ్ళపాటి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శాకమూరి నారాయణ స్వామి, ఫైట్స్: రియల్ సతీష్.



## 'నాకు ఒకే ఒక్క కూతురే .. పేరు మణెమ్మ' అంటున్న రవితేజ



రవితేజ హీరోగా, శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా ఇరుముడిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫస్ట్ గ్లింప్స్‌తో సినిమాపై ఆసక్తిని పెంచిన మేకర్స్, ఆ తర్వాత విడుదల చేసిన తొలి పాట 'ఇరుముడి కట్టు'తో ఆకట్టుకున్నారు. అయ్యప్ప స్వామిపై భక్తి భావాన్ని ఆవిష్కరించిన ఆ పాట చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. షూటింగ్ పార్ట్‌ను పూర్తి చేసిన రవితేజ ఇప్పుడు ఈ సినిమా డబ్బింగ్ పనులు కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన డబ్బింగ్ స్టూడియో వీడియో సోషల్ మీడియాలో ఆకట్టుకుంటోంది. వీడియోలో 'నాకు ఒకే ఒక్క కూతురే... పేరు మణెమ్మ' అంటూ రవితేజ ఎంతో ఎమోషనల్‌గా చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంది. ఆ ఒక్క డైలాగ్‌తోనే సినిమాలో తండ్రికూతురు మధ్య ఉండే బలమైన అనుబంధాన్ని దర్శకుడు చూపించబోతున్నారనే ఆసక్తిని మరింత పెంచారు. ఈ వీడియోలో బేబీ నక్షత్ర, దర్శకుడు శివ నిర్వాణ కూడా కనిపించారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ చివరి దశలో ఉండగా, కేవలం మూడు రోజుల చిత్రీకరణ మాత్ర మే మిగిలి ఉంది. దీంతో సినిమా అనుకున్న షెడ్యూల్ ప్రకారమే ఆగస్టు 21న గ్రాండ్‌గా థియేటర్ల లో విడుదల కానుంది. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి విష్ణు శర్మ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా పని చేస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: జివి ప్రకాష్ కుమార్. డిఒపి: విష్ణు శర్మ, రెడిటింగ్: ప్రవీణ్ పూడి, స్క్రిప్ట్ కోఆర్డినేటర్: నరేష్ బాబు పి.

## 'చెన్నై లవ్ స్టోరీ'కి యు/ఎ సర్టిఫికెట్

హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా 'కలర్ ఫోటో', 'బేబి' వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కెఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్ లో రూపొందుతున్న సినిమా 'చెన్నై లవ్ స్టోరీ'. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్‌పై ఎస్ కెఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మణిశర్మ 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాకు బ్లాక్ బస్టర్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ నెల 24న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు 'చెన్నై లవ్ స్టోరీ' మూవీ రెడీ అవుతోంది.తాజాగా ఈ చిత్ర సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ సినిమాకు సెన్సార్ నుంచి యు/ఎ సర్టిఫికేషన్ దక్కింది. ఇటీవల వచ్చిన ప్రేమ కథల్లో ఈ సినిమా విభిన్నంగా ఉందని కుటుంబం అంతా చూడగలిగే ఇలాంటి మంచి ప్రేమ కథలు మరిన్ని రావాలని సెన్సార్ సభ్యులు ప్రశంసించారు. మరోవైపు 'చెన్నై లవ్ స్టోరీ' మేకర్స్ అగ్రెసివ్ ప్రమోషనల్ యాక్టివిటీస్ చేస్తున్నారు. . 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాను ఈ నెల 23న విడుదల చేస్తున్నారు.



## 'మనసాగదే' సాంగ్ రిలీజ్

రాకింగ్ స్టార్ యష్ 'టాక్సిక్: ఎ ఫెయిరీ ఫర్ గ్రోన్‌అప్స్' నుంచి విడుదలైన తొలి పాట 'తబాహీ' రికార్డు బ్రేకింగ్ రెస్పాన్స్ తో చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు అదే జోష్‌ను కొనసాగిస్తూ మేకర్స్ రెండో పాట 'మనసాగదే' (తెలుగు వెర్షన్)ను విడుదల చేశారు. మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, కెవిఎన్ ప్రొడక్షన్స్, జీ మ్యూజిక్ కంపెనీ కలిసి ఈ పాటను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాయి.'తబాహీ' ప్రేమలోని ఉప్పొంగే ఉద్వేగాలను చూపిస్తే, 'మనసాగదే' మాత్రం ప్రేమలోని మరో కొత్త కోణాన్ని ప్రజెంట్ చేసింది. మనసులో దాచుకున్న భావాలు, తీరని తపన, మౌనంగా మిగిలిపోయిన ప్రేమను ఈ పాట ఎంతో అందంగా పలికిస్తుంది.ఈ పాటలో యష్, తారా సుతారియా రాయా, రెబెకా పాత్రల మధ్య బంధాన్ని పూర్తిగా కొత్త కోణంలో చూపించారు. వీరిద్దరి మధ్య కనిపించే కెమిస్ట్రీ, ఎమోషన్స్ కట్టిపడేసింది. 'తబాహీ' లో కనిపించిన రాయా పాత్ర ఈసారి మనసులో నడుస్తున్న సంఘర్షణను కూడా సూచిస్తుంది.తనిష్క్ బాగ్చి, అర్సాన్ నిజామీ, ఫహీమ్ అబ్దుల్లా స్వరపరిచిన ఈ రొమాంటిక్ మెలోడీకి సిద్ధార్థ్ బస్రూర్ తన వోకల్స్ టప్ ప్రాణం పోశారు. ఐదు భాషల్లో విడుదలైన ఈ పాట తెలుగు వెర్షన్‌కు 'మనసాగదే' టైటిల్ తో రిలీజ్ చేశారు. తెలుగు సాహిత్యాన్ని రామజోగయ్య శాస్త్రి అందించారు. హిందీలో 'మధోష్', కన్నడలో 'మనమోహక', తమిళంలో 'తడుమారు ధేయ్', మలయాళంలో 'మధుమోహిని' పేర్లతో ఈ పాట విడుదలైంది.ఈ చిత్రంలో యష్, నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. యష్, గీతు మోహన్‌దాస్ కలిసి కథను అందించగా, గీతు మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ నిర్మిస్తున్న 'టాక్సిక్: ఎ ఫెయిరీ ఫర్ గ్రోన్‌అప్స్' కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో తెరకెక్కుతోంది. తెలుగు, తమిళం, హిందీ, మలయాళంతో పాటు పలు భాషల్లో డబ్ వెర్షన్లు విడుదల కానున్నాయి. ఈ చిత్రం 2026 ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.









- ప్రధాని నరేంద్ర మోదీకి వామపక్ష విద్యార్థి సంఘాల అల్టిమేటమ్
- విద్యార్థులు, యువత రక్తం చూడడమేనా దేశభక్తి అని నిలదీత
- జంతర్‌మంతర్‌లో విద్యార్థి ఉద్యమానికి సంఘీభావంగా చలో లోక్‌భవన్
- అడ్డుకున్న పోలీసులు... విద్యార్థినేతల అరెస్టు

# ప్రధాన్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాల్సిందే

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర విద్యశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మం త్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాల్సిందేనని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి స్పష్టం చేశారు. ప్రజాసామ్య హక్కుల కోసం ఉద్యమిస్తున్న విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వ నిర్బంధ చర్యలను తీవ్రంగా ఖండించారు. దేశ విద్యార్థులు, యువత రక్తం చూ డడమేనా దేశభక్తి అన్ని ప్రశ్నించారు. న్యూఢిల్లీలో ని జంతర్‌మంతర్‌లో కొనసాగుతున్న విద్యార్థి ఉ ద్యమానికి సంఘీభావంగా మంగళవారం ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పిడిఎస్‌యు, ఎఐఎఫ్‌డిఎస్, తెలంగాణ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో 'ఛలో లోక్ భవ న్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసులు అడ్డుకుని విద్యార్థులను అరెస్టు చేయడాన్ని విద్యా ర్థి సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఖైరతాబాద్ చౌరస్తా నుంచి లోక్ భవన్ వైపు ర్యాలీ వెళ్లిన విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య కొద్ది సేపు తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. అప్పటికే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులను బలవంతంగా పోలీసు వాహనాల్లోకి ఎక్కించడంతో పలువురికి స్వల్పంగా గాయలైయ్యాయి. అదుపులోకి తీ సుకున్న విద్యార్థి నేతల ను ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రధాన్‌ను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాసే దాక తమ పోరాటం కొనసాగుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మ ణ్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు,పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి ఎస్. అనిల్,ఎఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున అల్టిమేటం ఇచ్చారు. ఢిల్లీలో పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులు, యువతపై జరిగిన లాఠీఛార్జీ, బాష్పవాయువు ప్రయోగాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన విద్యార్థి నాయకులందరినీ బేషరతుగా విడుదల చే యాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు.

జాతీయ విద్యా విధానం–2020 అమలు పేరుతో కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని ప్రై వేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ దిశగా తీసుకువెళ్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీక్ వంటి ఘటనలు, పరీక్షల నిర్వహణలో అవ్యవస్థ, విద్యార్థుల ఆత్మహత్యలు పెరగడానికి కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. అశోక్ రెడ్డి, ఎఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళీతో పాటు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా (మొదటి పేజీ తరువాయి)

దరఖాస్తులను స్వీకరిస్తారు. వాటి విచారణ, పరిష్కార ప్రక్రియ అక్టోబర్ 8 వరకు కొనసాగుతుంది. అనంతరం అక్టోబర్ 12న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. సవరించిన షెడ్యూల్‌ను కచ్చితంగా అమలు చేసేలా ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, బిఎల్‌ఓ సూపర్‌వైజర్లు, బిఎల్‌ఓలకు తగిన సూచనలు జారీ చేయాలని ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఎస్‌ఐఆర్–2026 పురోగతిని అన్ని స్థాయిల్లో నిరంతరం పర్యవేక్షిస్తూ, సవరించిన షెడ్యూల్‌ను విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.

## వేటు తథ్యం (మొదటి పేజీ తరువాయి)

అధికారులపై చర్యలు తప్పవని సిఎం గట్టిగా హెచ్చరించారు. భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్లు కేటాయింపుల విషయంలో తీవ్రంగా జాప్యం చేయడంపై ఆయన ఆగ్రహంవ్యక్తం చేశారు. వచ్చే వారంలోగా ప్లాట్ల పట్టాలు లబ్ధిదారులకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి పనులపై, మక్తల్–నారాయణపేట్–కొడంగల్ ఎత్తిపోతల పథకంపై సమీక్ష నిర్వహించారు. అనంతరం సిఎం మాట్లాడుతూ, సెప్టెంబర్ లోగా భూసేకరణ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎత్తిపోతల పథకానికి సంబంధించిన అదనపు పంపుల ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులన్నింటికీ వర్క్ ఆర్డర్ ఇచ్చి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే భూసేకరణ కు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి , భూసేకరణ పూర్తిచేయాలని కోరారు. మూడవ పంపు ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులన్నీ జరిగాయా లేదో క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేయాలని, పనుల విషయంలో తప్పుడు సమాచారం ఇస్తే అవసరమైతే సస్పెండ్ చేసేందుకు వెనకాడబోమని ముఖ్యమంత్రిహెచ్చరించారు. రంగారెడ్డి –వికారాబాద్ –నారాయణపేట్ ఔటర్‌రింగ్ రోడ్ల నిర్మాణం విషయమై అన్ని శాఖల సమన్వయంతో చర్చించి డిజైన్లు రూపొందించాలని, రోడ్‌కు సంబంధించిన భూ సేకరణ సెప్టెంబర్ 2026 లోగా పూర్తి చేయాలని కోరారు. ఆగస్టు 15,2028 లోగా పనులు పూర్తి చేసి ప్రారంభానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇండస్ట్రియల్ పార్కుల భూసేకరణ పై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. భూ సేకరణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే అవసరమైతే అక్టోబర్ లో పనితీరు ఆధారంగా కలెక్టర్లను బదిలీ చేస్తామని హెచ్చరించారు. కొడంగల్ నియోజకవర్గంలో ఎడ్యుకేషన్ హబ్ ,ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేయడం వల్ల హైదరాబాద్ నుండి కూడా విద్యార్థులు ఇక్కడికి వచ్చి చదువుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇందుకు రోడ్లు, మౌలిక సదుపాయాలన్నింటినీ కల్పించాల్సి ఉందన్నారు. బొంబాయి–పూణే కనెక్టివిటీ మాదిరాగానే శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి కొడంగల్ కు కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టికేంద్రీకరించాలని అదేశించారు. హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌లో సుమారు 7వేల మంది విద్యార్థులకు చదివే అవకాశం ఉందన్నారు. ఇండస్ట్రియల్ పార్కులు ,ఎడ్యుకేషన్ హబ్ అన్నింటికి సంబంధించిసెప్టెంబర్ 3లోగా కనీసం 5వేల నుండి 10వేల ఎకరాల భూమిని సేకరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అన్ని ఇ–రేడియల్ రోడ్లపైనే అధారపడి ఉన్నాయన్నారు.

## అప్రజాస్వామికం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్షాల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం అప్రజాస్వామికమని విమర్శించారు. ప్రధాని నివాసం వద్ద ధర్నా చేస్తున్న రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్ సహా పలువురు ఎంపిలను అరెస్టు చేయడం నియంతృత్వ ధోరణికి నిదర్శనమని పేర్కొన్నారు. పేపర్ లీకేజీలు, కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిరసనగా దేశం నలుమూలల నుంచి వేలాదిగా ఢిల్లీకి చేరుకున్న విద్యార్థులు, యువతపై కేసులు నమోదు చేసి బెదిరించడం సమర్థనీయం కాదన్నారు. వారిపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లాఠీచార్జ్‌కు బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డి మాండ్ చేశారు. సోనం వాంగ్‌చుక్‌తో కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని, ఆయన నిరాహార దీక్షను ముగించేలా చర్యలు తీసుకోవాలని కూనంనేని కోరారు. అలాగే హైదరాబాద్‌లోని లోక్‌భవన్ వద్ద నిరసన చేపట్టిన వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com